# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 6 సంచిక : 8 హైదరాబాద్ 85 ఆగస్ట్ 2008 పేజీలు : 52 రు. 10


- ఫోకస్ : మారుతున్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు
  ఆరు వ్యాసాలు
- అణు ఒప్పందంపై మూడు వ్యాసాలు
- ధరల పెరుగుదలకు కారణాలు
- పత్రికా స్వేచ్ఛ - సామాజిక న్యాయం
- భావ ప్రచారం ఎలా జరగాలి?

# వీక్షణం 85

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

ఆగస్ట్ 2008
సంపుటి : 6
సంచిక : 8



గౌరవ సంపాదకులు:
**వి. హనుమంతరావు**

సంపాదకులు:
**ఎన్. వేణుగోపాల్**

సహాయ సంపాదకులు
**డి.వి.రామకృష్ణారావు**

సర్క్యులేషన్ మేనేజర్
**వై. రామచంద్రం**
**9949391028**

కంపోజింగ్ & లే ఔట్
**సి. రాజశేఖర్**

ఆఫీస్ అసిస్టెంట్
**ఎస్. వెంకటేష్**


**వీక్షణం చందా వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | రు. | 120 |
| 3 సంవత్సరాల చందా | రు. | 350 |
| 5 సంవత్సరాల చందా | రు. | 550 |
| 10 సంవత్సరాల చందా | రు. | 1000 |


**'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా**

**వీక్షణం**
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : reachcdrc@yahoo.com



డిస్ట్రిబ్యూటర్స్
**ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.**
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
**చరితా ఇంప్రెషన్స్,**
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411


**సంపాదకీయం**

## విశ్వాస పరీక్షలో ఓడినదెవరు?

'కొండంత రాగంతీసి గోరంత పదం చెప్పినట్టు' అని సామెత చెప్పినట్టు లోక్‌సభలో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ విశ్వాస పరీక్ష ప్రభుత్వాన్ని కూల్చివేయబోతున్నట్టు, కాంగ్రెస్‌కూ భారతీయ జనతా పార్టీకీ భిన్నమైన మూడో ప్రత్యామ్నాయాన్ని ప్రతిష్ఠించబోతున్నట్టు, అమెరికాతో అణు ఒప్పందానికి వ్యతిరేకంగా బ్రహ్మాండం బద్దలు కానున్నట్టు అనేక భారీ వాగ్దానాలు చేసి చివరికి తుస్సుమంది. ప్రభుత్వపక్షం అసలు గెలుస్తుందా లేదా, గెలిచినా ఒకటో అరో వోట్లతోనే, చివరికి స్పీకర్ వోటుతోనో గెలుస్తుందా అనే అనుమానాలన్నిటినీ వమ్ము చేస్తూ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీలు కావలసిన ఆధిక్యత కన్న ఎక్కువమంది ఎం.పి.లను కొనేశాయి. ఈ మొత్తం పరిణామాలలో ప్రభుత్వం పై విశ్వాసం కన్న ఎక్కువగా మన ప్రజా ప్రతినిధులనబడేవారికి డబ్బు మీద అమ్ముడుపోవడం మీద ఉన్న విశ్వాసం బయటపడింది. ఈ విశ్వాస పరీక్షకూ అణు ఒప్పందానికీ ఏమీ సంబంధం లేదని ముందు నుంచీ ఊహిస్తున్నదే. గత అరవై సంవత్సరాల చరిత్రలో లోక్‌సభ విశ్వాసంలేని ప్రభుత్వాలు, మైనారిటీ ప్రభుత్వాలు, పదమూడు రోజులు, పదమూడు నెలలు ఏలిన ప్రభుత్వాలు కూడా దేశాన్ని తెగనమ్మే, తాకట్టుపెట్టే అవమానకరమైన ఒప్పందాలను చేసుకున్నాయి. కనుక విశ్వాస పరీక్షకూ అణు ఒప్పందానికీ మధ్య సంబంధం ఏమీ చూడనక్కరలేదు గాని, దానికదిగానే ఈ విశ్వాస పరీక్ష ఈ దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు డొల్లతనాన్ని, దివాళాకోరుతనాన్ని బయటపెట్టింది. ఈ వ్యవహారంలో మొదటినుంచి చివరిదాకా ఎన్నో అపసవ్యమైన అంశాలు, గందరగోళాలు, అవినీతి, రాజకీయ కుటిల ఎత్తుగడలు, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సాగిన బేరసారాలు ఉన్నాయి. ఐక్య సంఘటనగా ప్రభుత్వంలో ఉండిన యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌కు అణు ఒప్పందం వ్యవహారంపై తమ మద్దతు ఉపసంహరిస్తున్నామని వామపక్షాలు ప్రకటించడంతో, అణు ఒప్పందాన్ని తాము కూడా వ్యతిరేకిస్తున్నామని భాజపా నాయకత్వంలోని ఎన్.డి.ఎ. కూటమి ప్రకటించడంతో యు.పి.ఎ. ప్రభుత్వం లోక్‌సభలో విశ్వాస పరీక్షకు నిలబడవలసి వచ్చింది. అసలు ఈ రెండు ప్రకటనలూ లోపపూరితమైనవే. అణు ఒప్పందం విషయంలో ఇవాళ జరుగుతున్న వ్యవహారం ఎన్.డి.ఎ. ప్రభుత్వ కాలంలో జరిగిన పనులకు కొనసాగింపే. రేపు ఎన్.డి.ఎ. ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చినా ఆ ఒప్పందాన్ని కొనసాగిస్తారు, అమలు చేస్తారు. అలాగే వామపక్షాలు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడానికి ప్రస్తుత సమయం ఎంచుకోవడం రాజకీయ ఎత్తుగడ, రానున్న ఎన్నికలలో ఎక్కువ స్థానాల కోసం బేరాసారాలలో భాగమే తప్ప అణు విద్యుత్తు పైన సైద్ధాంతిక నిబద్ధత కాదు. మన్మోహన్ సింగ్ అమెరికా అనుకూల విధానాలు అనుసరిస్తున్నాడని కొత్తగా జ్ఞానోదయం కావలసిందేమీలేదు. అంటే ఇవాళ అణు ఒప్పందం విషయంలో భిన్న శిబిరాలుగా కనబడుతున్న పాలకపక్షం, ప్రధాన ప్రతిపక్ష కూటమి, మూడో ప్రత్యామ్నాయంగా ఎదగదలచుకున్న కూటమి – మూడు పక్షాలూ ప్రజలను వంచించడంలో, ఒక ప్రయోజనం ఆశించి పనిచేస్తూ, ప్రజలకు మరొక మాటలు చెప్పడంలో పోటీలు పడుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకూ, రాజకీయ సార్వభౌమాధికారానికీ, ప్రజారోగ్యానికీ, వనరుల మళ్లింపుకూ దారితీయగల, ప్రమాదకర ప్రభావం వేయగల అణు విద్యుదుత్పత్తి విషయంలో ఈ మూడు పక్షాల ఆలోచనా ఒకటే. కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీల వైఖరుల గురించి ఎవరికీ భ్రమలు లేకపోవచ్చు గాని, విశ్వాస పరీక్ష విషయంలో సోమనాథ్ చటర్జీ తీసుకున్న వైఖరి, అణు ఒప్పందాన్ని వ్యతిరేకించనక్కరలేదని జ్యోతిబసు చేసిన వ్యాఖ్య, విశ్వాస పరీక్ష ముగియగానే అణు ఒప్పందం చాలా చిన్న విషయం అని నీలోత్పల్ బసు చేసిన వ్యాఖ్య వామపక్షాల డొల్లతనాన్ని కూడ చూపుతున్నాయి. ఆ అర్థంలో విశ్వాస పరీక్ష ప్రభుత్వం పట్ల పార్లమెంట్ సభ్యుల విశ్వాసానికి కాదు, రాజకీయ పార్టీల పట్ల ప్రజల విశ్వాసానికి పరీక్ష పెట్టింది. ఆ పరీక్షలో పార్లమెంటరీ రాజకీయ పక్షాలన్నీ ఓడిపోయాయి. ◆

## దేవేందర్ గౌడ్

రెండు దశాబ్దాలకు పైగా తెలుగుదేశంలో ఉంటూ, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, తెలుగుదేశం ప్రభుత్వాలలో చాల ముఖ్యమైన మంత్రివర్గ సభ్యుడిగా ప్రధాన నిర్ణయాధికారం అనుభవించిన దేవేందర్ గౌడ్ ఆ పార్టీని వదిలిపెట్టి బయటికి వచ్చారు. ఆ పార్టీ విధానాల మీద చాల విమర్శలు చేస్తున్నారు. ఇంతకాలం పనిచేసిన పార్టీని వదలిరావడం తన తెలంగాణ నిబద్ధతకు నిదర్శనంగా ఆయన చెప్పుకోవచ్చుగాని అది అంత విశ్వసనీయంగా లేదు. తెలంగాణ ఒక ముఖ్యమైన రాజకీయ నినాదంగా మారిందని, ఆ నినాదానికి వెనుకబడిన కులాల నుంచి నాయకత్వం లేదని, తాను ప్రవేశిస్తే ఆ స్థానం తనకు దక్కుతుందనే ఆలోచనతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అంటే రెండోస్థాయి నాయకుడి స్థానం నుంచి అధినాయకుడి స్థానానికి ఎదగడానికి ఈ నినాదం, ఈ వేదిక తనకు పనికి వస్తాయనే ఆలోచనే ఆయన నిర్ణయానికి దారితీసి ఉంటుంది. తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న ఏకవ్యక్తి నియంతృత్వం, తెలంగాణ వ్యతిరేకత, గత కొద్దినెలలుగా తన పట్ల కొనసాగుతున్న వివక్ష వంటి కారణాలు కూడ అందుకు తోడ్పడి ఉండవచ్చు. శాసనసభ ఎన్నికలు కొద్ది నెలలలో జరగవలసి ఉండడం ఆయన నిర్ణయానికి తగిన సందర్భాన్ని అందించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది నాయకత్వ కాంక్షనుంచి, ఒకరకమైన ఆత్మగౌరవ కాంక్ష నుంచి, ఎన్నికల ఎత్తుగడగా జరిగిన చర్యేగాని దానికి అంతకన్న ఎక్కువ అర్థాన్ని ఆపాదించి అది ఒక తెలంగాణ ప్రజా ఆకాంక్షకు అనుగుణమైన చర్యగా చూడనక్కరలేదు. అసలు మన పాలకవర్గ రాజకీయ పక్షాలలో ఉన్నతస్థానాలకు ఎదిగిన నాయకులలో, వాళ్లు ఎంతగా దళితవర్గాల నుంచి, వెనుకబడిన కులాల నుంచి, అణగారిన వర్గాలనుంచి వచ్చిన వాళ్లయినప్పటికీ వాళ్లకు ప్రజలపట్ల, ప్రజా ఆకాంక్షలపట్ల గౌరవాదరాలు మిగలడం లేదనేది ఒక చేదు వాస్తవం. ఒక్క ఉదాహరణ ఇవ్వాలంటే, ఇవాళ తెలంగాణ గురించి, తెలంగాణ ప్రజా ఆకాంక్షల గురించి ఇంతగా మాట్లాడుతున్న వ్యక్తి తెలుగుదేశం హయాంలో అతి ఎక్కువకాలం పోలీసు మంత్రిగా పనిచేసి, తెలంగాణ ప్రజలమీద, తెలంగాణ ఆకాంక్షల కోసం పనిచేస్తున్న ఉద్యమకారులమీద భయంకరమైన హింసకు నాయకత్వం వహించారనీ, కనీసం బయటికి వచ్చిన తర్వాత ఒక్కమాట పశ్చాత్తాపమైనా ప్రకటించలేదని గుర్తించవలసి ఉంది.

## వర్షాభావం

ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి బంగాళాఖాతంలో అల్పపీడనద్రోణి ప్రభావం వల్ల వర్షాలు కురవవచ్చునన్న సంకేతాలు ఉన్నాయి గాని, ఇప్పటికి ఆరువారాలుగా సాగుతున్న వర్షాకాలం వట్టిపోయింది. మృగశిర కార్తె ప్రారంభంలో ఒకటి రెండు జల్లులు పడినప్పటికీ ఆ తర్వాత జరిగిన ఐదు వారాలలోనూ రాష్ట్రంలో ఎక్కడా సాధారణ వర్షపాతం కాదుగదా, సగమో పావో కూడా నమోదుకాలేదు. రెండు ప్రధాన నదుల ఎగువ పరీవాహక ప్రాంతాలలో కూడా వర్షాభావం నెలకొనడం వల్ల రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులలో కనీసస్థాయి నీటి నిలువలు కూడ లేకుండాపోయాయి. వరుసగా నాలుగు సంవత్సరాలుగా మంచి వర్షాలు పడినప్పటికీ, ఈ ఆరువారాల వర్షాభావానికి రాష్ట్రం అల్లకల్లోలమయ్యే పరిస్థితి వచ్చిందంటే మన రాజకీయార్థిక విధానాల దుష్ఫలితాలు తేటతెల్లమవుతున్నాయి. నాలుగు సంవత్సరాలు కాలం సక్రమంగా ఉన్న తర్వాత ఒక సంవత్సరం కాలం కాకపోయినా తాగునీటికీ సాగునీటికీ పంటలకూ విద్యుత్తుకూ కొరత ఏర్పడనక్కరలేదు. కాని ఈ ఖరీఫ్ మొదలయినప్పటినుంచీ వర్షాలు కురవకపోతే ఎటువంటి వ్యవసాయ, పంటల విధానాన్ని అనుసరించాలన్న ప్రణాళికలేదు. ఎటువంటి విత్తనాలు కావాలన్న ముందుచూపు లేదు, ప్రాజెక్టులలోని నీటిని పొదుపుగా వాడవలసి ఉంటుందనే ఆలోచన గత నాలుగు సంవత్సరాలుగా ఎట్లాగూలేదు. చివరికి జలవిద్యుత్ కొరత ఏర్పడి వర్షాకాలంలో కూడ విద్యుత్ కోతలు విధించవలసిన స్థితి వచ్చింది. తమ రాజకీయార్థిక విధానాలవల్ల, తమకు ముందుచూపు లేకపోవడం వల్ల వచ్చిన సంక్షోభాన్ని ఎదుర్కొనే, పరిష్కరించలేని అసమర్థతను ప్రభుత్వం స్పష్టంగా బయటపెట్టుకుంది. తమ లోపాలకు బాధ్యతను ప్రకృతి మీదికి నెట్టింది. మరోవైపు హడావుడిగా మేఘమథనం వంటి తక్షణ చర్యలలో వైఫల్యం, యజ్ఞ యాగాల వంటి మూఢనమ్మకాల వైపు దృష్టి మరల్చడం, లేదా ప్రతిపక్ష నాయకుడి యాత్రవల్లనే వర్షాలు కురవడం లేదని హాస్యాస్పద వ్యాఖ్యలు చేయడం – ఒక్కమాటలో ఈ ప్రభుత్వం ఎనిమిదికోట్ల ప్రజల సౌభాగ్యం గురించి ఆలోచించడానికి తగిన శక్తి సామర్థ్యాలు గల ప్రభుత్వం కాదని చూపుకుంది. ఇది దైవాధీన, వర్షాధార, యాదృచ్ఛిక ప్రభుత్వమే తప్ప సక్రమమైన, ప్రణాళికాబద్ధమైన ప్రభుత్వం కాదని చూపుకుంది.

## నేపాల్ పరిణామాలు

పాలకవర్గ పార్టీలతో కలిసి పార్లమెంటరీ చట్రంలోపల పని చేయడం, ప్రత్యామ్నాయ, ప్రజా రాజకీయాలు నడపదలచుకున్న వారికి సాధ్యం కాదని నేపాల్ పరిణామాలు మరొకసారి చూపుతున్నాయి. నిజానికి ఈ ప్రయోగం తూర్పు యూరప్‌లోనూ, లాటిన్ అమెరికాలోనూ ఎన్నో సార్లు జరిగింది. మన దేశంలో కేరళలో జరిగి విఫలమైంది. ఆ ప్రయోగాలు జరిగిన అన్ని సందర్భాలలోనూ పాలకవర్గ ప్రయోజనాల కొరకు ప్రజా ప్రయోజనాలను బలిపెట్టడమే జరిగింది కాని, ప్రత్యామ్నాయ రాజకీయ విశ్వాసాలు ఉన్నాయని చెప్పుకున్నవారు రాజీ పడి తమ రాజకీయాలను ఒదులుకోవడమే జరిగింది కాని, ప్రజా ప్రయోజనాలు నెరవేరలేదు. 21వ శతాబ్దపు సోషలిజాన్ని సాధిస్తామని చెప్పుకున్న నేపాల్ మావోయిస్టులు పార్లమెంటరీ ఎన్నికలలో అత్యధిక స్థానాలు సాధించికూడా తాము ఇన్నాళ్లు ప్రకటించుకున్న ఆదర్శాలలో కొన్నిటినైనా అమలు చేయడంలో విఫలమౌతున్నారు. భూమి సమస్య, విదేశీ పెట్టుబడి సమస్య, దళిత సమస్య, జాతుల సమస్య, రాచరికం సమస్య – ఈ ఐదు సమస్యలను పరిష్కరించడానికి ప్రారంభమైన సాయుధ పోరాటం పార్లమెంటరీ మార్గంలోకి ప్రవేశించి ఒక్క రాచరికపు సమస్యను మాత్రం పరిష్కరించినట్టు కనబడుతోంది. మిగిలిన సమస్యలను ప్రస్తావించడం కూడా లేదు. మరోపక్క అధ్యక్ష అభ్యర్థిగా తాము నిలబెట్టిన అభ్యర్థిని గెలిపించుకోలేకపోవడం, ప్రతీఘాతుక విప్లవానికి దేశంలోని పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించడం, నేపాల్ రాజసైన్యం అనే పేరు మార్చుకున్న నరహంతక సైన్యంతో తమ ప్రజాసైన్యాన్ని సమైక్యం చేస్తామని ప్రకటించడం, ఇన్నాళ్లు భారత పాలకవర్గాల పెత్తందారీతనం పట్ల చేసిన తీవ్రమైన విమర్శలను ఒదులుకొని వారితో మైత్రికి ప్రయత్నించడం – ఏ ఒక్క చర్య చూసినా పార్లమెంటరీ అధికార పీఠంలోకి చేరిన తరువాత మావోయిస్టులు తమ మౌలిక ఆదర్శాలను ఒదులుకున్నట్టు కనబడుతున్నది. గత పది సంవత్సరాలు గొప్ప ఆశను కల్పించిన మన పొరుగు విప్లవం ఈ స్థితికి చేరడం విషాదకరం. ◆

# లోపలి పేజీల్లో...



## ఫోకస్ : మారుతున్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు

నిత్యజీవిత సమస్యలు, చదువుకున్నవారి నిరుద్యోగిత, వ్యవసాయ సంక్షోభం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను చాలావరకు నిర్దేశిస్తున్నాయి. రేపటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతే ఈ కారణాలవల్లే ఓడిపోతుంది. ప్రత్యామ్నాయ పార్టీలు పుడితే ఈ సంక్షోభంలో నుండే పుడుతాయి. కోట్లాది గ్రామీణ ప్రజలే రాజకీయాలను మారుస్తారు. వాళ్ల చైతన్యస్థాయిని సరిగా అంచనా వేయగలిగితేనే రాష్ట్రంలో మారుతున్న రాజకీయాలు అర్థమౌతాయి.



'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

### రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు

### చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.


మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028










- **స్ఫూర్తి ప్రదాత** – మందగడ్డ విక్రమ్ కుమార్, కొలిమి కృష్ణయ్య – సహచర ప్రచురణ – 26 పేజీలు, 1/10 డెమీ, రు. 10, ప్రతులకు : సహచర ప్రచురణలు, భగత్‌సింగ్ భవన్, 3–128, చందానగర్, శేర్‌లింగంపల్లి సర్కిల్ – 2, హైదరాబాద్ – 500 050. ఫోన్ : 040 – 23030305, 9391050963

- **రెక్కలు పొదిగిన చూపు** – కవిత్వం – డా. లక్ష్మీ సుహాసిని – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : డా. డి.ఎల్. సుహాసిని, తెలుగు రీడర్, డి.ఆర్.డబ్ల్యు. కాలేజ్, గూడూరు, నెల్లూరు జిల్లా. సెల్ : 9885288443 ; మణి బుక్‌స్టాల్ నెల్లూరు, విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్, మైత్రి బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, తెలుగు బుక్‌హౌస్

- **శ్రీగిరిరాజు కథలు** – శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి – భీమన్న సాహితీ నిధి – 156 పేజీలు, 1/8 డెమీ, రు. 51, ప్రతులకు : భీమన్న సాహితీ నిధి, ఐ.సి. 85, ఎర్ర మంజిల్ కాలనీ, హైదరాబాద్ – 500 082. ఫోన్ : 92465 71113

- **విష కౌగిలి 123** – అనుబంధ నానీలు – వల్లభాపురం జనార్దన – సాహితీ స్రవంతి ప్రచురణ, 35 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు : జయశ్రీ, 1–4–11, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్ – 509 001; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్

- **మట్టి పాట** – పల్లె జీవన శతకం – ఏనుగు నరసింహారెడ్డి – స్పృహ సాహితీ సంస్థ ప్రచురణ, 57 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : జూలూరు గౌరీశంకర్, 1–8–702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500 044; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో


- **జీవశాస్త్ర విజ్ఞానం సమాజం** – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్ – జనసాహితి ప్రచురణ, 207 పేజీలు, 1/8 డెమీ, రు. 50
- **గాంధీవాద శవపరీక్ష** – యశ్‌పాల్; హిందీమూలం – తెలుగు అనువాదం – సమతారావు – జనసాహితి ప్రచురణ, 120 పేజీలు, 1/8 డెమీ, రు. 25

  పై రెండు పుస్తకాల ప్రతులకు : మైత్రి బుక్ హౌస్, జలీల్ వీథి, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ – 520 002. ఫోన్ : 9848631604


- **వాకపల్లి** – తుపాకులతో బాక్సైట్ గనులు తవ్వుతారా? – దిక్సూచి ప్రచురణలు – 77 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : గోరు మాధవరావు, బొడ్డపాడు గ్రామం, పలాస మండలం, శ్రీకాకుళం జిల్లా; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

- **ప్రభుత్వం మీ భూమికోసం వస్తే...** – మానవ హక్కుల వేదిక (ఎచ్.ఆర్.ఎఫ్.) ప్రచురణ, 12 పేజీలు, 1/8 డెమీ, రు. 2, ప్రతులకు : కె. బాలగోపాల్ – 040 – 23537969; ఎస్. జీవన్‌కుమార్ – 040 – 27039519

- **దాడి** – నవల – పెద్దింటి అశోక్ కుమార్ – తెలంగాణ రచయితల వేదిక ప్రచురణ, 171 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : పెద్దింటి అశోక్‌కుమార్, మల్లారెడ్డిపేట (పో), గంభీరావుపేట (మం), కరీంనగర్ జిల్లా – 505 304. సెల్ : 9441672428; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో








# పాఠకుల వీక్షణం

**జూ**లై 2008 వీక్షణం సంచిక చూసాను. బోరసుభాష్‌గారు రాసిన 'ప్రజలపై పెట్రోభారం' వ్యాసం చూసి కొంత ఆశ్చర్యానికి గురయ్యాను. 6 జూన్ 2008న సి.పి.ఐ. (ఎం.ఎల్.) జనశక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కరపత్రం ప్రచురించింది. తిరిగి 20 జూన్ 2008న 'జనశక్తి' పక్షపత్రికలో మొదటి పేజీలో ప్రచురించిన వ్యాసమిది. దీనిలో రెండు పేరాలనూ, ఉపశీర్షికలనూ మాత్రమే తొలగించి యథాతథంగా బోరసుభాష్ పేర మీ పత్రికలో ప్రచురణ అయింది. మీ పరిశీలన కోసం కరపత్ర ప్రతిని జతపరుస్తున్నాను.

ఒక సంస్థ తన పరిశీలననూ, వైఖరినీ తెలుపుతూ ప్రచురించిన వ్యాసాన్ని మరొకరు తమ స్వంత రచనగా పంపటం విచారకరం. బోర సుభాష్ గారికిదొక అలవాటుగా మారినట్లుంది. జరిగిన విషయాన్ని మీ దృష్టికి తెచ్చేందుకు ఈ లేఖను రాస్తున్నాను.

**– పి. జస్వంతరావు**
సంపాదకుడు, జనశక్తి పక్షపత్రిక
విజయవాడ

**జ**రిగిన పొరపాటుకు చింతిస్తున్నాం.

**– సం.**

**'వీ**క్షణం అప్పుడప్పుడూ చదువుతున్నాను. పక్షపాతం లేకుండా అన్ని అభిప్రాయాలకు సమాన అవకాశాన్ని ఇస్తున్న వ్యాసాలకు ధన్యవాదాలు. వ్యాసాలు కొన్ని మొక్కుబడి వ్యవహారంలా అనిపిస్తున్నాయి. రెండు మూడు పేజీల్లో సమగ్రమైన విశ్లేషణ చేయటం కుదరదు. అలాంటి సందర్భంలో ఆయా వ్యాసాలను రెండు మూడు సంచికలకు పొడిగించొచ్చు. రోహిణీప్రసాద్ గారి వ్యాసాలు చాలా బాగుంటున్నాయి. ఇ.పి.డబ్ల్యు, సోషల్ సైన్స్ స్థాయిలో లేకపోయినా తెలుగులో ఈ మాత్రం ఇంటలెక్చువల్ పత్రిక రావటం శుభపరిణామం. మీ కృషి ఫలించాలని నా కోరిక. డా. బండి సాంబయ్య గారి వ్యాసం మొదట్లో 'మనుస్మృతి ద్వారా బీజాలు పడిన కులవ్యవస్థ దినదినాభివృద్ధి చెందుతూ, నేడు తీవ్రస్థాయికి చేరుకుంది' అన్నారు. ఇది ఒక స్వీపింగ్ కామెంట్‌లా కనిపిస్తుంది. ఈ తీవ్రస్థాయి ఏమిటో సోదాహరణగా వివరించి ఉంటే ఇంకా బాగుండేది. ఏ సమస్యకయినా ఒకే కోణం ఉండదు. అన్ని కోణాలనూ విశ్లేషించే వ్యాసాలు రావటం అవసరం. ఆ అవసరాన్ని వీక్షణం తీరుస్తుందని ఆశిస్తాను.

**– సి.ఎచ్. శ్రీనివాసమూర్తి**
వరంగల్

**జూ**లై నెల వీక్షణంలో కృపాకర్ మాదిగ గారి వ్యాసం ఆలోచనాత్మకంగా ఉంది. నేనింతవరకు దళిత సమస్యలో ఈ కోణం గురించి ఆలోచించలేదు. దీని ఆంగ్ల అనువాదం, స్వతంత్రంగానో, 'వీక్షణం' సహాయంతోనో ఆంగ్ల పత్రికలకు పంపి ప్రధాన స్రవంతి (జాతీయ స్థాయి)లో ప్రచురించే ప్రయత్నం చేయాలి.

పోతే, నావి కొన్ని ప్రశ్నలు. ఆంధ్రజ్యోతి వివాదం కారణంగా, మీడియాలోని కుల, దళిత వివక్షను ప్రస్తావించటం జరిగింది. మరి, ఇతర రంగాల మాటేమిటి? ఉదాహరణకు, ఐ.టి. కంపెనీలు, కార్పొరేట్ ఆసుపత్రులు దళితులకు ఎంత స్థానం కల్పిస్తున్నాయి? అసలు మాదిగలలో అక్షరాస్యత ఎంత? వారి విద్యా వ్యవస్థ ఎలాగుంది? కృష్ణ, కృపాకర్ గార్లవంటి వారి సంతానం పట్టణాలలో 'మంచి' స్కూళ్లలో చదువుతున్నారేమో తెలియదు. ఇతరత్రా పరిస్థితి ఎలాగుంది? మాదిగలలో చాలామంది క్రైస్తవులుగా మారారు. వారి విద్యా అవకాశాలు నిజంగా బాగు పడినాయా?

రాజకీయ పార్టీల మాటేమిటి? రాజ్యాంగ నిర్దేశానుసారం కొన్ని రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉన్నాయి కాబట్టి, ఎం.ఎల్.ఎ.లు, ఎం.పి.లు కావచ్చు. కానీ వామపక్షాలతో సహా అన్ని ప్రధాన పార్టీలు అగ్రకులాల గుప్పిట్లోనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో రెండే రెండు అగ్రకులాల ఆధిపత్యంలో ఉన్నాయి. పార్టీల నిర్ణాయక సంఘాలలో (పొలిట్ బ్యూరో వంటివి) మాదిగలకు స్థానం కల్పిస్తున్నారా? కల్పించినా వారి గొంతుక వినపడనిస్తున్నారా? ప్రభుత్వంలో రిజర్వేషన్ అమలులో ఉన్న స్థానాలలో ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలలోని దళితులకు దామాషా పద్ధతిలో చోటు దొరుకుతున్నదా? ఈ విషయాలపై కూడా వ్యాసాలు రావలసిన అవసరమున్నదని నా అభిప్రాయం.

చివరగా ఒక ప్రశ్న. మీడియాకు జెండర్ ఉంది. అది మగది అన్నారు. దళితులలో పురుషాధిక్యం లేదా?

**– కమల జయరావు**
హైదరాబాద్

**'వీ**క్షణం' మాసపత్రికను ఒకటి రెండు సంచికలు చదివాను. ఎన్నో అంశాలపై లోతైన వ్యాసాలు ప్రచురించారు. రెగ్యులర్‌గా చదవాలని ఉన్నప్పటికీ జైల్లో ఉన్నకారణంగా చదవలేకపోతున్నాను. నెల నెలా మీరు పత్రికను జైలు చిరునామాకు పంపించినట్లయితే నాతోపాటు మరికొంతమంది ఖైదీలు కూడా చదువుకోవడానికి వీలవుతుంది. కాలక్షేపానికి కాకుండా, కార్యకారణ సంబంధాలు తెలుసుకోవడానికి వీక్షణం మాకు సహకరిస్తుందని ఆశిస్తున్నాను.

**– కె. నాగయ్య**
చర్లపల్లి కారాగారం

**'వీ**క్షణం' జూలై సంచికలో ఆంధ్రజ్యోతిపై దాడికి సంబంధించి కె. సత్యనారాయణ, కృపాకర్ మాదిగ గార్ల వ్యాసాలు చదివాను. కృపాకర్‌గారి వ్యాసం చాలా పదునుగా ఉంది. ఎస్.సి., ఎస్.టి.ల వంటి వారి గురించి మాట్లాడినప్పుడల్లా దళితుల పేర, బి.సి.ల గురించి మాట్లాడటం, కలిపి మాట్లాడటం ఎంత వరకు సమంజసం అన్నది కొంచెం ఆలోచించాలి.

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని కొన్ని బి.సి. కులాలను పరిశీలిస్తే ఈ ఆలోచన రాకపోదు. నేను, ఉత్తరాంధ్ర నుంచి కొన్ని ఉదాహరణలిస్తాను. శ్రీకాకుళం జిల్లాలో కాళింగ–బూరగాని కాళింగ, కింతలి కాళింగ అని స్థూలంగా రెండు రకాలు. విశాఖపట్నం జిల్లా అనకాపల్లి పరిసరాల్లో గవర, నర్సీపట్నం అ పరిసరాల్లో వెలమ – వీరు మళ్లీ పోలినాటి వెలమ, కొప్పుల వెలమ అని రెండు రకాలు. వీళ్ల గురించి పరిశీలిస్తే – వీరు ఆయా ప్రాంతాల్లో సాంఘిక, రాజకీయ రంగాల్లో బాగా పరపతి ఉన్నవారు. (ఇక్కడ పద్మనాయక లేక రాచ వెలమ గురించి మాట్లాడటం లేదు) ఈ మూడు కులాల్లోనూ జిల్లా పరిషత్ ఛైర్మన్ల మొదలు క్యాబినెట్ మంత్రుల దాకా ఉన్నారు ఇప్పటికీ. వీరిని దళితులనడం తగదు. వీరిలో అట్టడుగు వర్గం కొంతమంది వ్యవసాయదారులున్నారు. కాని పాలేర్లు, వ్యవసాయ కూలీలు దాదాపు లేరు. అయితే గణాంక వివరాలు పరిశీలించాలి.శ్రామిక, అణగారిన కులాలను మాత్రమే 'దళిత' అనాలి.

అందుచేత మాదిగ కులానికి జరుగుతున్న అన్యాయం గురించి చర్చిస్తున్నప్పుడు – దళిత, బి.సి. కులాల ప్రసక్తి తేవడం ఎంతవరకు సమంజసం? దీనిపై కొంతయినా చర్చ జరగాలని ఆశిస్తున్నాను.

**– మానేపల్లి**
ఎలమంచిలి

**'వీ**క్షణం' పత్రిక రెగ్యులర్‌గా అందుతోంది. బాగా విజ్ఞానదాయకంగా ఉంటోంది.

**– డా. పోతుకూచి**
హైదరాబాద్

**'వీ**క్షణం' పత్రిక జూలై 2008 సంచికలో ఫోకస్‌గా వచ్చిన 'ప్రత్యేక ఆర్థిక మండలులు' పై వచ్చిన వ్యాసాలు బాగున్నాయి. సెజ్‌లవల్ల వచ్చే సమస్యలను ఎత్తిచూపారు. ఇలా సామాజిక విషయాలపై విశ్లేషణాత్మక వ్యాసాలు ఇంకా రావాలి.

**– డా. నాగయ్య**
గుంటూరు

## దళితులపై దాడి

కడియం మండలం పొట్టిలంక గ్రామం హరిజనపేట చర్చ్ సమీపంలో జూన్ 20 రాత్రి దళితులకూ కాపుకులాల వారికీ మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో పల్లె వీరపాండు (35) అనే దళితుడు చనిపోయాడు. ఇరువర్గాలకు చెందిన పన్నెండుమంది గాయపడ్డారు. జూన్ 24న అగ్రవర్ణాలకు చెందిన వారు తమవారిపై కేసులు పెట్టినందుకు నిరసనగా జాతీయ రహదారిపై వేమగిరి కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. జూన్ 25న అదే కూడలి వద్ద దళితులు మాలమహానాడు, ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. చనిపోయిన వీరపాండు కుటుంబానికి నష్టపరిహారం వెంటనే అందజేయాలని, రెండెకరాల భూమిని మంజూరు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. మంత్రులు, కలెక్టర్, ఎస్.పి., మేధావుల ఆధ్వర్యంలో జూన్ 26న ఇరువర్గాల వారిని కాకినాడలో సమావేశపర్చి పొట్టిలంకలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు సహకరించాలనీ నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయిలో ఇరువర్గాల వారితో శాంతి కమిటీలను ఏర్పాటు చేశారు.

## తెలుగుదేశం పార్టీకి రాజీనామాలు

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, బి.సి. నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు తూళ్ల దేవేందర్ గౌడ్ జూన్ 23న పార్టీ సభ్యత్వానికి, ఎం.ఎల్.ఎ. పదవికి రాజీనామా చేశారు. తెలంగాణ అంశంపై పార్టీ వైఖరికి నిరసనగా బైటికి వచ్చారు.  ఆయనతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు ఇ. పెద్దిరెడ్డి కూడా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. జూలై 11న 'నవ తెలంగాణ ప్రజా పార్టీ (ఎన్.టి.పి.పి.)' పేరుతో దేవేందర్ గౌడ్ తన కొత్తపార్టీని ప్రకటించారు. వీరేకాక పలువురు సీనియర్ నాయకులు రకరకాల కారణాలతో తెలుగుదేశం పార్టీకి రాజీనామాలు చేస్తున్నారు.

## ఆంధ్రజ్యోతి సంపాదకుడు, పాత్రికేయుల అరెస్ట్

ఆంధ్రజ్యోతి దినపత్రికలో మే 26న వచ్చిన బాడుగ నేతల కథనం, తదనంతర పరిణామాలు జూన్ 24న ఆ పత్రిక సంపాదకుడు కె. శ్రీనివాస్, పాత్రికేయులు టి. శ్రీనివాస్, ఎం. వంశీకృష్ణల, అరెస్ట్‌కు దారితీసాయి. ఎం.ఆర్.పి.ఎస్. నేత మందకృష్ణ మాదిగ వీరిపై పెట్టిన ఎస్.సి., ఎస్.టి. అత్యాచార నిరోధ చట్టం కింద జూన్ 24 రాత్రి ఆంధ్రజ్యోతి కార్యాలయం నుంచి అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. పాత్రికేయులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు జూన్ 26న బెయిల్ లభించినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగి జూన్ 27 సాయంత్రం విడుదలయ్యారు.

## తగ్గిపోతున్న వ్యవసాయ విస్తీర్ణం

సామాజిక, ఆర్థిక శాస్త్రాల అధ్యయన సంస్థ (సి.ఈ.ఎస్.ఎస్. - సెస్) నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ముప్పై ఏడు లక్షల హెక్టార్లకు సాగునీరు అందక బీళ్లుగా మారాయని తెలుస్తోంది. అందులో పన్నెండు లక్షల హెక్టార్లు తెలంగాణ ప్రాంతంలోనివే. తెలంగాణ ప్రాంతంలోని పది జిల్లాలలో ముఖ్యంగా మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలలో సాగు గణనీయంగా తగ్గిపోయింది. యాభై ఏళ్ల కింద రాష్ట్రంలో నూట పన్నెండు లక్షల హెక్టార్ల భూమిలో పంటలు పండేవి. ఇప్పుడు మాత్రం ఆ విస్తీర్ణంలో పన్నెండు లక్షల హెక్టార్లకు కోత పడింది. 2005 నాటికి నూట పది లక్షల హెక్టార్లు మాత్రమే సాగు అవుతున్నాయని సెస్ తన నివేదికలో వెల్లడించింది.

## మరికొన్ని కులాలకు బి.సి. రిజర్వేషన్

బి.సి. కమిషన్ సిఫారసుల మేరకు రాష్ట్రంలో కొత్తగా మరో పది కులాలను వెనుకబడిన కులాల జాబితాలో చేరుస్తూ జూలై 24న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు, హక్కులు వీరికి ఈ ఏడాది నుంచే వర్తిస్తాయి. బి.సి. రిజర్వేషన్ల జాబితాలోని గ్రూప్-ఎ లోకి సామంతుల, సామంత, సౌంటియా, పొందర, కురకుల, పాలఎకరి, ఎకిల, వ్యాకుల, ఎకిరి, నాయినివారు, పాలెగారు, తోలగారి, కావలి కులాలు; గ్రూప్-బి లోకి లోధ్, లోధి, లోధా కులాలు; గ్రూప్-డి లోకి నగరాలు, అయ్యిరక, అరవ, బేరివైశ్య, బేరిశెట్టి, అఘముదియన్, అఘముదివెల్లార్, అఘముదిమదిలియార్ (తూలువ వెల్లలాస్‌తో కలిపి) కులాలు ఈ ఉత్తర్వుల ద్వారా బి.సి. జాబితాలో కొత్తగా చేరాయి.

## ఫీజుల మోత

ద్రవ్యోల్బణం రేటులో పెరుగుదల ప్రభావం విద్యారంగం పైనా పడింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు ఒక పక్క సామాన్యులను బెంబేలెత్తిస్తుంటే, మరోపక్క విద్యార్థుల ఫీజులు పెనుభారంగా పరిణమిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ వృత్తి విద్యా కోర్సుల్లో వార్షిక ఫీజులు భారీగా పెరిగాయి. ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎం.బి.ఎ., ఎం.సి.ఎ. కోర్సుల్లో దాదాపు పది శాతం, బి.ఎ.ఎం.ఎస్., బి.హెచ్.ఎం.ఎస్., బి.ఎం.వై.ఎస్. కోర్సుల్లో సుమారు 33 నుంచి 125 శాతం వరకు ఫీజులు పెరుగనున్నాయి. మొత్తంగా విద్యార్థుల తల్లిదండ్రులపై 75 కోట్ల రూపాయల భారం పడనుంది.

## రైతుకు అన్నీ సమస్యలే

రాష్ట్రంలో 18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల దాటినా పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పు గోదావరి, వరంగల్, ఖమ్మం జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే సగానికన్న తక్కువ వర్షపాతం నమోదయింది. మరోపక్క ఎరువుల కోసం రాష్ట్రమంతటా ఎక్కడో ఒక చోట రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఇవేకాక డీజిల్ ధర పెరగడం, కరెంట్ కోతలతో రైతులు సతమతమవుతున్నారు. మంచి విత్తనాల కోసం రైతులు నిరంతరం బాధపడుతూనే ఉన్నారు. ◆

*ద్రవ్యోల్బణం ప్రస్తుత స్థితికి సరళీకరణ విధానాలు, నిర్వహణ లోపాలే కారణమనీ, వెంటనే సవరించుకోకపోతే అత్యధిక ప్రజానీకం మరింత కష్టాల పాలవుతారనీ అంటున్నారు* **డి. నరసింహా రెడ్డి**

# ధరల పెరుగుదలకు కారణాలు

గత సంవత్సరం 4-5 శాతంగా అదుపులో ఉంచడానికి వీలైన స్థాయిలో ఉన్న ద్రవ్యోల్బణం రేటు ఈ సంవత్సరం మొదట్లో అతి వేగంగా పెరగడం మొదలైంది. ప్రస్తుతానికి రెండంకెల స్థాయిలో 10-11 శాతం కన్న పైన ఉంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం అన్ని సరుకులలోను అంటే ఆహార ధాన్యాల నుంచి ఇనుము వరకు, ఉక్కు నుంచి రవాణా వరకు అన్నిట్లోనూ కనబడుతోంది. అయితే మూడు ప్రధాన తరగతుల సరుకులు - అంటే ఒకటి, తృణ ధాన్యాలు, పప్పులు, వంటనూనెలు వంటి ఆహార దినుసులు. రెండు, ఇనుము, ఉక్కు, సిమెంట్ వంటి మౌలిక వస్తువులు. మూడు, పెట్రోలియం ఉత్పత్తులు. ఈ మూడు ప్రధాన తరగతుల సరుకులలోను ద్రవ్యోల్బణానికి ప్రధాన కారణం యు.పి.ఎ. ప్రభుత్వ అసమర్థ నిర్వహణనే. సరళీకరణ విధానాలతో పీటముడి వేసుకున్న ఈ ప్రభుత్వం హెచ్చు పెరుగుదల వల్లనే అన్ని సమస్యలు పరిష్కారమౌతాయని భావిస్తోంది. ఈ మూడు రకాల సరుకుల ధరలలో పెరుగుదల స్వభావాన్ని నిశితంగా పరిశీలిస్తే యు.పి.ఎ. ప్రభుత్వ తప్పుడు విధానాలు, వైఫల్యాలు బయటపడతాయి.

## ఆహారధాన్యాల ధరలలో పెరుగుదల

ఆహారధాన్యాల ధరల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా జరుగుతోంది. ఇందుకు కారణం ఆస్ట్రేలియా, ఉక్రెయిన్ వంటి ప్రధాన మిగులు ఉత్పత్తి చేసే దేశాలలో గత సంవత్సరం సరైన వాతావరణం లేకపోవడం వల్ల దిగుబడి పడిపోయింది. అలాగే అమెరికాలో ఇథనాల్ ఉత్పత్తి కోసం నాలుగు కోట్ల టన్నుల మొక్కజొన్నను తరలించడం వల్ల అంతర్జాతీయంగా ఆహారధాన్యాల సరఫరా తగ్గిపోయింది. అలాగే యూరప్‌లో బయోడీజిల్ ఉత్పత్తి కోసం అరవై శాతం నూనె గింజలను తరలించారు. వీటితో పాటు అంతర్జాతీయ ఆహారధాన్యాల మార్కెట్లలలో ద్రవ్య సంస్థలు పెద్ద ఎత్తున ముందస్తు అంచనాల పెట్టుబడులు పెట్టాయి. ఈ కారణాలవల్ల గోధుమల అంతర్జాతీయ ధరలు 2007లో 77 శాతం పెరిగాయి. బియ్యం ధరలు 16 శాతం పెరిగాయి. గత కొద్ది నెలలో ఈ పెరుగుదల మరింత పెద్దఎత్తున సాగి బియ్యం ధరలు 141 శాతం పెరిగాయి. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియాలలో దిగుమతుల మీద ఆధారపడే చాలా దేశాలలో ఈ ధరల పెరుగుదల ఆహారధాన్యాల దిగుమతి మీద ప్రతికూల ప్రభావాన్ని చూపింది.

అయితే భారతదేశ పరిస్థితి పూర్తిగా భిన్నమైనది. 2007-08 లో భారత ఆహారధాన్యాల ఉత్పత్తి మామూలు స్థాయిలోనే ఉండింది. అయినా 2007 నుంచి ఆహారధాన్యాల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఇందుకు కారణం ఆహారధాన్యాల మిగులు నిల్వలను వృద్ధి చేయక పోవడంలో ప్రభుత్వ వైఫల్యమే ఉంది. రైతుల నుంచి ప్రైవేట్ వ్యాపరస్తుల ఆహారధాన్యాలను కొని నిల్వ చేయడానికి ఆహారధాన్యాల వ్యాపరంలో ముందస్తు సరుకు మార్కెట్లను అనుమతించడానికి ప్రభుత్వం సిద్ధపడింది. దానితో ఆహారధాన్యాల వ్యాపారంలో ముందుగానే ధరలను ఇబ్బడి ముబ్బడిగా పెంచడం మొదలైంది. గత కొద్ది సంవత్సరాల పరిస్థితిని చూస్తే జాతీయ సంస్థ అయిన భారత ఆహారసంస్థ సేకరించే ఆహార ధాన్యాల పరిమాణం తగ్గడం మొదలైంది. 2001-02లో మొత్తం ఉత్పత్తి అయిన ఆహార ధాన్యాలలో 30 శాతాన్ని సేకరించిన భారత ఆహార సంస్థ 2006-07లో మొత్తం ఉత్పత్తి అయిన ఆహార ధాన్యాలలో 15 శాతాన్ని మాత్రమే సేకరించింది. నిజం చెప్పాలంటే భారత ఆహార సంస్థ ఇలా ఆహారధాన్యాలను సేకరించడానికి అవసరమైన నిధులను విడుదల చేయడానికి ఆర్థిక మంత్రిత్వశాఖ నిరాకరిస్తోంది.

భారత ఆహార సంస్థ అసమర్థమైందనీ, ఆహారధాన్యాల నిలువలను ఉంచుకోవడం వృథా ఖర్చు అనీ, ఒకవేళ కొరత ఏర్పడితే ఉన్న భారీ విదేశీ మారక ద్రవ్యంతో ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవచ్చునని ప్రపంచబ్యాంక్ నుంచి తీసుకున్న సలహాలను ఆర్థిక మంత్రిత్వ శాఖ పాటిస్తోంది. మరొక పక్క ప్రైవేట్ వ్యాపరస్తులు, ఐ.టి.సి., కార్గిల్ వంటి కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి సంస్థలను ఆహార ధాన్యాలు, పప్పు దినుసలను సేకరించడానికీ ఎగుమతి చేయడానికీ అనుమతిస్తున్నారు. ఒకపక్క దేశీయ మార్కెట్లో సరఫరాలో కొరత ఉండగా, ధరలు పెరుగుతూ ఉండగా 2007లో చివరి ఎనిమిది నెలలలో ప్రైవేట్ వ్యాపరస్తులు 48 లక్షల టన్నుల బియ్యాన్ని, 30 లక్షల టన్నుల పంచదారను, 1.5 లక్ష టన్నుల పప్పు దినుసులను విదేశాలకు ఎగుమతి చేశారు. ఇటీవల ఆహార ధాన్యాల ఎగుమతుల మీద నిషేధం విధించినప్పటికీ జరగవలసిన నష్టం అంతా అప్పటికే జరిగిపోయింది. గత ఒక్క సంవత్సరంలోనే ఆహార ధాన్యాల ధరలు 25 శాతం పెరిగిపోయాయి.

నిజానికి భారతదేశంలో ఆహార ధాన్యాల ధరల పెరుగుదలకు, అంతర్జాతీయ ఆహార కొరతకు సంబంధమేమీ లేదు. సరళీకరణ విధానాల వల్ల దేశంలోని వ్యవసాయమూ, రైతాంగమూ గత 15 సంవత్సరాలుగా తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ఆ సంక్షోభంలో వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోయాయి. వ్యవసాయ ఉత్పాదకాల ధరలు పెరిగిపోయాయి. వ్యవసాయ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర అందకుండా పోయింది. 1990ల దశకంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల రేటు జనాభా పెరుగదల రేటుకన్న తక్కువకు

పడిపోయింది. ఇప్పుడిక ప్రభుత్వ సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థలను నిర్లక్ష్యం చేసిన అవే సరళీకరణ విధానాల వల్ల ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారధాన్యాల ధరల పెరుగుదల పేద, మధ్యతరగతి వర్గాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాని, ఆహార ధాన్యాల ధరల పెరుగుదల రైతులకు ఏమీ మేలు చేయలేదు. దానివల్ల వ్యాపారస్తుల, మారుబేరగాళ్ల లాభాలు మాత్రం పెరిగిపోయాయి.

## పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల

1980ల నుంచి 2000 ల దాకా బ్యారెల్‌కు 20 డాలర్ల నుంచి 40 డాలర్లకు వరకు ఉండిన క్రూడ్ ఆయిల్ ధరలు 2004 నుంచి విపరీతంగా పెరుగుతున్నాయని అందరికీ తెలిసిన విషయమే. ఆ పెరుగుదల కూడా గత కొద్దినెలలో ఇబ్బడిముబ్బడిగా జరిగి అసాధారణమైన స్థాయిలో ప్రస్తుతం బ్యారెల్‌కు దాదాపు 140 డాలర్ల పైన ఉంది. కాని ప్రశ్న ఏమంటే ఇప్పటికే ద్రవ్యోల్బణం బారిన పడిన భారతదేశం వంటి దేశం క్రూడ్ ధరలు పెరుగుతున్నాయనే కారణం చూపి దేశీయ చమురు ధరలను పెంచవచ్చునా? అన్ని చోట్లా పెట్రోలియం ఉత్పత్తుల ద్వారానే సరుకుల రవాణా జరుగుతున్నది గనుక పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల అన్ని ఉత్పత్తి వ్యయాల, రవాణా వ్యయాల పెరుగుదలకు దారితీస్తుందని అందువల్ల సరుకుల ధరలన్నీ పెరిగిపోతాయని అందరికీ తెలుసు. కాని, మొత్తంగా ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న ప్రస్తుత సందర్భంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలను స్థిరీకరించడానికి, అదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని తీసుకోగల చర్యలు ఏమైనా ఉన్నాయా?

ఈ ప్రశ్నకు జవాబు చెప్పబోయే ముందు అంతర్జాతీయ స్థాయిలో చమురు సరఫరా, గిరాకీలు ఎలా ఉన్నాయో, ప్రస్తుత క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలకు కారణాలు ఏమిటో పరిశీలించవలసి ఉంది. మొట్టమొదట క్రూడ్ ఆయిల్ ఉత్పత్తికి కొన్ని ఆటంకాలు వచ్చిన మాట నిజమే. ఆ ఆటంకాలలో కొన్ని రాజకీయమైనవి, కొన్ని సహజమైనవి. ఇరాక్ మీద అమెరికా జరిపిన దురాక్రమణ వల్ల క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి అస్థిరంగా మారిపోయింది. ఆటంకాలు ఏర్పడ్డాయి. క్రూడ్ సరఫరాకు మరొక ప్రధాన వనరు అయిన నైజీరియాలో కూడా రాజకీయ నిరసనల వల్ల చమురు ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడ్డాయి. బహుళజాతి చమురు కంపెనీల వల్ల తమ జీవనోపాధి కోల్పోయిన విశాల ప్రజా సమూహాలు తమ వ్యవసాయ భూములకూ, పర్యావరణానికీ చమురు కంపెనీల వల్ల విఘాతం కలిగిందని ఆరోపిస్తూ నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. అలాగే మెక్సికో అఖాతంలో చమురు ఉత్పాదక సౌకర్యాలకు ప్రకృతి ఉత్పాతాల వల్ల నష్టం సంభవించింది. అయితే, ఇవన్నీ జరిగినప్పటికీ క్రూడ్ ఆయిల్ సరఫరా తగ్గిపోయిందనడానికి ఆధారం లేదు.

గత అయిదు సంవత్సరాలుగా అంతర్జాతీయ చమురు సరఫరా ఏడాదికి రెండు శాతం చొప్పున పెరుగుతూ వస్తోంది. నిజానికి ఈ సంవత్సరం క్రూడ్ ఆయిల్ సరఫరా గిరాకీ కన్న ఎక్కువగా ఉంది. ఇంకా చెప్పాలంటే సౌదీ అరేబియా వంటి ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలు చమురు సరఫరాకు కొరత ఏమీ లేదని విస్పష్టంగా ప్రకటించాయి. అలాగే చైనా, భారతదేశం వంటి వర్ధమాన దేశాలలో చమురు గిరాకీ పెరుగుతున్నందువల్ల చమురు కొరత ఏర్పడిందని కూడా నిజం కాదు. ఇక్కడ పెరుగుదల అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదలను ప్రభావితం చేసేంత పెద్దది కాదు. చైనా మొత్తం చమురు వినియోగం ప్రపంచ చమురు సరఫరాలో 9 శాతం మాత్రమే. భారతదేశ వినియోగమైతే ఎక్కడో అట్టడుగున రెండు శాతం దగ్గర ఉంది. నిజానికి అంతర్జాతీయ చమురు గిరాకీని ప్రభావితం చేసేవి అభివృద్ధి చెందిన దేశాలు. ముఖ్యంగా అమెరికా. ఒక్క అమెరికానే ప్రపంచ చమురులో 25 శాతం వినియోగిస్తుంది. చమురు ధరలు పెరిగినందువల్ల అభివృద్ధి చెందిన దేశాల గిరాకీ కూడా ఈ సంవత్సరం 5 శాతం తగ్గిపోయిందని అంచనాలు చూపుతున్నాయి.

మరి చమురు సరఫరాకు గిరాకీకి మధ్య పెద్ద అఖాతం ఉండి అది పెరిగిపోవడం కాకపోతే క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలకు నిజమైన కారణాలు ఏమిటి. ఏకైక ప్రధాన కారణం అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు చమురు రంగంలో భవిష్యత్తు లాభాలు ఆశించి పెడుతున్న పెట్టుబడులే. అమెరికాలో గృహ రుణాల మదుపులో వచ్చిన నష్టాల వల్ల చాలా ద్రవ్య సంస్థలు తమ పెట్టుబడులను తక్షణ లాభాల కొరకు సరుకుల మార్కెట్లోకి తరలించాయి. చమురు వాటాల వ్యాపారంలో ప్రధాన సంస్థ అయిన న్యూయార్క్ మర్కెంటైల్ ఎక్స్‌చేంజ్ లోని మొత్తం చమురు లావాదేవీలలో సగానికి కన్న ఎక్కువ తాత్కాలిక ఆర్థిక పెట్టుబడుల రూపంలో ఉండే హెడ్జ్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, మ్యూచువల్ ఫండ్స్ చేతులలోనే ఉన్నాయి. భవిష్యత్తు లాభాలను అంచనాకట్టి పెట్టుబడులు పెట్టే ఈ లావాదేవీల వల్ల చమురు ధరలలో కృత్రిమ పెరుగుదల సంభవించింది. ఈ లావాదేవీల వల్ల గాలివాటు లాభాలు సంపాదించే చమురు ఎగుమతి దేశాలు తమ పెట్రో డాలర్లను మరింత లాభాల కొరకు ఈ ద్రవ్య సంస్థలలోనే పెట్టుబడులు పెడుతున్నాయి. ఇటువంటి భవిష్యత్తు ఊహలతో సాగే ధరల పెరుగుదల సుస్థిరంగా ఉండదు.

నిజానికి 1979లో కూడా ఇలాగే జరిగి ప్రపంచ స్థూల ఉత్పత్తిలో ఏడు శాతానికి పైగా ప్రపంచ చమురు బిల్లే ఆక్రమించినప్పుడు తత్ఫలితంగా చమురు గిరాకీ ఆ తరువాతి మూడు సంవత్సరాలలో పది శాతం పడిపోయింది. అందువల్ల చమురు ధరలు కుప్పకూలిపోవలసి వచ్చింది. మళ్లీ ప్రస్తుతం కూడా ప్రపంచ చమురు బిల్లు ప్రపంచ స్థూల ఉత్పత్తిలో ఏడు శాతానికి చేరబోతూ ఉంది. అందువల్లనే అభివృద్ధి చెందిన దేశాలు చమురు వినియోగం మీద కోత విధిస్తున్నాయి. ప్రత్యామ్నాయ ఇంధనాల కొరకు అన్వేషణ మొదలైంది. ఎక్కువ కాలం సాగని ఊహాపుహల మీద ఏర్పడిన ధరల పెరుగుదల వల్ల పెట్రోలియం ఉత్పత్తి దేశాలు తమ సరఫరాను పెంచడానికి ముందుకు వస్తున్నాయి. ధరలు పెరిగినకొద్దీ గిరాకీ దెబ్బతినిపోతుందని వాళ్లకు తెలుసు.

ఇప్పుడిక భారతదేశంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరల విధానాన్ని పరిశీలిద్దాం. అంతర్జాతీయ క్రూడ్ ధరల పెరుగుదలను సాకుగా చూపుతూ ఇటీవల పెట్రోల్ ధరను లీటర్‌కు అయిదు రూపాయలు, డీజిల్ ధరను లీటర్‌కు మూడు రూపాయలు పెంచారు. పెట్రోలియం వ్యాపార సంస్థలకు ఉత్పత్తి వ్యయం వెనక్కి రావడం లేదని, నష్టాలు వస్తున్నాయని కారణం చూపి ఈ పని చేశారు. ఇది ఆర్థిక సంస్కరణలకు యు.పి.ఎ. ప్రభుత్వపు గుడ్డి బానిసత్వానికి ఒక నిదర్శనం తప్ప మరేమీ కాదు. పెట్రోలియం ధరల విధానంలో పారదర్శకత లేదు. దిగుమతి సమాన సూత్రం అనే ఒక ఊహాత్మక ప్రాతిపదిక మీద ఈ ధరలు నిర్ణయించడం జరుగుతున్నది. అంతర్జాతీయ క్రూడ్ ధరలు ఊగిసలాటలలో ఉంటాయని, ఇతర ఉత్పత్తి వ్యయాలపై మొత్తంగా

ధరల పరిస్థితిపై పెట్రోలియం ధరలు ప్రభావం వేస్తాయని అందరికీ తెలుసు. అందువల్లనే ఈ ఊగిసలాటను తొలగించడానికి ఒక పెట్రోలియం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని ఎంతోకాలంగా ఎంతోమంది అడుగుతున్నారు. ఇటువంటి నిధిని ఏర్పాటు చేస్తే అంతర్జాతీయ చమురు ధరలు పడిపోయినప్పుడు లాభాలు సంపాదించి, అంతర్జాతీయ క్రూడ్ ధరలు పెరిగినప్పుడు ఆ లభాలనే సబ్సిడీలుగా వాడి, ధరలను అదుపు చేయవచ్చు. ఈ పని చేయకపోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చమురు ధరల పెరుగుదలను ఎక్కువ పన్ను ఆదాయం సంపాదించే ఒక అవకాశంగా చూస్తున్నాయి.

అసలు చమురు ధరల పెరుగుదల వల్ల వచ్చే కుదుపులను గ్రహించి స్థిరంగా ఉండడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం ఉంది. ఇండియన్ ఆయిల్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం లిమిటెడ్, భారత్ పెట్రోలియం లిమిటెడ్ వంటి పెట్రోలియం ఉత్పత్తుల వ్యాపర సంస్థలతో పాటు ఈ వ్యవహారంలో తమ భాగస్వామ్యం ఉన్న నాలుగు ప్రధాన బృందాలు ఉన్నాయి. అవి, ఒకటి, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ఒ.ఎన్.జి.సి.), ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఒ.ఐ.ఎల్.), గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జి.ఎ.ఐ.ఎల్.) వంటి చమురు ఉత్పత్తి, శుద్ధి కంపెనీలు. రెండు, కేంద్ర ప్రభుత్వం. మూడు, రాష్ట్ర ప్రభుత్వాలు, నాలుగు వినియోగదారులు. భారతదేశం ప్రస్తుతం తన చమురు అవసరాలలో 30 శాతాన్ని దేశీయంగా ఉత్పత్తి చేస్తోంది. మిగిలిన 70 శాతాన్ని దిగుమతి చేసుకుంటోంది. చమురును వెలికితీయడం, శుద్ధి చేయడం అనే మొట్టమొదటి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం దేశీయ చమురు ధరను దానితోపాటే దిగుమతి సమాన ధర అనే జాతీయ స్థాయి ధరను నిర్ధారిస్తుంది.

చమురు శుద్ధి సామర్థ్యంలో భారతదేశం స్వయం సమృద్ధిని సాధించడం మాత్రమే కాదు అదనపు సామర్థ్యం కలిగి ఉంది. అందువల్ల శుద్ధి చేసిన చమురును ఎగుమతి చేసి దాని నుంచి కూడా లాభాలు సంపాదిస్తుంది. అలాగే వెలికితీసిన, తవ్వితీసిన చమురు పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాయల్టీలను పొందుతాయి. ఆయా కంపెనీలు లాభాలు కూడా సంపాదిస్తాయి. విదేశాల నుంచి పాత కాంట్రాక్ట్‌ల ద్వారా తక్కువ ధరకు చమురును దిగుమతి చేసుకుని శుద్ధి చేసిన చమురును ఎక్కువ ధరలకు విదేశాలకు ఎగుమతి చేసి విపరీతమైన లాభాలు సంపాదించే రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి ప్రైవేట్ చమురు శుద్ధి కంపెనీలు కూడా ఉన్నాయి. ఈ విధంగా గాలివాటుకు విపరీతమైన లాభాలు చేసుకునే కంపెనీలపై అమెరికాలోనైతే ప్రత్యేక పన్ను ఉంది. మన దేశంలో కూడా రిలయన్స్ ఆయిల్ సంపాదిస్తున్న లాభాలపై అటువంటి పన్ను వేసి దాన్ని దేశీయ ధరలను అదుపు చేయడానికి వాడవచ్చు. రెండవది, కేంద్ర ప్రభుత్వానికి రాయల్టీలతోపాటు కస్టమ్స్ సుంకాల రూపంలో, ఎక్సైజ్ సుంకాల రూపంలో పెద్ద ఎత్తున పన్ను ఆదాయం లభిస్తుంది. చమురు దిగుమతుల మీద విధించే కస్టమ్స్ సుంకాలు 2006-07లో రు. 10,043 కోట్లు అందాయి. అలాగే శుద్ధి చేసిన పెట్రోల్, డీజిల్ల మీద ఎక్సైజ్ డ్యూటీ రూపంలో రు. 59,000 కోట్లు అందాయి. క్రూడ్ ధరలు పెరుగుదలపై ప్రతికూల ప్రభావం వేయడానికి ఈ పన్నులను తగ్గించే అవకాశం ఉంది. మూడవది, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా పెద్ద ఎత్తున అమ్మకపు పన్నును లేదా విలువ ఆధారిత పన్నును ఈ రంగం నుంచి వసూలు చేస్తున్నాయి. ఈ పన్ను పెట్రోల్ మీద 20 నుంచి 33 శాతంగా ఉంది. డీజిల్ మీదా 12.5 శాతం నుంచి 22.5 శాతం దాకా ఉంది. చమురు ధరల పెరుగుదలను నియంత్రించడానికి ముఖ్యంగా ప్రజారవాణ వ్యవస్థ వాడే డీజిల్ మీద ఈ పన్నును తగ్గించే అవకాశం ఉంది. వీటన్నిటితోపాటు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా మొత్తంగా చమురు గిరాకీని పునర్ వ్యవస్థీకరించవచ్చు. అలాగే రైలు మార్గాల విద్యుదీకరణను తక్షణమే విస్తరించవచ్చు.

ఇన్ని రకాల అవకాశాలు ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చమురు ధరల పెరుగుదల భారాన్ని మొత్తంగా వినియోగదారుల మీదికి నెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ సుంకాలలోనూ, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మకం పన్నులలోనూ ఏవో చిన్న తగ్గింపులను మాత్రం ప్రకటించాయి. ఎందువల్ల అంటే ద్రవ్యపరమైన క్రమశిక్షణను పాటించడం అనే మౌలిక ఆర్థిక సంస్కరణల కార్యక్రమంలో భాగంగా సబ్సిడీలను తాత్కాలికంగా నైనా పెంచడానికి ప్రభుత్వాలు సిద్ధంగా లేవు. పెట్రో ధరలు పెరగడం అనేది ప్రస్తుత ద్రవ్యోల్బణం మీద రెట్టింపు ప్రభావం వేస్తుంది. నిత్యావసర సరకుల ధరలు, రవాణా వంటి సేవల ధరలు మరింతగా పెరిగిపోయి పేద, మధ్యతరగతి ప్రజానీకం మీద దారుణమైన ప్రభావం ఉంటుంది.

## ఇనుము, ఉక్కు, సిమెంట్ తదితర మౌలిక సరుకుల ధరలు

గృహ, భవన నిర్మాణంలో మాత్రమే గాక రహదారులు, వంతెనలు వంటి మౌలిక సౌకర్యాల కల్పనలో ముఖ్యమైన అంగంగా ఉండే ఇనుము, ఉక్కుల ధరలు 2007-08లో 29 శాతం పెరిగాయి. సిమెంట్ ధరలలో పెరుగుదల కూడా అదే విధంగా ఉంది. ముడి సరుకుల ధరలు పెరిగాయని కారణాలు చూపెడుతున్నారు. కాని, సంస్కరణలో భాగంగా ఇనుప ఖనిజాన్ని తవ్వడం గాని, ఇతరుల గనుల కార్యక్రమాలు గాని సరళీకరించబడి పెద్ద ఎత్తున ప్రైవేట్ వ్యాపారస్తులు గనుల రంగంలో ప్రవేశించారు. ఇనుప ఖనిజాన్ని తవ్వితీసే ఎగుమతి చేసే వ్యాపార సంస్థలు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొచ్చాయి. ఉదాహరణకు కర్ణాటకలోని బళ్లారిలోని ఒకే ఒక్క జిల్లాలో ఇనుప గనులు తవ్వుకోవడానికి 74 వ్యాపార సంస్థలకు అనుమతి దొరికింది. ఇనుప ఖనిజపు అంతర్జాతీయ ధరలు పెరిగినప్పుడు ఈ ప్రైవేట్ ఇనుప గనుల సంస్థలు తమ ఎగుమతి ధరలను మాత్రమే కాదు, దేశీయ ధరలను పెంచివేశాయి. అందువల్ల దేశం లోపల ఇనుము, ఉక్కు ధరలు కూడా పెరిగిపోయాయి. మొత్తం మీద ప్రజలు ఈ ధరల పెరుగుదల దాడిని అనుభవించవలసి రాగా ఈ గనుల యజమానులు మాత్రం విపరీతమైన లాభాలు చేసుకుని ఆ డబ్బును ఎన్నికలోల వినియోగించారు. అంతేకాదు దేశీయంగా కొరత అనుభవిస్తుండగా 2007-08లో కూడా ఇనుము, ఉక్కు సిమెంట్ ఎగుమతులు యథాతథంగా కొనసాగాయి. ఈ సంవత్సరం సంక్షోభ పరిస్థితి ఉండగా కూడా సిమెంట్‌ను దిగుమతి చేసుకోవాడానికి ఎటువంటి ప్రయత్నం జరగలేదు.

అందువల్ల మొత్తంగా ద్రవ్యల్బోణ స్థితిని, ప్రత్యేకంగా నిత్యావసర మౌలిక వస్తువల ధరల పెరుగుదలను స్థూలంగా విశ్లేషించినప్పుడు ఈ సంక్షోభానికి పునాదిగా ఉన్నవి సరళీకరణ విధానాలు, అత్యవసర సరుకుల సరఫరాలో నిర్వహణ లోపాలు అని తేలుతుంది. ప్రభుత్వం తన ఆర్థిక సంస్కరణ విధానాలను సవరించుకోకపోతే ఈ ద్రవ్యల్బోణ స్థితి మరింతగా దిగజారి అత్యధిక ప్రజానీకానికి ఇబ్బందికరంగా పరిణమిస్తుంది. ◆

*దేశహితమంటే ఎవరి హితమో అణు ఒప్పందంతో తేటతెల్లమయిందనీ, అమెరికాతో అణు ఒప్పందం, వ్యవసాయ ఒప్పందం మన స్వావలంబనకు గొడ్డలిపెట్టనీ అంటున్నారు* **కొణతం దిలీప్**

# అణు ఒప్పందం ధృతరాష్ట్ర కౌగిలి

అర్ధ సత్యాలను ఎంత అలవోకగా మీడియా సాయంతో ప్రచారం చేయవచ్చో అమెరికా – భారత్ అణు ఒప్పందం మరోసారి రుజువు చేసింది. మన నేతలు వాషింగ్టన్ దొరలకు జీ హుజూర్ అని ఎలా సలాం కొడుతున్నారో మన్మోహన్‌సింగ్ గారి తాజా నిర్వాకం తేటతెల్లం చేసింది. అడ్డదారిలో విశ్వాస పరీక్షను నెగ్గి అదేదో పెద్ద ఘనకార్యంలా ప్రచారం చేసుకుంటున్న మన్మోహన్ సర్కార్ తీరు చూస్తే జుగుప్స కలుగుతోంది. దేశ హితమంటే ఎవరి హితమో అణు ఒప్పందం సాక్షిగా భారత ప్రజలు నేడు తెలుసుకున్నారు.

దేశంలో నానాటికి పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి అణువిద్యుత్ తప్పనిసరి అని, అందుకు కొత్త రియాక్టర్లు, వాటికి ఇంధనం కావాలంటే మనం అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోక తప్పదని గత కొన్ని నెలలుగా ఈ ఒప్పందాన్ని సమర్ధించే వర్గం ప్రచారం చేస్తోంది. ఈ ఒప్పందంపై సంతకం పెట్టడం ద్వారా మన దేశం అభివృద్ధి పథంలో దూసుకువెళ్తుందనీ, అంతర్జాతీయంగా మన పేరు ప్రఖ్యాతలు ఇనుమడిస్తాయనీ కూడా ఈ బాకావాదులు సెలవిస్తున్నారు.

ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమని నమ్మే ప్రజలు పుష్కలంగానే ఉంటారు కాబట్టి ఈ ఒప్పందాన్ని సమర్ధించడం నేడు ఫ్యాషనైకూర్చుంది. ఇప్పుడు ఈ ఒప్పందాన్ని ప్రశ్నించే వారు దేశద్రోహులతో సమానం అయిపోయారు.

అలీనోద్యమానికి ఊపిరులూదిన దేశం ఇవ్వాళ అణు ఒప్పందం చేసుకోవడం ద్వారా అమెరికా పంచన చేరినట్టయింది. ముందుగా అణు ఒప్పందాన్ని దాన్నికదిగా విడిగా చూడడమే ఒక పెద్ద తప్పిదం. గత కొన్నేళ్లుగా మన్మోహన్ ప్రభుత్వం అమెరికాతో అంటకాగుతూ ఒక్కొక్కటిగా అమెరికా వైపు అడుగులు వేయడం ప్రారంభించింది. అమెరికన్ సైన్యంతో కలిసి జంటగా విన్యాసాల్లో పాల్గొనడం, వ్యవసాయ ఒప్పందం కుదుర్చుకోవడం వంటి చర్యలన్నీ అగ్రరాజ్యం మన దేశాన్ని తన గుప్పిట్లో పెట్టుకునేందుకు రచించిన ఒక భారీ ప్రణాళికలో భాగమే అని అర్థం చేసుకోవాలి మనం. అణు ఒప్పందం కుదుర్చుకున్నందుకు బదులుగా మన చిరకాల మిత్ర దేశం ఇరాన్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థలో (ఐ.ఎ.ఇ.ఎ.) ఓటు వేయాలని అమెరికా మన మెడలు వంచింది. భవిష్యత్తులో అగ్రరాజ్యం మనల్ని ఎలా వాడుకోబోతుందో తెలిపే స్పష్టమైన సూచిక ఇది.

ఒక్క దెబ్బకు రెండు పిట్టలన్నట్టు భారత్ తన ఇంధనరంగంలో స్వావలంబన సాధించకుండా ఎప్పటికీ విదేశాలపై ఆధారపడేట్టు చేయడం, అదే సమయంలో మన దేశ రక్షణ అణు కార్యక్రమంపై పట్టు బిగించడం అనే జంట లక్ష్యాలు అమెరికాకు ఉన్నాయి. ఈ అణు ఒప్పందం వెనుక. ఒప్పందం కుదిరిన తరువాత అయినా మన విద్యుత్ అవసరాల్లో అణు విద్యుత్ ఒక చిన్న భాగం మాత్రమే తీర్చగలదని ప్రభుత్వం ఇచ్చిన అంకెలే చూపిస్తున్నాయి. అసలు రానున్న ఏళ్లలో విద్యుత్ డిమాండ్ పెరుగుదలపై ప్రభుత్వం చూపిస్తున్న అంకెలే తప్పుల తడకలు. ఒక పెద్ద అంకెను బూచిగా చూపడం, దాని ఆధారంగా వివిధ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను అనుమతించడం గత పదిహేడేళ్లలో లెక్కలేనన్ని సార్లు చూశాం.

మొదలైనప్పుడు పూర్తిగా ఏకపక్షంగా ఉన్న భారత్ – అమెరికా అణు ఒప్పంద స్వరూపం అనేక చర్చలు, దిద్దుబాట్ల తరువాత చాలా మారింది. అయితే ఈ ఒప్పందం వల్ల నిజంగానే మనకు బ్రహ్మాండమైన లాభాలు చేకూరుతాయా? ఎందుకు మనపై అమెరికా ఇంత ఔదార్యం కురిపిస్తోంది ఒకసారి లోతుగా పరిశీలన చేయవలసి ఉంది. అణు ఒప్పందం వెనుక అమెరికా వ్యూహాత్మక, వ్యాపార లక్ష్యాలే ఎక్కువ. దానివల్ల తక్షణం మనకు ఒనగూడే ప్రయోజనాల కన్నా దీర్ఘకాలంలో జరిగే నష్టాలే ఎక్కువ.

### అణువూ మనమూ

1957లో మొదలైన అణు విద్యుత్ కార్యక్రమం ఇప్పుడు యూరేనియం అన్వేషణ, వెలికితీత మొదలుకొని భారజలం ఉత్పత్తి, రియాక్టర్ల నిర్మాణం, రీప్రాసెసింగ్ వరకూ విస్తరించింది. చిన్న చిన్న ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లను మనం తయారుచేయగలుగుతున్నాం. అన్నిటి కన్నా ముఖ్యమైనది థోరియం ఆధారిత రియాక్టర్లను తయారు చేయగలగడం. ఈ చివరి అంశంపైనే అణు ఒప్పందం మూలంగా తీవ్ర ప్రభావం పడనుంది. దీని గురించి తరువాత మాట్లాడుకుందాం.

అణ్వస్త్ర వ్యాప్తి నిరోధానికి అన్ని దేశాల కన్నా ముందు నడుం కట్టింది, ఇతోధికంగా కృషి చేసింది మన దేశమే. 1954లో అణు పరీక్షలు నిలిపివేయాలని తొలుత ప్రతిపాదించింది మన దేశమే. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి. – న్యూక్లియర్ నాన్–ప్రొలిఫెరేషన్ ట్రీటి) సూత్రాలను మొదట ప్రతిపాదించింది భారతదేశమే. కొన్ని

దేశాలకు అణ్వస్త్రాల గుత్త హక్కును కలుగజేసే విధంగా ఆ ఒప్పందాన్ని మార్చడంతో చివరికి మన దేశం ఆ ఒప్పందంపై సంతకం పెట్టలేదు.

1982లో అణ్వాయుధాలు నిషేధించడానికి ఒక ఒప్పందం ఉండాలని మొట్టమొదట ప్రతిపాదించింది కూడా మన దేశమే. 1988 ఐక్యరాజ్య సమితి నిరాయుధీకరణపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ అప్పటి ప్రధాని రాజీవ్ గాంధి ఇలా అన్నారు – 'మానవాళి భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తూ కొద్ది దేశాలు తమ భద్రత కోసం ప్రయత్నించడంలోని తర్కాన్ని మేం ఒప్పుకోలేం... అలాగే ఇప్పటికే అణ్వాయుధాలు ఉన్న వారిపై ఆంక్షలు ఎత్తివేసి అణ్వాయుధాలు లేని దేశాలపై నిఘా పెట్టడమూ మాకు సమ్మతం కాదు. ఇటువంటి వివక్షాపూరిత విధానాలు చరిత్రలో అనేకం కనిపిస్తాయి. మనకు, స్త్రీలకన్నా, పురుషులు గొప్పవారనీ, శ్వేతజాతి ప్రజలు ఇతర జాతుల కన్నా గొప్పవారని, వలసపాలన అనాగరికులను నాగరీకరించే ప్రయత్నమని, ఇప్పటికే అణ్వాయుధాలు ఉన్న దేశాలు బాధ్యతాయుత మయిన శక్తులనీ, మిగతా దేశాలు బాధ్యత తెలియనివని...'

అయితే మనం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం పెట్టకపోవడం వల్ల 1974లో, 1998లో అణు పరీక్షలు జరపడం వల్లా మనకు ఇతర దేశాల నుండి అణు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, అణు ఇంధనం అందడం లేదు. సరిగ్గా ఈ కారణం వల్లనే ఇవ్వాళ మనం ప్రపంచంలోనే అత్యుత్తమ అణు సాంకేతిక పరిజ్ఞానం దేశీయంగా అభివృద్ధి పరచుకోగలిగాం.

తొలిరోజుల్లో అమెరికా, కెనడా, రష్యా వంటి దేశాల నుండి రియాక్టర్లు దిగుమతి చేసుకున్నా, ఇప్పుడు స్వయంగానే రియాక్టర్లు నిర్మించే స్థితిగి ఎదిగాం. చిన్న రియాక్టర్ల తయారీలో మన సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా మన్ననలందుకుంది.

## వారు ఇస్తే మనం తీసుకునే పరిస్థితి ఉందా?

అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకుంటే మనకు ఆ దేశం నుండి అణు ఇంధనం (యురేనియం), సాంకేతిక సహకారం వస్తుందని చాలా మంది భారత పౌరులు ఇవ్వాళ విశ్వసిస్తున్నారు. ఒక పథకం ప్రకారం మన్మోహన్ సర్కార్ చేసిన ప్రచార ఫలితమే ఇది. అయితే అణు ఒప్పందం వల్ల అమెరికా నుండి మనకు ఒరిగేది పెద్దగా లేదని ఈ కింది వివరాలు పరిశీలిస్తే మనకు ఇట్టే అర్థం అవుతుంది.

1980లో అమెరికాలో 250 యురేనియం గనులు ఉండేవి. ఇవి ఆ యేడాది 16,800 టన్నుల యురేనియం ఉత్పత్తి చేశాయి. 1984 నాటికి గనుల సంఖ్య 50కి తగ్గగా ఉత్పత్తి కూడా 5700 టన్నులకు పడిపోయింది. ఇక 2003 నాటికి అమెరికాలో రెండంటే రెండే చిన్న గనులు మిగిలాయి. వీటి ఉత్పత్తి 1000 టన్నుల లోపే. తమ దేశంలో స్వయంగా రియాక్టర్లకు అవసరమైన యురేనియంను అమెరికా దిగుమతి చేసుకుంటుంది. కనుక ఆ దేశం నుండి మనకు యురేనియం రావడం అనేది ఒక కల మాత్రమే.

ఇక అణు ఒప్పందం పైన సంతకం పెడితే కనీసం అణు సరఫరా బృందం (ఎన్.ఎస్.జి.) లోని ఇతర దేశాల నుండి అయినా యురేనియం లభ్యమవుతుందా అంటే ఈ బృందంలో ఉన్న అతి పెద్ద యురేనియం ఎగుమతిదారు ఆస్ట్రేలియా గత జనవరిలోనే 'భారత అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి.)పై సంతకం పెట్టేదాకా యురేనియం సరఫరా చేసేది లేదు" అని కరాఖండిగా చెప్పింది.

అంతేకాదు అమెరికన్లు ఉపయోగించే అణు రియాక్టర్ల కన్నా మన సైంటిస్టులు మెరుగైన అణు రియాక్టర్లు కనిపెట్టారు. మూడు దశల్లో అణు విద్యుత్ ఉత్పాదన చేయడం ద్వారా అతి తక్కువ వ్యర్థాలను వదిలే బ్రీడర్ రియాక్టర్ విధానాన్ని మన శాస్త్రవేత్తలే అభివృద్ధి చేశారు. ఈ విధానం ఇప్పటి దాకా అమెరికాకు చేతకాలేదన్నది సత్యం. అణు వ్యర్థాలను మనలా తిరిగి ఇంధనంలా వాడుకోలేక పోవడం వల్లనే అమెరికాలో గుట్టలు గుట్టలుగా అణు వ్యర్థాలు పేరుకుపోయాయి. దాదాపు అరవై వేల టన్నుల పైగా ఉన్న ఈ అత్యంత ప్రమాదకరమైన అణు వ్యర్థాలను నిలువ చేయడానికి అమెరికా సతమతమవుతోంది. అణు రియాక్టర్ల నుండి ఈ వ్యర్థాలను తరలించే బాధ్యతను అక్కడి ఇంధన శాఖ సరిగ్గా నిర్వహించడంలేదని విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు ఆ శాఖపై ఎన్నో దావాలు కూడా వేశాయి.

1952లో నెలకొల్పిన తారాపూర్ అణు విద్యుత్ రియాక్టర్‌ను మనం అమెరికన్ కంపెనీ అయిన జనరల్ ఎలక్ట్రిక్ నుండి దిగుమతి చేసుకున్నాం. ఈ రియాక్టర్ నుండి వెలువడే వ్యర్థాలను తిరిగి ఇంధనంగా వాడరాదని అమెరికా షరతు పెట్టింది. మనల్నీ వాడనీయక, తిరిగి తమ దేశమూ తీసుకోకపోవడం వల్ల ఆ రియాక్టర్ నుండి వెలువడ్డ దాదాపు మూడు వందల టన్నుల విషతుల్యమైన అణు వ్యర్థాలు మన వద్ద పోగుపడ్డాయి.

ఇటువంటి చరిత్ర కలిగిన అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకుంటే మన భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించడం కష్టం కాదు.

## అణు విద్యుత్ చౌకనా?

యురేనియం ఎగుమతుల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియాలో దాదాపు 12,43,000 టన్నుల యురేనియం నిల్వలు ఉన్నాయి. ఇక్కడ లభ్యమయ్యే యురేనియం అత్యంత చౌకగా లభ్యమయ్యే రకం. కానీ ఆ దేశం ఒక్క యూనిట్ అణు విద్యుత్ కూడా ఉత్పత్తి చేయడం లేదు. 2006లో అక్కడి ప్రధానమంత్రి ఆధ్వర్యంలో ఏర్పాటయిన టాస్క్‌ఫోర్స్, బొగ్గుద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ కన్నా అణు విద్యుత్ ఇరవై నుంచీ యాభై శాతం ఎక్కువ ఖరీదయిందనీ పేర్కొంది. భారీగా స్వంత యురేనియం నిల్వలు ఉన్న ఆ దేశానికే అణు విద్యుత్ ఖరీదయినదయితే మనకు చౌక ఎలా అవుతుంది?

అమెరికాలో గత ముప్పై ఏళ్లలో కొత్తగా ఒక్క అణు విద్యుత్ కేంద్రం కూడా మొదలు కాలేదు. ఒకవేళ అణు విద్యుత్ అంత సురక్షితమయిందీ, చౌకైనదీ అయితే అమెరికాలో ఎందుకు ఇన్నేళ్లుగా ఒక్క కొత్త అణు విద్యుత్ కేంద్రమూ నెలకొల్పలేదో మన్మోహన్, అతని వంది మాగధులూ మనకు చెప్పాలి.

1979లో అమెరికాలోని త్రీ మైల్ ఐలాండ్ అణు రియాక్టర్‌లో ఒక పెద్ద ప్రమాదం సంభవించిన దరిమిలా అక్కడి ప్రజలు అణు విద్యుత్‌పై విముఖత చూపసాగారు. 1979 నుండి 1984 మధ్య నిర్మాణ

వ్యయం పెరిగిపోవడం వంటి కారణాల వల్ల అక్కడి విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు 58 అణు విద్యుత్ కేంద్రాల స్థాపనను అర్ధాంతరంగా నిలిపివేశాయి. ఇందులో 28 విద్యుత్ కేంద్రాలయితే నిర్మాణం సగంలో ఉండగా నిలిపివేశాయి. ఒకసారి ఊహించుకోండి మనదేశమే కనుక అటువంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తే ఎంత భారీ నష్టం సంభవిస్తుందో.

ఇవ్వాళ ఇంధన రంగం సంక్షోభంలో ఉంది. చమురు ధరలు మున్నెన్నడూ లేనంత పైకి ఎగబాకడంతో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇదే అవకాశంగా తీసుకుని చమురు ధరల కారణంగా అణు విద్యుత్ మనకు ఇంధన భద్రత కలిగిస్తుందని అర్ధసత్యాలు ప్రవచిస్తున్నారు. గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే మనం చమురు ఆధారిత ఉత్పత్తులు ముఖ్యంగా రవాణా రంగంలో వాడుతాం. ఒకవేళ మనం నిజంగానే అణు విద్యుత్ ఉత్పత్తి పెంచినా కూడా మన చమురు దిగుమతులు ఏమీ తగ్గబోవు అనేది వాస్తవం.

గత కొంతకాలంగా చమురు బ్యారెల్ ధరలు పెరిగినట్లే యురేనియం ధరలు కూడా ఆకాశానికి ఎగిశాయన్నది మనం తెలుసుకోవాల్సిన మరో నిజం. గత అయిదేళ్లలో యురేనియం స్పాట్ ధరలు మూడు రెట్లు పెరిగాయి. 2006లో ప్రపంచం మొత్తం 180 మిలియన్ పౌండ్ల యురేనియం వినియోగిస్తే అందులో భూగర్భం నుండి ఉత్పత్తి అయింది 100 మిలియన్ పౌండ్లే (యాభై అయిదు శాతం). మిగతాది పాత అణు బాంబుల నుండి వెలికి తీసిందే. ఇలా పాత అణుబాంబుల నుండి లభ్యమయ్యే యురేనియం మరో ఏడేండ్లకు మించి రాదని అంచనా. అప్పుడు యురేనియం ధరలు భగ్గుమనడం ఖాయం.

యూనిట్ ధరల ఆధారంగా అణు విద్యుత్‌ను చౌక విద్యుత్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నారు కొంతమంది అరకొర మేధావులు. విద్యుత్ వ్యయం లెక్క వేసేటప్పుడు ఆ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణ వ్యయం, ఇతర నిర్వహణ ఖర్చులు, చివరికి అణు రియాక్టర్ పని కాలం ముగిశాక దాన్ని డీ కమిషన్ చేసే ఖర్చులూ (అమెరికాలో ఒక్క రియాక్టర్ డీ కమిషన్ చేసేందుకు 1200 కోట్ల దాకా అవుతోంది) కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న ప్రాథమిక విషయం వీరు విస్మరిస్తున్నారు. ముందు రియాక్టర్లు, యురేనియం అమ్మి సొమ్ము చేసుకునే బెక్టెల్ వంటి బహుళజాతి కంపెనీలు రియాక్టర్ కాలపరిమితి ముగిసాక అనేక ఏళ్లపాటు అణు వ్యర్థాలను తొలగించేందుకు వందల కోట్ల డాలర్ల కాంట్రాక్టులు పొందుతాయి. ఇప్పుడు సదరు కంపెనీలు అమెరికాలో చేస్తున్నదదే. ఈ ఖర్చంతా అణు విద్యుత్ ఉత్పత్తి వ్యయంలోకి తీసుకోవాల్సిన అవసరం లేదా?

ఇవన్నీ కలిపితే అణు విద్యుత్ ఖర్చు తడిసి మోపెడవుతుంది. హెచ్చు స్థాయిలో ప్రభుత్వ సబ్సిడీలు లేకుండా అణు విద్యుత్ ఎక్కడా ఉత్పత్తి కావడం లేదన్నది కళ్లముందే ఉన్న నిజం.

## అణు విద్యుత్ సురక్షితమా?

అణు విద్యుత్ ఎంత సురక్షితమయినది అనే చర్చ చాలా పెద్దది. 1952లో మొదలుకొని ఇప్పటిదాకా అణు విద్యుత్ రియాక్టర్లలో ఆరు పెద్ద ప్రమాదాలు జరిగాయి. సంఖ్యాపరంగా ఇది తక్కువైనా అణు ధార్మికత అత్యంత ప్రమాదకరమైనది అవటం వల్ల, అణు ధార్మికత ప్రభావం కొన్ని దశాబ్దాల పాటు పరిసర ప్రాంత ప్రజలపై, పర్యావరణంపై ఉండటం వల్లా అణు విద్యుత్ పట్ల ప్రజల్లో భయాందోళనలు ఉన్నాయి. అమెరికాలో త్రీ మైల్ ఐలాండ్, రష్యాలోని చెర్నోబిల్ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగిన పెద్ద ప్రమాదాలు మనకు గుణపాఠాలు కావాలి.

ఒక్క విషయం మాత్రం తెలుసుకుందాం మనం. ఈనాటికీ అణు శక్తి రంగానికి పూర్తిగా ఇన్స్యూరెన్స్ చేయడానికి ఏ ఇన్స్యూరెన్స్ సంస్థ ముందుకు రాకపోవడం బట్టి అసలు ఈ అణువిద్యుత్ ఎంత సురక్షితమయినదో అర్థం చేసుకోవచ్చు.

## ఫ్రాన్స్‌ను చూసి మనం వాతలు పెట్టుకోవాలా?

ఫ్రాన్స్‌లో 79 శాతం విద్యుత్ ఉత్పత్తి అణు విద్యుత్ కేంద్రాల ద్వారా అవుతుందని చెప్పేవారు అక్కడ చమురు, సహజ వాయువు ఉత్పత్తి చాలా స్వల్పంగా ఉన్నదని చెప్పారు. ఏప్రిల్ 2004 తరువాత ఫ్రాన్స్‌లో ఒక్క తట్ట బొగ్గు కూడా ఉత్పత్తి కాలేదని అసలే చెప్పరు. అణు రియాక్టర్లను చల్లబరచడానికి ఎక్కువ మొత్తంలో చల్లని నీరు అవసరం. ఇందువల్లనే అణు రియాక్టర్లన్నీ సముద్రపు ఒడ్డున కానీ, నదీతీరాల్లో కానీ నిర్మిస్తారు. ఈ రియాక్టర్లు చల్లని నీటిని స్వీకరించి వేడి నీటిని వదులుతాయి. 2003లో వడగాలుల తీవ్రత పెరిగిపోవడం వల్ల ఫ్రాన్స్‌లోని 17 రియాక్టర్లను పాక్షికంగానో, పూర్తిగానో నిలిపివేశారు. 95 యూరోలకు ఒక మెగావాట్ యూనిట్ ఉత్పత్తి చేసే ఫ్రాన్స్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఆ కాలంలో విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఒక్క మెగావాట్ యూనిట్ కొనుగోలుకు 1350 యూరోల దాకా వెచ్చించాల్సి వచ్చింది. జర్మనీ, స్పెయిన్ దేశాల్లో కూడా ఇదే వడగాలుల కారణం వల్ల రియాక్టర్లను నిలిపివేయవలసి వచ్చింది.

ఫ్రాన్స్‌లో పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన అణు వ్యర్థాలపై ఆందోళన వెలిబుచ్చుతూ గ్రీన్ పీస్ ఇటీవలనే ఒక నివేదికను వెలువరించింది. ఫ్రాన్స్‌లో 70 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల బ్రెన్నిలిస్ అణు విద్యుత్ కేంద్రంపై 1979లో టెర్రరిస్టులు దాడులు చేశారని వార్తలు వచ్చాయి. దీని ఫలితంగా ఈ అణు విద్యుత్ కేంద్రం మూతబడింది. 23 ఏళ్లుగా ఫ్రాన్స్ ఆ అణు విద్యుత్ కేంద్రాన్ని డీ కమిషన్ చేయడానికి తంటాలు పడుతోంది. ఇప్పటికే డీ కమిషనింగ్ వ్యయం తడిసిమోపెడై 482 మిలియన్ యూరోలకు (3216 కోట్లు) చేరింది. ఇంతింత ఖర్చులు మనం భరించగలమా? ఫ్రాన్స్ అణు విద్యుత్ వెనుక ఉన్న ఈ భాగోతాలను అణు విద్యుత్ బాకావాదులు మనకు తెలియనివ్వరు.

## ఒప్పందంలోని వాణిజ్య అవకాశం

2006 జనవరి రెండో వారంలో అణుశక్తి రంగంలో పేరొందిన బహుళజాతి కంపెనీలకు చెందిన 25 మంది సభ్యులతో కూడిన బృందం ఒకటి మనదేశంలో పర్యటించిందని ఫోర్బ్స్ పత్రిక రాసింది. ఇంత భారీ వ్యాపారవేత్తల బృందం అమెరికన్ చరిత్రలోనే ఇప్పటిదాకా ఏ దేశంలోనూ పర్యటించలేదనీ, అణు ఒప్పందం వల్ల నాలుగు లక్షల

*అణు విద్యుత్తు కోసం ప్రజలు అనారోగ్యాల రూపంలో, మరణాల రూపంలో ఎంత మూల్యం చెల్లించాల్సి ఉందో, అణు ఒప్పందం మంచిదో, కాదో అసలు చర్చేలేని ఈ మౌనాన్ని ప్రశ్నిస్తున్నారు* **కె.జి కన్నబిరన్**

# శాస్త్రవేత్తలు నిజాలు చెప్పాలి

'విభిన్న జాతులకు చెందిన మేధావులుగా, పండితులుగా మనం ఇవ్వాళ ఇక్కడ కలుస్తున్నాం. ఒక లోతైన చారిత్రక బాధ్యతను నిర్వహించడానికి కలుస్తున్నాం. ఈ మహత్తర లక్ష్యంతో ఇక్కడ మనందరమూ సమావేశం కావడానికి కారణమైన మన ఫ్రెంచ్, పోలిష్ సహచరులకు మనం కృతజ్ఞులమై ఉండాలి. ఆ మహత్తర లక్ష్యం ఏమంటే ప్రపంచ వ్యాప్తంగా శాంతినీ, భద్రతనూ నెలకొల్పడానికి వివేకవంతుల ప్రభావాన్ని ఉపయోగించాలనేది. నిజానికి ఈ సమస్య చాలా పాతది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించినవాళ్లలో ప్లేటో మొట్ట మొదటివాడు కావచ్చు. మానవజాతి సమస్యలకు పరిష్కారం వెతకడానికి ఆటవిక ప్రవృత్తులకు, ఉద్రేకాలకు లొంగిపోయే బదులు హేతుబద్ధతను, విచక్షణను వాడాలనేది ఆ ప్రయత్నం. సామాజిక జీవనంలోని సమస్యలను పరిష్కరించడానికి కేవలం హేతుబద్ధ ఆలోచన సరిపోదని విషాదకరమైన అనుభవాల ద్వారా మనం గుర్తించాం. తీక్షణమైన పరిశోధనా, వ్యగ్రమైన శాస్త్రవిజ్ఞాన కృషి సాధారణంగా మానవ జాతికి విషాదకర అనుభవాలనే మిగిల్చాయి. ఆ అన్వేషణలు ఒకపక్కన మనిషిని బండచాకిరి నుంచి, శారీరక శ్రమ నుంచి విముక్తం చేసి అతని జీవితాన్ని సులభతరం, సంపన్నం చేశాయి. కాని, మరొకపక్క అతని జీవితంలో ఒక చెప్పరాని అసంతుష్టిని ప్రవేశపెట్టాయి. తన చుట్టూ ఉన్న సాంకేతిక వాతావరణానికి అతనిని బానిసను చేశాయి. అంతకన్న ముఖ్యంగా అత్యంత ప్రమాదకరంగా మనిషిని మనిషి విధ్వంసం చేసుకొనే సాధనాలను సృష్టించాయి. నిజంగా ఇదే అత్యంత దుర్భరమైన, గంభీరమైన విషాదం....'

---

కోట్ల రూపాయల వాణిజ్యానికి వీలున్నదని ఆ కథనం రాసింది. ఇదిగో ఈ 'వాణిజ్య అవకాశమే' అమెరికాకు మన పట్ల అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన ప్రేమకు ప్రధాన కారణం.

అభివృద్ధి చెందిన దేశాల్లో బేరాలు పెద్దగా లేక అణు రియాక్టర్లు, ఇంధనం అమ్ముకునే బహుళజాతి కంపెనీలు గత కొన్నేళ్లుగా సతమతమవుతున్నాయి. ఇప్పుడు వాటికి మార్కెట్ కల్పన కొరకే అమెరికా మనతో అణు ఒప్పందం కుదుర్చుకుంటుందని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. మన థోరియం నిల్వలపై, థోరియం ఆధారిత రియాక్టర్ పరిజ్ఞానంపై కన్నేసిన అమెరికన్ కంపెనీలు అప్పుడే ఈ రంగంలో పనిచేస్తున్న ఇండియన్ రేర్ ఎర్త్ లిమిటెడ్, బాబా ఆటమిక్ రిసెర్చ్ సెంటర్ వంటి సంస్థలతో సంప్రదింపులు మొదలుపెట్టాయి. చమురు, సహజ వాయువు, బొగ్గు, ఇనుము, బాక్సైట్ వంటి సహజ వనరులను పూర్తిగా ప్రైవేట్, బహుళజాతి కంపెనీల చేతిలో పెట్టడం మొదలుపెట్టిన మన నేతలు రేపు అణు ఒప్పందం కుదరగానే థోరియం విషయంలోనూ అదే విధంగా చేసే అవకాశాలు కనపడుతున్నాయి.

## థోరియం భవిష్యత్ కాంతి రేఖ

ఇప్పుడు అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి చాలా మంది చెప్పే సాకు మన రియాక్టర్లను నడపడానికి అవసరమైన యురేనియం లభ్యం కావట్లేదని. అణు విద్యుత్ మనకు అవసరమే అని అనుకున్నా దాన్ని ఉత్పత్తి చేయడానికి యురేనియంకు ప్రత్యామ్నాయంగా థోరియంను ఉపయోగించవచ్చు. థోరియం ప్రకృతిలో మోనజైట్ అనే ఖనిజంలో ఉంటుంది. ప్రపంచంలో ఒక కోటీ ఇరవై లక్షల టన్నుల మోనజైట్ ఖనిజం ఉన్నట్టు అంచనా వేస్తే అందులో రెండింట మూడొంతులు మన భారతదేశంలోనే ఉంది. గత దశాబ్దకాలం నుండి శ్రమించి మన శాస్త్రవేత్తలు థోరియం నుండి అణు విద్యుత్ తయారు చేసే రియాక్టర్లను విజయవంతంగా తయారు చేశారు. థోరియంను సక్రమంగా వినియోగించుకుంటే మనకు సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేసుకుని అభివృద్ధి పథంలో నడవచ్చు.

దశాబ్దంపై చిలుకు మన శాస్త్రవేత్తలు ఎంతో శ్రమకోర్చి అభివృద్ధిపరచిన థోరియం ఆధారిత రియాక్టర్ డిజైన్లు అణు ఒప్పందం నేపథ్యంలో అమెరికాకు లభ్యం అవుతాయి. ఈ రంగంలో కొత్తగా పరిశోధన జరగకపోయే అవకాశం స్పష్టంగా కనపడుతోంది. అణు విద్యుత్ రియాక్టర్లు ఇప్పుడు అంతర్జాతీయ తనిఖీ కోసం తెరిచి ఉంచాలి. ఈ తనిఖీల ముసుగులో మన జాతీయ రహస్యాలు అమెరికాకు చేరుతాయి. అన్నిటికీ ఇతర దేశాలపై ఆధారపడటం ద్వారా అణు శాస్త్ర సాంకేతిక ప్రగతి కుంటుపడుతుంది. రేపు అమెరికా ఏదో ఒక కారణంతో మనపై కన్నెర చేస్తే మనం చతికిలపడటం ఖాయం. అగ్రరాజ్యంతో అణు ఒప్పందం మన దేశం పాలిట ధృతరాష్ట్ర కౌగిలి అయ్యే ప్రమాదం స్పష్టంగా కనబడుతోంది. ◆

ఈ మాటలు మేధావులను ఉద్దేశిస్తూ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఇచ్చిన సందేశంలోనివి. శాంతి మహాసభలో ప్రసంగం కోసం ఐన్‌స్టీన్ తయారు చేసిన ఈ ఉపన్యాసం 1948 ఆగస్ట్ 29న పత్రికలకు విడుదలైంది.

ప్రస్తుతం అణు ఒప్పందం మీద జరుగుతున్న చర్చలో పాల్గొనడానికి ఈ ఐన్‌స్టీన్ మాటలు చాలా ఉపయోగపడతాయని నాకనిపిస్తోంది.

మనదేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో మంది మేధావులను తయారు చేసినప్పటికీ వారిలో ఏ ఒక్కరూ ధైర్యంగా, సూటిగా ముందుకు వచ్చి అణు ఇంధనం గురించిన చర్చలో పాల్గొనడంలేదు. అణు విద్యుత్తు కర్మాగారం విఫలమైతేనో, మన విద్యుత్తు అవసరాలను తీర్చడానికి రూపొందుతున్న అణుకేంద్రం విఫలమైతేనో దాని ప్రభావం పడే కోట్లాది మంది పేద ప్రజలకు అణు ఇంధనం గురించి వివరించడానికి ఈ శాస్త్రవేత్తలు ముందుకు రావడంలేదు. ఈ చర్చ రెండు స్థాయిలలో జరగవలసి ఉంది. మొదటిది మనదేశపు సార్వభౌమాధికారం. ఈ అణు ఒప్పందం తరువాత దానికేమవుతుంది. భారతదేశం సర్వసత్తాక సోషలిస్ట్ ప్రజాస్వామిక గణతంత్రంగా మిగులుతుందా, లేక ఉపఖండం మొత్తం అమెరికా బానిసత్వంలోకి వెళుతుందా. బానిసత్వం అంటే యుద్ధం ద్వారానో, ఆక్రమణ ద్వారానో మాత్రమే జరగనక్కరలేదు. ఇప్పుడు ఇంక ఏ దేశమూ మరో దేశాన్ని జయించి తనతో కలుపుకోదు. అది పాత పద్ధతి. ఇప్పుడు కొత్త ఆక్రమణ పద్ధతి గురించి జరుగుతున్న చర్చే అణు ఒప్పందం మీద జరుగుతోంది. అణు ఒప్పందంలో ఈ అంశానికి సంబంధించిన చాలా వివరమైన చర్చను జస్టిస్ కృష్ణ అయ్యర్ హిందూ పత్రికలో చేశారు. అది ఒక నిపుణుడి విశ్లేషణ. ఒక మంచి న్యాయ శాస్త్రవేత్త దృక్పథం. పార్లమెంట్‌లో జూలై 22న జరిగిన చర్చలో కొన్ని రాజకీయ పార్టీలు తీసుకున్న దృక్పథం అది. ఈ ఒప్పందపు రాజకీయ పర్యవసానాల గురించి వివరణమైన చర్చే జరిగింది. రాజకీయ కార్యాచరణ అంకగణితం గురించి ప్రచార సాధనాల వ్యాఖ్యాతలు ఉద్రేకంగా చర్చించారు.

ఇంతకు చర్చకు రానిదేమంటే విద్యుచ్ఛక్తి కోసం అణుశక్తిని వాడితే అది ప్రజల మీద ముఖ్యంగా ఈ దేశపు పేద ప్రజల మీద ఎటువంటి ప్రభావం వేస్తుంది. ఆ పేద ప్రజలు మన దేశానికి రెండు సార్లు ప్రజాస్వామ్యాన్ని ఇచ్చారు. మొదటిసారి స్వాతంత్ర్య సముపార్జన సమయంలో, రెండోసారి నిరంకుశ పాలన రుద్దబడినప్పుడు. ఉదారవాదులైన ఆలోచనపరులకు అటువంటి సహాయం చేసిన ప్రజలకు ఇవ్వాళ అణు ఒప్పందపు అమలు, తరువాత ఉండే సామాజిక పరిణామాల గురించి వివరించడం జరగడం లేదు. ఉదాహరణకు ఈ రకంగా విద్యుత్తును ఉత్పత్తి చేస్తే ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే అణుధార్మిక ప్రభావం ఉంటుందా. పౌర అణు విద్యుత్తు కార్యక్రమం ద్వారా విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేస్తే అణు వ్యర్థ పదార్థాలు తయారు అవుతాయా లేదా. మామూలు వ్యర్థ పదార్థాల శుద్ధికే ఒక సమర్థమైన సాంకేతిక పద్ధతిని కనిపెట్ట లేకపోయిన ఈ దేశం అణు వ్యర్థ పదార్థాలతో ఎలా వ్యవహరిస్తుంది. నిజానికి ఈ ఒప్పందాన్ని సమర్థిస్తున్న దేశాలలో అణు వ్యర్థ పదార్థాలను ఒదుల్చుకోవడం ఒక ప్రధాన సమస్యగా ఉంది. ఈ ఒప్పందం అమలులోకి వచ్చిన తరువాత మన వాతావరణంలో అణు ధార్మిక కాలుష్యం జరగదనే హామీ ఏమన్నా ఉందా. కొంతమంది రక్షణల గురించి మాట్లాడుతున్నారు. కాని, ఈ రక్షణలు ఎటువంటివి. జీవన స్వేచ్ఛ హామీ దొరకాలంటే ఈ రక్షణలు ఎటువంటివో కూడా చర్చించనక్కర్లేదా. ఆ రక్షణలను బహిరంగంగానూ, పార్లమెంట్‌లోనూ చర్చించనక్కర్లేదా. అణు ఒప్పందం ఈ ఉపఖండంలోని యావత్ ప్రజానీకపు జీవనస్వేచ్ఛతో ముడిపడినది అయినప్పుడు దాని గురించిన తీర్మానాలు ఇంత క్లుప్తంగా ఉంటే ఎలా.

మన గత చరిత్రలో రాజ్యాంగబద్ధమైన పాలన అనేది అంత సక్రమంగా జరగలేదు గనుక ఇప్పటికీ జరగడం లేదు గనుక ఇటువంటి సందేహాలన్నిటినీ లేవనెత్తవలసి ఉంది.

మనకున్న ప్రభుత్వాలు ఎటువంటివంటే 1984లో సిక్కులపై ఊచకోత జరిగినప్పుడు ఎంతమంది మరణించారో లెక్కలేదు. 1992 బొంబాయి ఘర్షణలో ఎంతమంది మరణించారో లెక్కలేదు. 2002 గుజరాత్ మారణకాండలో ఎంతమంది మరణించారో లెక్కలేదు. శాంతి భద్రతల పేరుమీద రాజ్యాంగం చర్యలలో రాజ్యం ప్రోత్సహించిన చర్యలలో ఎంతమంది చనిపోయారో లెక్కలేదు. సాధారణంగా మనం మరణాలపట్ల మొద్దుబారిపోయాం. అది ఒక్క మరణంగానీ, సామూహిక మరణాలు గానీ. భోపాల్‌లో విషవాయువు వెలువడినప్పుడు మనమేమీ చేయలేదు. ఆ మహా మానవ విషాదంలో బాధితుల నష్టపరిహారపు దరఖాస్తులన్నిటినీ పెట్టే హక్కును ప్రభుత్వం తనకు తాను దఖలు పరుచుకుంది. అన్ని వేలమంది పేదప్రజల ప్రాణాలు బలిగొన్న రసాయనిక వాయువు ఏమిటో ప్రజలకు ఎవరూ, ఎప్పుడూ చెప్పనేలేదు. ప్రభుత్వమంటే పనిచేసే అరాచకత్వం అని కొన్ని దశాబ్దాల కింద కెన్నెత్ గాల్‌బ్రెత్ అన్నాడు. ఆ మాట అని చాలా రోజులైంది గాని ఇవ్వాల్టికీ పరిస్థితిలో మార్పులేదు. ఇంకా ఎంతమాత్రమూ ప్రభుత్వాన్ని పనిచేసే అరాచకత్వంగా నడవనివ్వడానికి వీలులేదు.

దేశానికి సంబంధించిన ఈ నిర్ణయాధికార క్రమాలలో ఈ దేశ శాస్త్ర, సాంకేతిక నిపుణుల బృందం సమర్థవంతంగా పాల్గొనకపోవడం దురదృష్టకరం. అణు ఒప్పందపు ప్రయోజనాలు గురించి గాని, నష్టాల గురించి గాని ప్రజలకు తెలియజెప్పకపోవడం దురదృష్టకరం. ఈ ఒప్పందపు చట్టబద్ధ స్థితి ఏమిటి అని తెలుసుకోవడం పెద్ద విషయం కాదు. చట్టబద్ధతా, చట్టబద్ధమైన వాదనలు ఇంకా అక్కర్లేదు. పశ్చాత్య దేశాల అధికార కాంక్ష గురించిన అభిప్రాయాలు అక్కర్లేదు. ప్రజలకు కావలసిందల్లా ఈ అణు కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యుత్తు ఇవ్వడానికి ఈ దేశ ప్రజలు తమ అనారోగ్యం రూపంలో, మరణాల రూపంలో ఎంత మూల్యం చెల్లించవలసి ఉంటుంది. నెహ్రూ యుగంలో శాంతి కోసం అణువులు అనే నినాదంతో మనం ఉప్పొంగిన మాట నిజమే. కాని అదంతా గడచిపోయింది. మనకిప్పుడు అణు శక్తి గురించి, ప్రజా జీవితాలను అల్లకల్లోలం చేయగల దాని శక్తి గురించి ఎక్కువగా తెలుసు.

నేను విజ్ఞానశాస్త్ర రంగానికి చెందిన మనిషిని కాను. నేను చెప్పినది తప్పుకావచ్చు. నేను ఎందుకు తప్పో ప్రజలందరూ అర్థం చేసుకునే భాషలో చెప్పే హక్కు మీకుంది. ఇవ్వాళ జరగవలసిన చర్చ అదే. ◆

*అణు ఒప్పందం గురించి ప్రభుత్వం పైకి చెబుతున్న లక్ష్యాలు ఒకటైతే, అమెరికా రహస్య ఎజెండా మరొకటి ఉందని అంటున్నారు* **సాజీ గోపాల్**

# అణుఒప్పందం వాస్తవాలు

పార్లమెంట్‌లో మెజార్టీ కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం, జార్జ్ బుష్‌తో 'అణు ఒప్పందం' చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. పైకి న్యూక్లియర్ రియాక్టర్లకు అవసరమయ్యే 'యురేనియం' ఇంధనం సమకూర్చుకోవటం యీ ఒప్పందం లక్ష్యమైనా, దీనివెనుక ఎంతో రహస్య ఎజెండా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో యురేనియం ఖరీదు చేయాలంటే అమ్మడానికి సిద్ధంగా ఎన్నో దేశాలున్నాయి. ఎలాంటి నిబంధనలు లేకుండా కొనటానికి అవకాశం ఉంది. మరి అమెరికా నిబంధనలకు తలొగ్గాల్సిన అవసరముందా? భారతదేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కాలరాస్తూ, లాలూచీలతో, రహస్య ఒప్పందం చేసుకోవటం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకం కాదా? అసలు ఒప్పంద పత్రాన్ని జనానికి తెలియకుండా, పార్లమెంట్‌కు చూపకుండా రహస్యంగా ఉంచటం ఎంతవరకు సమంజసం. పచ్చి అబద్ధాలు చెప్పి ఇరాక్ ప్రజలపైన యుద్ధానికి పాల్పడిన అమెరికా అధ్యక్షుడు, పది లక్షల ఇరాకీ ప్రజల మరణానికి కారణమైన జార్జ్ బుష్ ప్రపంచ ప్రజల దృష్టిలో, ఆఖరికి అమెరికాలోను విశ్వసనీయత కోల్పోయాడు. కొన్ని నెలలలో పదవీకాలం కూడా ముగిసియనున్నది. చివరి రోజులలో ఏదోవొక ఒప్పందం చేసి గుర్తింపు పొందాలని ఈయిన తాపత్రయం.

ఈ ఒప్పందం వెనక చాలా బ్యూరోక్రసీ ఉంది. అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి.), దీనిని అమలు పరిచే అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐ.ఎ.ఇ.ఎ.), యురేనియం అమ్మే న్యూక్లియర్ సప్లై గ్రూపు (ఎన్.ఎస్.జి.), అమెరికా కాంగ్రెస్ చేసిన హైడ్ చట్టం (ఎచ్.వై.డి.ఇ. ఆక్ట్), 123 ఒప్పందం ఇలా చాలా ఉన్నాయి. 1970లో అమలులోకి వచ్చిన అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి.) పైన దాదాపు 187 దేశాలు సంతకాలు చేసాయి. భారతదేశం, పాకిస్థాన్, ఇజ్రెయిల్, ఉత్తరకోరియా యీ ఒప్పందానికి అంగీకరించలేదు. యీ ఒప్పందం సంతకం చేసిన దేశాలను రెండు రకాలుగా వర్గీకరిస్తుంది.

### 1) అణ్వాయుధాలు కలిగిన దేశాలు (న్యూక్లియర్ వెపన్ స్టేట్స్)

ఆ కాలంలో అణ్వాయుధాలు కలిగిన అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనాల దగ్గర ఉన్న అణ్వాయుధాలను అణ్వాయుధాలు వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి.), చట్టబద్ధం చేస్తుంది. యీ దేశాలు ఎలాంటి నిబంధనలు, పరీక్షలు ఎదుర్కోవలసిన అవసరం లేదు. అణ్వాయుధాలు కలిగిన దేశాలు అణ్వాయుధాల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర దేశాలకు అందించకూడదు.

### 2) అణ్వాయుధాలు లేని దేశాలు (నాన్-న్యూక్లియర్ వెపన్ స్టేట్స్)

అణ్వాయుధాలు తయారు చేయకూడదు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐ.ఎ.ఇ.ఎ.) నిబంధనలు, పరీక్షలు (ఇన్‌స్పెక్షన్స్) ఎదుర్కోవాలి. దేశప్రయోజనాల కోసం శాంతియుతమైన అణుశక్తి కార్యకలాపాలు సాగించవచ్చు.

ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ అణ్వాయుధాలు కలిగిన అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయిల్‌లు ఇతర దేశాలకు నీతులు చెపుతున్నాయి. ముందుగా తమ దగ్గర ఉన్న అణ్వాయుధాలు ధ్వంసం చేసిన తర్వాత నీతులు చెబితే బాగుంటుంది కదా! వాస్తవానికి అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి.) చాలా మోస పూరితమైంది. అగ్రరాజ్యాల దగ్గర ఉన్న విధ్వంసక అణ్వాయుధాలను చట్టబద్ధం చేస్తూ, ఇతర దేశాలపైన ఆంక్షలు, నిబంధనలు పెడుతోంది. ఇజ్రాయిల్, పాకిస్థాన్‌లు అణ్వాయుధాలు తయారుచేయడానికి రహస్యంగా సహాయం చేసిన అమెరికా; ఉత్తర కొరియా, ఇండియాలకు సహాయపడిన రష్యా, చైనాలు ఎన్.పి.టి. ఒప్పందాన్ని ఎప్పుడో ఉల్లంఘించాయి. భారతదేశం 'అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం' (ఎన్.పి.టి.) పైన సంతకం చేయకపోయినా, ఆచరణలో మటుకు దాని నిబంధనలను పాటించాలని ప్రయత్నిస్తోంది.

అమెరికా ప్రభుత్వం చేసిన హైడ్ చట్టం (ఎచ్.వై.డి.ఇ. ఆక్ట్)లో ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా ఇండియా ఆపాలని నిబంధనలు పెట్టింది. అంటే అమెరికా కనుసైగలతో ఇండియా నడుచుకోవాలి. అమెరికా ఆజ్ఞతో 'అంతర్జాతీయ అణుశక్తి సంస్థ' (ఐ.ఎ.ఇ.ఎ.) లో ఇరాన్ కు వ్యతిరేకంగా భారతదేశం ఓటు వేసింది. జాతీయ ఇంధనావసరాలకు ఎంతో కీలకమైన ఇరాన్ - పాకిస్థాన్ - ఇండియా గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్ట్‌ను దెబ్బతీసింది.

ఇండియా - అమెరికా అణు ఇంధన ఒప్పందం వల్ల నష్టాలు ఏమిటి? ఇండియాలోని న్యూక్లియర్ రియాక్టర్లు అన్నీ ఐ.ఎ.ఇ.ఎ. పరీక్షలు, నిబంధనలను ఎదుర్కోవాలి; అమెరికా అనుమతి లేనిదే ఇండియా ఎవరి దగ్గరా యురేనియం కొనకూడదు; న్యూక్లియర్ సప్లైర్ గ్రూప్, ఐ.ఎ.ఇ.ఎ. ఆంక్షలకు, మోసపూరితమైన ఎన్.పి.టి. ఒప్పందాలకు కట్టుబడి ఉండాలి; అమెరికా అడుగులకు ఇండియా మడుగులు వత్తాలి; అమెరికా సామ్రాజ్యవాద కుట్రలో ఇండియా భాగమై ఇరాన్‌కి వ్యతిరేకంగా పనిచేయాలి. ఇజ్రాయిల్ దురాక్రమణలను బలపరచాలి; అమెరికా కొనసాగిస్తున్న తప్పుడు విదేశాంగ విధానాలను, ఇరాక్‌లో అమెరికా దురాక్రమణను భారతదేశం బలపరచాలి. అమెరికా

*మీడియా సంస్థలకు అగ్రకుల రాజకీయ, సాంఘిక, వ్యాపార ప్రయోజనాలే లక్ష్యాలుగా ఉన్నాయనీ, ఈ లక్ష్యాలే వివక్షకు చోటు కల్పిస్తున్నాయనీ అంటున్నారు* **కృపాకర్ మాదిగ పొనుగోటి**

# యుద్ధం ముగియలేదు

మీడియా యాజమాన్యాలకు – బహుజన సమూహాలకు మధ్య యుద్ధం ముగియలేదు. సంధి కుదరనూ లేదు. ప్రచ్ఛన్నంగా కొనసాగుతూనే ఉంది. ఎందుకంటే అగ్రవర్ణ మీడియా సంస్థలకు అగ్రకుల రాజకీయ, సాంఘిక, వ్యాపార ప్రయోజనాలు లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ లక్ష్యాలే వివక్షకు చోటు కల్పిస్తున్నాయి.

బహుజన కులాలకు – అగ్రకులాలకు మధ్య ఘర్షణ ఉంది. ఈ వివక్ష ఆధిపత్యాల పునాదిగా అమలవుతోంది. ఒకసారి అంటరానితనం, మరొకసారి దాడి, ఇంకొకసారి అత్యాచారం, లేకుంటే అవకాశాల చట్రం నుండి (మార్జినలైజ్ చెయ్యడం) తప్పించడం మొదలగు రూపాల్లో ఈ వివక్ష కొనసాగుతోంది. మాదిగలు, దళితులు, ఆదివాసులు, బి.సి.లు, మహిళలు, మైనారిటీలను హిందూ అగ్రకుల, మగ ఆధిపత్యవాదులు న్యూనతపరుస్తున్నారు. అధికారంలోకి రానీయ కుండా పథకం ప్రకారం నియంత్రిస్తున్నారు. అగ్రకుల వ్యవస్థ వివిధ రూపాల్లో తన పాశవికతని దళిత, బహుజనులపై ప్రదర్శిస్తున్నది. అణగారిన కులాల ప్రజలు, నాయకులు, సంఘాలు ఈ వివక్షలను ఎదుర్కొనే ప్రజాస్వామిక చైతన్యాన్ని చూపెట్టడం స్వాగతించదగ్గదీ, హర్షణీయం.

ఈ దేశంలో మీడియాకు కులం ఉంది. మీడియా యాజమాన్యాలు అగ్రకులాలకు చెందినవి. మీడియా రంగ విశ్లేషకులు, నిపుణులు అగ్రకులాలకు చెందిన వారే. మీడియా సంస్థల యాజమాన్య విధానాలన్నీ ప్రభుత్వానికి అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఉంటున్నాయి. తమకు ఇష్టమైన రాజకీయ పార్టీ ప్రయోజనాలకు సాధనంగా, వేదికగా మీడియాను మార్చేస్తున్నాయి. తమకి అననుకూలంగా ఉన్న రాజకీయ శిబిరాలకు వ్యతిరేకంగా మీడియాను ఎక్కుపెడుతున్నాయి.

ఆంధ్రజ్యోతి దినపత్రిక ఇటీవల మాదిగ, ఎస్.సి., బి.సి. నాయకులను 'బాడుగ నేతలు'గా పేర్కొంటూ రాసిన వార్తా కథనంపై మాదిగ, అణగారిన కులాల సంఘాల నాయకులు తీవ్రంగా ప్రతిస్పందించారు. వారి కార్యకర్తలు సదరు పత్రికా కార్యాలయంపై రాళ్లతో దాడికి దిగి, నిప్పుపెట్టి నిరసన తెలిపారు. ఆ పత్రికా యాజమాన్యం ఇందుకు ప్రతిగా జర్నలిస్టు సంఘాలను కూడగట్టుకుని ఊరేగింపులు తీశారు. 'బాడుగ నేతలు'గా సూచించిన వారి ఫోటోలను దిష్టిబొమ్మలకు తగిలించి, వాటిని చెప్పులతో సంస్కరించి తగలబెట్టారు. ఈ విధంగా తమ బొమ్మలతో కూడిన దిష్టిబొమ్మలను అవమానిస్తారా? అని ఆగ్రహించిన మాదిగ, బహుజన నేతలు ఆ పత్రిక ఎడిటర్‌పై, కొంతమంది జర్నలిస్ట్‌లపై, ఆ పత్రిక మేనేజింగ్ డైరెక్టర్‌పై ఎస్.సి., ఎస్.టి.లపై అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసుపెట్టారు. ప్రాథమిక విచారణ పూర్తిచేసిన పోలీసులు ఆ పత్రిక ఎడిటర్ శ్రీనివాస్‌ను, మరో ఇద్దరు జర్నలిస్టులను అరెస్ట్ చేశారు. ఈ అంశంపై విమర్శ, ప్రతి విమర్శ, చర్చలు, మీటింగులు, ధర్నాలు, ఊరేగింపులు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, ఫిర్యాదులు, అరెస్ట్‌లు – వీటన్నింటికీ, కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా ఛానెళ్లు, కొన్ని దినపత్రికలు వేదికలయ్యాయి. యుద్ధం ముగియలేదు. సద్దుమణిగింది.

అణగారిన కులాల సంఘాలకు, అగ్రవర్ణ మీడియా యాజమాన్యాలకు మధ్య జరిగిన చారిత్రక తగాదాలో అగ్రకుల రాజకీయ పార్టీలన్నీ తమ వర్ణ మీడియా యాజమాన్యాల వైపే నిలిచాయి. సవర్ణ మీడియా యాజమాన్యాలు – సవర్ణ రాజకీయ పార్టీల అధినేతలు ఒక్కటే అని ఈ సందర్భంగా నిరూపించుకున్నారు.

ఒక కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అయితే మరో అడుగు ముందుకేసి మాదిగ నాయకులు నోళ్లు అదుపులో పెట్టుకోవాలని అసహనాన్ని ప్రదర్శించాడు. మావోయిస్టులు, పౌరహక్కుల ప్రొఫెసర్లు, లాయర్లు, విప్లవ రచయితలు ఎటువంటి మినహాయింపులూ లేని మద్దతును మాదిగ, దళిత, బహుజన నాయకులకు అందించ లేకపోయారు. బహుశా వారికీ, వారి బ్రాహ్మణ కులం అడ్డువచ్చిందేమో?

రాష్ట్రంలోని 61 షెడ్యూల్డ్ కులాల వారికి జనాభా నిష్పత్తి అనుసరించి ప్రతి ఎస్.సి. కులానికీ రిజర్వేషన్లలో వాటా అందించే

---

సాగిస్తున్న సామ్రాజ్యవాద మిలటరీ దురాక్రమణలో భారతదేశాన్ని పావుగా వాడుకోవాలని చూస్తోంది; అమెరికా ఆయుధ దళారుల దగ్గర బిలియన్లతో విధ్వంసక ఆయుధాలు కొనుగోలు చేయాలి; భారతదేశం సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టి, సామ్రాజ్యవాద అమెరికాకు గులాంగిరి చేయాలి.

కాంగ్రెస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలలో భాగస్వామి అయిన సి.పి.ఎం., సి.పి.ఐ. పార్టీలు నాలుగు సంవత్సరాల తర్వాత నిద్రలేచి మద్దతును వాపసు తీసుకున్నాయి. రాజకీయ దళారీ అమర్‌సింగ్, ములాయం సింగ్‌లు నాటకాన్ని రక్తికట్టిస్తున్నారు. దేశంలో ఆహార ధాన్యాల ధరలు, నిరుద్యోగ సమస్య, రైతుల ఆత్మహత్యలను ఏమాత్రం పట్టించుకోకుండా మన్మోహన్ సింగ్–సోనియా నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కేవలం అణుఇంధన ఒప్పందాన్ని పట్టుకొని వేలాడుతుంది. త్వరలో పతనమౌతుంది. భారతదేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టుపెట్టిన అణు ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ అందరూ ఉద్యమించాల్సి ఉంది. ◆

చట్టం పార్లమెంట్‌లో చెయ్యాలని మాదిగలు దీర్ఘకాలికంగా 'మాదిగ హక్కుల దండోరా' ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. ఎస్.సి. రిజర్వేషన్ల మొత్తాన్ని తానే అనుభవించాలనే స్వార్థంతో మాల సంఘాలు, మాల నాయకులు, మాల మేధావులు కొంతమంది, మాదిగలు ముందుకు తెచ్చిన ఈ వర్గీకరణ డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్నారు. అడ్డుపడుతున్నారు. పైగా మాదిగల న్యాయబద్ధమైన వర్గీకరణ డిమాండ్‌పై బురదచల్లే కార్యక్రమంలో భాగంగా కొంతమంది మాలలు మాదిగ ఉద్యమం వెనక అగ్రకుల రాజకీయ శక్తులు పని చేస్తున్నాయని అన్యాయమైన నిందారోపణలకు పూనుకున్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు. వర్ణ మీడియాకు, మాదిగలకు మధ్య జరుగుతున్న పోరాటంలో మాల మహానాడు సంఘాలన్నీ పెట్టుబడి మీడియా యాజమాన్యాలకే వత్తాసు పలికాయి. మాల జర్నలిస్టులు, మాల లాయర్లు, మాల తత్వవేత్తలు, మాల విప్లవ కళాకారులు, మాల విప్లవవాదులు, మాల అంబేద్కర్ వాదుల్లో కొందరు ప్రత్యక్షంగా అగ్రకుల పెట్టుబడి మీడియా యజమాన్యాలకే మద్దతు తెలిపారు. మరికొందరు మౌనంగా మద్దతునందించారు. ఇది మాదిగలకు, బహుజనులకు దురదృష్టకర చారిత్రక సందర్భం అని చెప్పుకోవాలి.

మాదిగలు ముందుకు తెచ్చిన వర్గీకరణ ఉద్యమం వెనక అగ్రకుల రాజకీయ పార్టీలు ఉన్నాయని కొంతమంది మాలలు బండలు వేసిన మాదిరిగానే, మాదిగల ప్రతీకారం వెనక ముఖ్యమంత్రి ఉన్నాడని ఆంధ్రజ్యోతి, ఎడిటర్ ఆరోపించడం వెనక ఎంత మాత్రం నిజంలేదు.

వర్ణ మీడియా యాజమాన్యాలు – మాదిగ, దళిత, బహుజనుల మధ్య జరిగిన ఈ పోరాటంలో ఈ కింది తీర్మానాలకు రావాలి.

1. పెద్ద పత్రికల, ఎలక్ట్రానిక్ ఛానెళ్ల యాజమాన్యాలు వాటి ఎడిటర్లు, మేధో సిబ్బంది అంతా అగ్రకులాల వారితో నిండిపోయారు. అగ్రవర్ణ మీడియా సంస్థలు, వ్యాపార, రాజకీయ ప్రయోజనాలు కలిగినవి. ఐనప్పటికీ, వాటికి సామాజిక బాధ్యత ఉంటుందనే విషయాన్ని నిరంతరం గుర్తుచెయ్యాలి.
2. మీడియా సంస్థల నియామకాల్లో ప్రజాస్వామిక వైవిధ్యం, భిన్నత్వం ప్రతిబింబించేలా అణగారిన అన్ని సామాజిక వర్గాలకు జనాభా నిష్పత్తి సూత్రంపై రిజర్వేషన్లు కల్పించాలి.
3. అగ్రవర్ణ మీడియాకి ప్రత్యామ్నాయంగా మాదిగ మీడియా, దళిత మీడియా, ఆదివాసి మీడియా, బి.సి. మీడియా, మైనారిటీ మీడియా, మహిళా మీడియా మొదలగు పేర్లతో ప్రత్యామ్నాయ మీడియా వ్యవస్థల స్థాపన కోసం బహుజనుల్లోని ఆయా సామాజిక వర్గాలకు చెందిన మేధావులు, నాయకులు కృషి చెయ్యాలి.
4. అగ్రవర్ణ మీడియా మాదిగలను, దళితులను, ఆదివాసులను, బి.సి., మైనారిటీలను, మహిళలను వారి నాయకులను కించపరిచే అవకాశం ఎప్పుడూ ఉంది. అణగారిన సామాజిక వర్గాల నాయకులను సమాజాన్ని నడిపించే నాయకులుగా ఎదగ నీయకుండా, వారిని వారి కార్యక్రమాలను, వారి అభిప్రాయాలను వార్తల్లో అదృశ్యం చెయ్యవచ్చు. వారి వార్తలను చిన్నవిగా చూపెట్టవచ్చు. వక్రీకరించవచ్చు. వారు పోటీదారులు, మొదటివారు కాకుండా వర్ణమీడియా చిత్రించడానికి నిరంతరం ఆస్కారం ఉంది. ఇటువంటి సందర్భాల్లో మాదిగలు, దళిత, బహుజన శక్తులు సంఘటితం కావాలి. సంఘీభావం ప్రకటించుకోవాలి. వర్ణ మీడియాతో యుద్ధం ముగియలేదు. అప్రమత్తంగా ఉండాలి. ◆

## వీక్షణంలో వ్యాపార ప్రకటనల గురించి....

వీక్షణం ప్రతి సంచికలోనూ అచ్చవుతున్న ప్రభుత్వ ప్రకటన గురించి, ఇటీవల అచ్చయిన కొన్ని వ్యాపార ప్రకటనల గురించి కొందరు గౌరవనీయ మిత్రులు తమ అభ్యంతరాలను, సందేహాలను వ్యక్తం చేశారు. అటువంటి అభ్యంతరాలే, సందేహాలే మరికొందరు మిత్రులలో, అభిమానులలో కూడ ఉండవచ్చు. ఏ పత్రిక అయినా అచ్చువేసే వ్యాపార ప్రకటనలతో ఆ పత్రికకు ఏకీభావం ఉండాలనే నియమమేమీలేదు. ఆ వ్యాపార ప్రకటనలను స్వీకరించడమా లేదా అన్నది పత్రిక ఇష్టాయిష్టాలకు సంబంధించిన అంశం కాదు. పత్రికారంగ ఆర్థిక స్థితికి సంబంధించిన విషయం. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం అమ్మకాల ఆదాయం మీద మాత్రమే ఆధారపడి ఏ పత్రికా నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం పత్రిక ఉత్పత్తి వ్యయంలో కొంతభాగాన్ని మాత్రమే పూరించగలుగుతుంది. అందువల్లనే పత్రికారంగం సాధారణంగా వ్యాపార ప్రకటనల ద్వారా ఆ లోటును పూరించుకోవడం మాత్రమే గాక లాభాలు కూడ చేసుకుంటుంది. వీక్షణం వంటి ప్రత్యామ్నాయ పత్రికలకు లాభాల సంగతి అలా ఉంచి, కనీస మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులయినా కావాలి. అందుకోసం కొన్ని వ్యాపార ప్రకటనలనయినా అంగీకరించకతప్పదు.

ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలన్నిటినీ పెద్ద పత్రికలు, పాలకపార్టీ ఆశ్రిత పత్రికలు, పైరవీకారులు కబ్జా చేస్తున్నారని, ఆ ప్రకటనల విధానంలో పారదర్శకత ఉండాలని, చిన్న పత్రికలకు ప్రాధాన్యత ఉండాలని ఎంతో కాలంగా ఆందోళన జరిగిన ఫలితంగా కొన్ని సంవత్సరాల కింద ప్రభుత్వ ప్రకటనలలో చిన్న పత్రికలకు తప్పనిసరిగా కొంతభాగం కేటాయించాలనే నిబంధనలు అమలులోకి వచ్చాయి. అందువల్ల వీక్షణంకు వస్తున్న ప్రభుత్వ ప్రకటన చిన్న పత్రికల హక్కుగా వస్తున్నదే తప్ప వీక్షణంలో అచ్చయ్యే రచనల మీద ప్రభావం వేయగలిగినది కాదు. నిజానికి ఆ ప్రకటన వల్ల వీక్షణం తన వైఖరిలో ఎప్పుడయినా ఏ మెతకవైఖరినయినా ప్రదర్శించి ఉంటే ఎవరయినా దాన్ని ఎత్తిచూపి సరిదిద్దవచ్చు. పత్రిక నిర్వహణ కొరకు వ్యాపార ప్రకటనలను స్వీకరించకతప్పని దుస్థితిలో అవి రచనల మీద ప్రభావం వేయకుండా జాగ్రత్త పడడం తప్ప ప్రస్తుతానికి మరేమీ చేయగల అవకాశం లేదు. వ్యాపార ప్రకటనలను ఎంతమాత్రం స్వీకరించబోమని ప్రకటించాలంటే పత్రికకు విస్తారమైన ప్రజాసంఘీభావం ఉండాలి. అది ఆర్థిక స్వావలంబనగా మారగలిగిన స్థితి ఉండాలి. లేకపోతే కొంతకాలం విరాళాలమీదనో, అప్పుల మీదనో నడిపి ఆ తర్వాత పత్రికను ఆపివేయడం మినహా మరోమార్గం లేదు. ఈ అంశాలను పాఠకుల, అభిమానుల దృష్టికి తీసుకురావడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

**వీక్షణంలో మీ ప్రకటనలకై చెల్లించాల్సిన రుసుం**

చివరి కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ) రు. 15,000; రెండవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ) రు. 10,000

మూడవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ) రు. 10,000; లోపల పేజీ (బ్లాక్ అండ్ వైట్‌లో ఫుల్ పేజీ) రు. 7,500

*భావప్రకటనా స్వేచ్ఛ, పత్రికాస్వేచ్ఛల గురించి మాట్లాడిన ఆంధ్రజ్యోతి ప్రజాస్వామికమైన చర్చకు అవకాశమే ఇవ్వలేదంటున్నారు* **సాంబయ్య గుండిమెడ**

# బాడుగ నేతలా? బాడుగ రాతలా?

బడుగు, బలహీనవర్గ ప్రజల సంక్షేమాన్ని కాలరాసి, వారి క్షామానికి గోతులు తవ్వుతున్న సర్కార్ పక్షంపై గాండ్రించాల్సిన వారే ఆ పక్షం డబ్బు, పరపతులకు దాసోహమవుతున్నారు. తాము స్వయంగా అధికారపక్ష భజనకు పూనుకోవడమేగాక దాని సేవలో తరించాల్సిందిగా తమ కుల జనాన్ని కోరుతున్నారు. సందర్భానుసారంగా రూపం మార్చే ఊసరవెల్లిలా తమవారి దగ్గర 'బాడుగ నేతలు'గా – అధికార పక్షం దగ్గర 'బాడుగ నేతలు'గా రూపాలను మార్చుకుంటూ సంఘ సంక్షేమ ముసుగులో స్వీయ సంక్షేమాన్ని ప్రోదు చేసుకుంటున్నారు. సామాజిక విప్లవ నినాదాన్ని బడుగుల ఆత్మగౌరవ పోరాటాలను అధికార పీఠానికి బలిచేశారంటూ అణచివేతకు గురైన ప్రజానేతలపై ఆంధ్రజ్యోతి (26 మే, 2008) అభియోగ కథనం. కథనంలో తమపై మోపిన అభియోగానికి, అవమానించిన తీరుకి ఆగ్రహం చెందిన ప్రజానీకం జరిపిన భౌతిక దాడిని 'కలంపై జులుం', 'భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి', 'ప్రజాస్వామ్యానికే అవమానం' అని పెద్ద పెద్ద మాటలతో మీడియా, రాజకీయ పక్షాలు, పౌరసంఘాలు, కుల–వర్గ సంఘాలు, ఇంకా ఎందరో ప్రముఖ వ్యక్తులు ఆ ప్రజానీకంపై మానసిక దాడికి పూనుకున్నారు. దాడి జరిగిన తరువాత భావప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు లాంటి ఉన్నతమైన విషయాలపై భారీ స్థాయిలో మీడియాలో మేధోమథనం జరిగింది.

అయితే బాడుగనేతలు కథనంలో ఏది రాస్తే, ఎలా రాస్తే అణచివేతకు గురైన ప్రజలు మనస్తాపం చెంది దాడి చేశారు? అన్న అంశంపై అదే స్థాయిలో చర్చ జరుపలేదు. మిగిలిన మీడియా సంగతి ఎట్లున్నా కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతి సైతం ఈ చర్చను ఆహ్వానించలేదు. పై పెచ్చు దాడి జరిగిన మరుసటి రోజే అదే కథనాన్ని మలి ముద్రించి 'ఆ కథనంలో తప్పేమిటి?' అనే ఒక అహంకార సవాలు కూడా విసిరింది. పత్రికా స్వేచ్ఛను అడ్డుపెట్టుకుని ఆంధ్రజ్యోతి చేసింది రాజకీయమని బాలగోపాల్ (సాక్షి, 26 జూన్, 2008) లాంటి సామాజిక శ్రేయోభిలాషులతో పాటు అణచివేతకు గురైన ప్రజానీకం వాదన. వీరి వాదనతో ఏకీభవిస్తూ అది కేవలం రాజకీయమే కాదు అగ్రకుల రాజకీయం కూడా అని నా వాదన. ఈ విషయాలను చర్చించే ముందు ఆంధ్రజ్యోతి కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ చేసిన వ్యాఖ్యానాల వెనుక దాగున్న ఉద్దేశాలను, ఆశించిన ప్రయోజనాలను గురించి క్లుప్తంగానైనా కొంత తప్పకుండా చెప్పుకోవాలి.

సాధారణంగా రాజకీయాలలో, ప్రజాజీవితంలో భాగస్వాములుగా ఉన్న వ్యక్తులు అకస్మాత్తుగా సంభవించే సంఘటనలు, ఆ సంఘటనల పరిణామాలు అమలులో ఉన్న వ్యవస్థను తాకిడికి గురిచేసే ఉధృతి కలిగి ఉండే సందర్భాలలో చేసే వ్యాఖ్యానాలు రెండురకాలు. ఒకటి, ప్రజా శ్రేయస్సుకై వ్యవస్థను కాపాడుకునే నిమిత్తం. ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడిని మానవహక్కుల వేదిక, విరసం లాంటి సంఘాలు, కంచె ఐలయ్య లాంటివారు భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, ఆ విలువలను సంరక్షించుకోవాలనే తపనతో చేసిన ఖండనలు ఈ కోవకి చెందుతాయి. రెండు, వ్యవస్థ సంరక్షణ ముసుగులో సంఘటనల నుండి స్వప్రయోజనాలు సాధించుకునే నిమిత్తం. పౌరజీవన శ్రేయస్సుకు, క్రమబద్ధీకరణకు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థను, దాని నియమాలను అతిక్రమించి భౌతిక దాడికి పూనుకోవడం సబబా? కాదా? అనే విషయాన్ని అటుంచి, కథనంలో తమపై జరిపిన మానసిక దాడికి వ్యతిరేకంగా ఆంధ్రజ్యోతిపై భౌతికదాడి చేసిన వారు అణచివేతకు గురికాబడిన ప్రజానీకం. ఒక్కమాటలో, రాతతో రెచ్చగొట్టింది ఒకరు, రెచ్చిపోయింది మరొకరు. ఇందులో మూడవ వ్యక్తి హస్త మెక్కడుంది. లేదని తెలిసినప్పటికీ తెలుగుదేశం, టి.ఆర్.ఎస్. లాంటి ప్రతిపక్షాలు సర్కార్ పక్ష కుట్ర అనడం అంటే సంఘటనల ఆసరాతో సర్కార్ పక్షంపై బురద జల్లి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశమేగాని, ప్రజాస్వామ్య విలువలు కాపాడుకోవాలనే ఆశ లేశమంతైనా కనిపించదు. సినిమా నటుడు, నూతన రాజకీయ పార్టీ స్థాపన ఆలోచనలో ఉన్న చిరంజీవి వ్యాఖ్యానం కూడా ఈ రెండవ కోవకే చెందుతుంది. అయితే ఇతను చేసిన వ్యాఖ్యానానికి, ఆ వ్యాఖ్యానం చేసిన సందర్భానికి కొంత ప్రత్యేకత ఉంది.

దాడిని ఖండిస్తూ చిరంజీవి చేసిన వ్యాఖ్యానాన్ని ఆంధ్రజ్యోతి (27 మే, 2008) ప్రముఖంగా పేర్కొంది. 'ఆంధ్రజ్యోతిపై దాడి హేయమైన చర్య. ఇది ప్రజాస్వామ్యానికే అవమానం. వార్తా కథనంలో వచ్చిన అంశాలు వ్యక్తిగతంగా నష్టం కలిగించేవి ఉంటే నిరసన తెలపడానికి ఎన్నో మార్గాలున్నాయి. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. కథనం తప్పనుకుంటే ఖండించాలి. వివరణ ఇవ్వాలి, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపాలి. కానీ దాడి చేయడం దారుణం'. చిరంజీవి దాడిని ఖండించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. అయితే ప్రజాస్వామ్యమనే ఒక వ్యవస్థ ఉందనీ, ఆ వ్యవస్థ కొన్ని విలువలపై

ఆధారపడి నడుస్తుందనీ ఇతనికి అకస్మాత్తుగా స్ఫురణకు రావడం వెనుక సంఘటన నుండి రాజకీయ లబ్ది పొందే ఉద్దేశమేగానీ మరేదీ కాదని రెండు విషయాల ద్వారా స్పష్టంగా చెప్పవచ్చు. ఒకటి, చిరంజీవి సినిమా రంగంలో స్టార్‌గా ఎదుగుతున్న కాలంలో కారంచెడులో కమ్మలు, చుండూరులో రెడ్లు మాదిగ – మాల ప్రజలపై నాగరికత సిగ్గు పడేలా భౌతికదాడులు నిర్వహించి, పాశవికంగా హింసించి హత్యలుగావించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములైన దళితులపై చేసిన దాడులు ఆ వ్యవస్థపై అగ్రకుల కత్తులు పొడిచిన గాట్లు. ఇది ప్రజాస్వామ్యానికి జరిగిన అవమానం కాదా? మరి ఇతను అప్పుడు ఎందుకు స్పందించలేదు? 'కమ్మల, కొంతమేర రెడ్ల కనుసన్నలలో నడుస్తున్న సినిమారంగంలో కాపు కులానికి చెంది, అప్పుడే ఎదుగుతున్న తను ఈ సంఘటనలకు వ్యతిరేకంగా స్పందిస్తే తన కెరియర్‌కు దెబ్బ అని అప్పుడు తాను స్పందించలేదు' అని అతను ఈనాడు స్పందించవచ్చు. అయితే చిరంజీవి స్టార్ నుండి మెగాస్టార్‌గా ఎదిగిన తరువాత కూడా వేంపెంట, పదిరికుప్పం లాంటి ఎన్నో చోట్ల కులకత్తులు దళితులను ఊచకోతలు కోశాయి. ఈ ఊచకోతలు కూడా ప్రజాస్వామ్యానికి జరిగిన అవమానమే. మరి వాటిని అతను ఎందుకు ఖండించలేదు? ఆ దారుణాలను ఖండిస్తే మెగాస్టార్ కెరియర్‌కు నష్టంలేకపోగా అణచివేతకు గురికాబడిన కుల – వర్గాలలో అతని ఇమేజ్ ఎన్నో రెట్లు పెరిగి ఉండేది.

రెండు, 2003 ఏప్రిల్ చివరి వారంలో తన సోదరులు నాగేంద్రబాబు, పవన్‌కళ్యాణ్, తన బావమరిది అల్లు అరవింద్ తమ అనుచరగణంతో దక్కన్ క్రానికల్ కార్యాలయంపై భౌతికదాడి జరిపారు. పవన్‌కళ్యాణ్ ఒకడుగు ముందుకేసి రిపోర్టర్ మహమ్మద్ అబ్దుల్‌పై, కెమెరామెన్ దుర్గారావులపై చేయి కూడా చేసుకున్నాడు. ఆంధ్రజ్యోతిలో చిరంజీవి చేసిన వ్యాఖ్యానం అతనికే చెప్పాలంటే, దక్కన క్రానికల్, ఆంధ్రభూమి పత్రికలలో వచ్చిన కథనాంశాలు అతనికి లేదా అతని కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా నష్టం కలిగించి ఉంటే నిరసన తెలపడానికి ఎన్నో మార్గాలున్నాయి. అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించవచ్చు. కథనం తప్పనుకుంటే ఖండించాలి, నిరసన తెలపాలి. కానీ దాడి చేయడం దారుణం కాదా? ఆ రోజున ఆ దాడి రూపంలో చిరంజీవి కుటుంబ సభ్యులు ప్రజాస్వామ్యానికి చేసింది అవమానం కాదా? తనకు, తనవారికి ఒక న్యాయం, పరవారికి మరొక న్యాయమా? ఇది హేయమైన విషయం కాదా? సారాంశంలో, వ్యవస్థ విలువలకు కట్టుబడి దాడిని ఖండించడం, వ్యవస్థ పరిరక్షణ పేర రాజకీయ లబ్ధిపొందే ఉద్దేశంతో దాడిని ఖండించడం ఒకటి కాదు. ఈ రెండూ వేరువేరు విషయాలు. వీటిని ఒక్కగాటన కట్టివేసి చూడరాదు.

### ఆంధ్రజ్యోతి రాజకీయం

బాడుగ నేతలు అభియోగ కథనం ఆసాంతం పరిశీలిస్తే ఆ కథనం ప్రధాన ఉద్దేశం అణచివేతకు గ్గురైన ప్రజానీకానికి తమ నాయకుల పై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీసి, ఆ నాయకులను అభాసుపాలు చేసేందుకే అన్నది స్పష్టం. ఈ విషయాన్ని రెండు అంశాలలో చెప్పుకునే ముందు అభియోగం దాని పర్యావసనం విషయమై క్లుప్తంగానైనా కొంత చెప్పుకోవాలి. ఒక వ్యక్తిపైగాని లేదా కొందరు వ్యక్తులపైగాని వ్యక్తిగతంగానో, సామూహికంగానో లేదా వ్యవస్థాపరంగానో మనం ఏర్పాటు చేసుకున్న నియమాలను ఆ వ్యక్తి లేదా ఆయా వ్యక్తుల సమూహం అతిక్రమించినప్పుడు, వ్యతిరేకంగా ప్రవర్తించినప్పుడు అభియోగం మోపడం జరుగుతుంది. అభియోగాలు నిజాలుగా నిరూపించబడితే తద్వారా ఉత్పన్నమయ్యే పర్యవసానాలు ఆ నియమాలు వ్యతిరేకించిన వ్యక్తి, వ్యక్తులపైన చాలా తీవ్రంగా ఉంటుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఒక సమూహంలో సభ్యుడిగా ఉంటూ ఆ సమూహ ప్రయోజనాలకు భంగం కలిగించే కార్యక్రమాలను చేపట్టినపుడు ఆ వ్యక్తిపైన అభియోగం మోపి, ఆ అభియోగం నిజమని నిరూపించబడినప్పుడు విధించే పెద్ద శిక్ష సమూహ బహిష్కరణ. కొన్ని ప్రత్యేక సందర్భాలలో అప్పటివరకూ ఆ వ్యక్తి సంపాదించిన ఆస్తిపాస్తులను సైతం ఆ సమూహం జప్తు చేస్తుంది. అయితే ఈ మొత్తం ప్రహసనంలో బహిష్కరణ, ఆస్తిజప్తు చాలా చిన్న విషయాలు. ఒక వ్యక్తిగా సమూహ సభ్యుడిగా సామాజికంగా అప్పటివరకు సాధించుకున్న విశ్వసనీయత కోల్పోవడం అనేది కీలకమైన విషయం. విశ్వసనీయత కోల్పోయిన వ్యక్తికి పూర్వస్థాయిలో అవకాశాలు రావడం చాలా అరుదు. ఒకరకంగా సమూహ సభ్యుడిగా అతని జీవితం అంతటితో ఖండమైనట్లే. భారతీయ జనతా పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ రాజకీయ జీవితం ఇందుకు తిరుగులేని ఉదాహరణ.

ఆంధ్రజ్యోతి కథనంలోని ఉదాంతాన్నే తీసుకుంటే అభియోగం మోపబడిన నేతలందరూ అణచివేతకు గురికాబడిన కుల–వర్గ సమూహాల సభ్యులుగా, వ్యవస్థీకృతంగా తమకు వేసిన బంధనాలను ఛేదించుకుని, కట్టిన అడ్డుగోడలను అధిగమించి సాధారణ సభ్యుల స్థాయినుండి నేతలుగా ఎదిగారు. ఈ ఎదగడమనే క్రమంలో తమతోపాటు తమవారిని స్వేచ్ఛాజీవులు చేయాలనే ఓ తపన ఉంది. ఓ ఆరాటం, ఓ పోరాటం ఉంది. ఆంధ్రజ్యోతి అకస్మాత్తుగా మోపిన తీవ్రమైన ఆ అభియోగాలు నిజాలయితే వ్యక్తిగతంగా వారు సాధించిన నేతగిరి కోల్పోవడమే గాక అహోరాత్రులు శ్రమకోర్చి నిర్మించిన సామాజిక ఉద్యమాలు నిలువునా కుప్పకూలిపోతాయి.

ఇక్కడ ఒక్క విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. దశాబ్దాలుగా వారు నిర్మించిన ఉద్యమాలు కుప్పకూలిపోతాయనో లేదా వారు వ్యక్తిగతంగా ఉద్యమ నాయకత్వానికి దూరమవుతారనో ఆంధ్రజ్యోతి అభియోగ కథనానికి వ్యతిరేకత చూపించాల్సిన అవసరంలేదు. నేతలు తమ ప్రజల ప్రయోజనాలను కాలరాచే కార్యక్రమాలకు పూనుకుంటే వారు నాయకులుగా కొనసాగడానికి అనర్హులు అనే విషయంలో ఎటువంటి సందేహానికి ఆస్కారంలేదు. అయితే, అణచివేతకు గురైన కుల – వర్గాల నేతలు తాము భక్షిస్తూ తమ వారిని వంచిస్తున్నారనే ఒక తీవ్రమైన అభియోగాన్ని మోపి ఆధారాలు చూపకపోవడం పత్రిక స్వేచ్ఛ పేర ఆ నేతలను అభాసుపాలు చెయ్యడమే ఆంధ్రజ్యోతి అసలు ఎజెండా అనేది తేటతెల్లం. తాను దళితుల పక్షపాతినని, బడుగు, బలహీనవర్గాల ఈతిబాధలను సమాజానికి ఎరుకపరచడంలో ముందుంది తానేనని చెప్పుకొంటున్న ఆంధ్రజ్యోతికి ఆయా నేతలను అభాసుపాలు చేసి, వారు నిర్మించిన ఉద్యమాలను కుప్పకూల్చాల్సిన అవసరం ఏమిటి?

'ఇంకా పార్టీ పెట్టని ఓ అగ్రకుల సినీహీరోను బడుగు, బలహీనవర్గాల నేతగా పేర్కొంటూ ఆంధ్రజ్యోతి వార్తలు రాస్తోంది' అని కృష్ణమాదిగ (ఆంధ్రజ్యోతి, 27 మే, 2008) పేర్కొనడాన్ని ఆధారంగా చేసుకుని విషయాన్ని పరిశీలిస్తే ఈ నేతలపై ఆ పత్రిక ఎందుకు బురదజల్లు బూనిందో స్పష్టమవుతుంది.

కాపులు ఒకవైపున రాజకీయంగా, ఆర్థికంగా కమ్మ, రెడ్లతో పోటీపడుతూ సామాజికంగా ఆ కులాలతో సమానస్థాయి గలవారమని చెప్పుకుంటూనే, మరొకవైపున తాము బి.సి. సామాజిక కేటగిరి కిందికి వస్తామని, కాబట్టి తమకు కూడా ఇతర బి.సి. కులాలకి వర్తించే రిజర్వేషన్ వసతులు వర్తింపజేయాలని ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. కాపులు బి.సి. కేటగిరి కిందకు రారనీ, తమ కేటగిరిలో చేర్చమనే డిమాండ్ పేదలైన తమకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన రిజర్వేషన్ వసతులను కాజేయడమే గాక తమ ఓటు బ్యాంక్‌ను కబళించి తద్వారా రాజ్యాధికారం చేజిక్కించుకునే పన్నాగమేనని బి.సిలు కాపుల డిమాండ్ పట్ల వ్యతిరేకత చూపుతూనే ఉన్నారు. అయితే ఈ మధ్యకాలంలో ముఖ్యంగా చిరంజీవి రాజకీయ అరంగేట్రం బహిరంగ రహస్యమయిన దగ్గర నుండి కాపులు తమ బి.సి. కేటగిరి డిమాండ్‌ని మరింత ఉధృతం చేయడం జరిగింది. కాపులు తమ బి.సి. డిమాండ్ సాధించుకున్నా, సాధించుకోలేకపోయినా, డిమాండ్ సందర్భంగా జరిగే చర్చల ద్వారా తమ డిమాండ్ పట్ల, తమ పట్ల బి.సి.లలో ఒక సదభిప్రాయం కలుగజేయటం ఈ డిమాండ్ ఉధృతి ముఖ్య ఎజెండా.

సినీనటుడిగా చిరంజీవికి ఉన్న పాపులారిటీకి తోడు బి.సి. ప్రజలు ఇచ్చే అండదండలతో రాబోయే శాసనసభ ఎన్నికలలో బరిలోకి దిగాలనేది చిరంజీవి అనుయాయుల పకడ్బంది పథకం. చిరంజీవిపై సానుకూల కథనాంశాలు ప్రచురిస్తూ అట్టి పథక అమలుకు ఆంధ్రజ్యోతి తనవంతు చేయూతనిస్తోందనేది బహిరంగ సత్యం. బి.సి.లు, వారితో పాటు సామాజిక అణచివేతకు గురికాబడిన ప్రజలు చిరంజీవి వైపుమళ్లి అతని నాయకత్వం పట్ల సానుకూలత చూపించాలంటే అప్పటివరకూ తాము నాయకత్వం వహిస్తున్న వారిపట్ల విశ్వసనీయత కోల్పోతేనే జరుగుతుంది. ఒక్కమాటలో అణచివేతకు గురికాబడిన ప్రజలలో తమ నేతలపట్లున్న విశ్వసనీయతను దెబ్బతీసి ఆయా సామాజిక వర్గాలలో నాయకత్వ శూన్యతను కలగజేయడం, చిరంజీవి నాయకత్వంతో ఆ శూన్యాన్ని భర్తీ చేయడం అసలు ఉద్దేశం.

రెండు, ఈ పాయింట్ నా మొదటి పాయింట్‌కి కొనసాగింపు. 'బడుగు, బలహీనవర్గాల ప్రజలను వంచిస్తున్న నేతల గురించి రాసిన ఆ కథనంలో మేం ఏ పేర్లనూ ప్రస్తావించలేదు. వంచనకు గురవుతున్న వర్గాలపై ఆర్తితో (రాసింది) ఆ కథనం' (వి. రాధాకృష్ణ, కె. శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి, 27 మే, 2008) అని ఆంధ్రజ్యోతివారు పేర్కొన్న విషయంలో రెండు అంశాలు ఉన్నాయి. పేర్లను పేర్కొనకపోవడం, వంచనకు గురవుతున్న ప్రజలపై ఆర్తి. ఈ రెండవ అంశ కోణం నుండి గమనిస్తే అణచివేతకు గురికాబడిన ప్రజానీకంపై వారికి ఆర్తి కలగడానికి ప్రధానహేతువు - ఆ ప్రజలు వంచనకు గురికావడం. వంచనకు గురవుతున్న కుల-వర్గ ప్రజానీకానికి సంబంధించిన కథనాంశాలు తమతో (ఆంధ్రజ్యోతి) పాటు ఎన్నో పత్రికలు ప్రచురిస్తాయి. అయితే మిగిలిన పత్రికలకు తమకు ఉన్న వ్యత్యాసం వారిపట్ల తమకున్న ఆర్తి. అంటే ఇక్కడ ఆర్తి అనేది ఒక యోగ్యతా పత్రం. ఆ యోగ్యతా పత్రాన్ని కలిగి ఉండడమంటే బలహీనులకు జరుగుతున్న వంచనను రూపుమాపి, ఆ బలహీనులను బలవంతులుగా రూపుదిద్దాలనే కాంక్ష కలిగి ఉండడం. బలహీనవర్గాల కథనాంశాల ప్రచురణ కేవలం ఈ కాంక్షను సాకారం చేసేందుకే. ఆర్తి అనే పదం ద్వారా ఆంధ్రజ్యోతి చెప్పదలచిన విషయం ఇది.

అణచివేతకు గురైన ప్రజానీకంపై ఆర్తి కలిగి ఉండడాన్ని, ఆ ఆర్తితో వారికి సంబంధించిన కథనాంశాలను ప్రచురించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. పైగా కులంపేర, వర్గంపేర సమాజంలో జరుగుతున్న వంచనను ప్రపంచానికెరుకపరచి ఒక పత్రికగా తన బాధ్యతను శక్తిమంతంగా నిర్వహించిందని ఆ పత్రిక ప్రజా మన్ననలను అందుకోగలదు. అయితే ఇక్కడ కథన నేపథ్యం వేరు. మిగిలిన సందర్భాలలో వచ్చే కథనాలలో వంచించేవారు - వంచించబడేవారు వేరువేరు సామాజిక కుల - వర్గాలకు సంబంధించిన వ్యక్తులు కాగా, ఈ సందర్భంలో మాత్రం (కథనం ప్రకారం) వంచన చేసినవారు - వంచనకు గురైనవారు ఒకే సామాజిక కుల - వర్గాలకు సంబంధించిన వ్యక్తులు. పైన చెప్పినట్లుగా అభియోగాలు నిజాలయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.

వంచన ప్రక్షాళన స్వంత ఇంటి నుండి మొదలుపెట్టాలి లేదా, 'సమాజంలో అన్ని వర్గాల నేతల మంచి చెడ్డల గురించి ఆయా వర్గాల ప్రజలకు తెలుసుకునే హక్కు ఉన్నప్పుడు, దళిత బలహీనవర్గాల పాఠకులకు కూడా వారి నేతల గురించిన సానుకూల ప్రతికూల అంశాలను తెలుసుకునే హక్కు ఉన్నది' (ఆంధ్రజ్యోతి, 27 మే, 2008) అని ఆంధ్రజ్యోతి తన కథనాన్ని, తన చర్యను సమర్థించుకోవచ్చు. అయితే, ఏ ఆధారాలతోటి ఆ పత్రిక తన కథనాన్ని సమర్థించుకోగలదు? పైగా బడుగు బలహీనవర్గాల నేతలు బాడుగ నేతలుగా రూపాంతరం చెందుతున్నారని కచ్చితంగా చెప్పి ఆ నేతల పేర్లను ఎందుకు ప్రస్తావించలేదు? పేర్లు పేర్కొనక పోయినప్పటికీ కథనాన్ని బట్టి ఏ నేతల గురించి ఆంధ్రజ్యోతి చెబుతుందో పాఠకులందరికీ తెలుసు. అలా తెలుస్తుంది అన్న విషయం ఆ రాసిన వారికి తెలుసు. అలాంటప్పుడు ఈ దాగుడుమూతల దండాకోరులెందుకు? పైన పేర్కొన్న 'ఆర్తి' కోణం నుండి పరిశీలించినా లేదా నేతల మంచి చెడ్డలను ప్రజలకెరుక పరచవలసిన పత్రికల బాధ్యత కోణం నుండి పరిశీలించినా నేతల పేర్ల ప్రస్తావన లేకపోవడం కేవలం ఆ నేతలపై బురదజల్లడానికి, ప్రజలలో ఆ నేతలపట్లున్న విశ్వసనీయతను దెబ్బ దీయడానికే. ఒక్క మాటలో, భావప్రకటనా స్వేచ్ఛ అనే చెట్టు చాటున దాక్కొని అణచివేతకు గురికాబడిన ప్రజానేతలపై తమ కిష్టమైన రీతిలో అభియోగ బాణాలు సంధిస్తే అది ప్రజలకు వ్యతిరేకంగా చేసిన రామ రాజకీయ మవుతుందిగాని వారిపై అవ్యాజమైన అనురాగం, ఆర్తి ఎలా అవుతుంది?

మూడు, కథనంలోని 'భాను ప్రతాపం' అనే ఉప శీర్షికలో 'ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓ సాధారణ నాయకుడు రాజధాని - శివారు ప్రాంతాల్లో, రంగారెడ్డి జిల్లాలో వందల కోట్ల విలువైన భూమిని కబ్జా చేశాడు' అన్నది అభియోగం. అభియోగంలో రెండు అంశాలు ఉన్నాయి.

భూ కబ్జా, ప్రాంతీయత. కథనం అసాంతం అణచివేతకు గురైన కుల – వర్గాల నాయకత్వాన్ని దగాకోరులుగానూ, భూ కబ్జాకోరులుగానూ దుమ్మెత్తి పోస్తున్న క్రమంలోనే ఈ సాధారణ నాయకుడిపైన కూడా అభియోగాన్ని మోపడం చేసారు. కాబట్టి ఆ అభియోగంపై ప్రత్యేక దృష్టిని సారించవలసిన అవసరం లేదు. కాని ప్రాంతీయతను పేర్కొనడం వెనుక భావనవేరు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో భూ కబ్జా చేసిన వారిలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు చెందిన వారున్నారు. ఏ ప్రాంతానికి చెందినవారయినా భూ కబ్జాలు చేస్తున్న వ్యక్తులను, గ్యాంగ్‌లను ప్రాంతీయతకు అతీతంగా శిక్షించాలి – ఇందులో ఎటువంటి సందేహం లేదు. అయితే ఇక్కడ ఆంధ్ర ప్రాంతానికి చెందినవాడు అని ప్రత్యేకంగా చెప్పడంలో ఆశించిన ప్రయోజనం – ఆ నేత ప్రాంతీయతను చూపిస్తూ, స్థానికంగా అతనిపై ప్రాంతీయ ద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయం. భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డు చేసుకుని ప్రాంతీయ వైషమ్యాలను రెచ్చగొట్టే కార్యక్రమానికి పూనుకోవడం తప్పుకాదా?

## అగ్రకుల రాజకీయం

'సిద్ధాంత వైరుధ్యాలున్నప్పటికీ చంద్రబాబు, రాఘవులు, నారాయణ, జయప్రకాశ్ నారాయణ, విద్యాసాగర్‌రావు అందరూ ఒక్కటే అని కృష్ణమాదిగ (సాక్షి, 27 జూన్, 2008) చేసిన ఆరోపణలో అగ్రకులాలకు చెందిన నాయకులందరినీ ఒక గాటికి కట్టేయడం డొక్కశుద్ధిలేని వ్యవహారం. అయితే, అగ్రకులాలకు చెందినవారు కాబట్టే బాడుగ నేతలు కథనంలో దోదిక్యమయిన అగ్రకుల భావజాలాన్ని అవగాహన చేసుకోలేక పోయారనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. కథనంలోని అగ్రకుల భావజాలాన్ని రెండు అంశాల ద్వారా స్పష్టం చేయవచ్చు.

ఒకటి, కులవ్యవస్థ ఉత్పత్తికి, పునరుత్పత్తికి కీలకం. కొందరు వ్యక్తులకు ప్రవేశార్హత కల్పించడం, మరికొందరి వ్యక్తులకు ఆ ప్రవేశాన్ని నిషేధించడం. అక్షరానికి, ఆయుధానికి, ఆలయానికి కులం పేరుతో కొందరు వ్యక్తులకు ప్రవేశాన్ని ప్రసాదించిన వ్యవస్థ అదే పేరుతో ఎందరో వ్యక్తులకు ఆయా విషయాలలో ప్రవేశార్హత నిషేధించింది. ఈ కుల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమాలు నిర్వహించి రాజ్యాంగ బద్ధంగా అణచివేతకు గురైన వ్యక్తులకు ప్రవేశాన్ని ఒక హక్కుగా కల్పించుకున్నాం. ఇలా కల్పించుకున్న ప్రవేశార్హతలను భౌతికంగా అడ్డుకోవడం అసాధ్యమయిన అగ్రకులాలు కింది కులాల ప్రవేశాన్ని అడ్డుకోవడానికి ఆచరిస్తున్న పద్ధతి – అవమానించడం. ఈ పద్ధతిలో అణచివేతకు గురైన కుల-వర్గ ప్రజల సామాజిక స్థాయిని ప్రత్యక్షంగా, పరోక్షంగా పేర్కొంటూ అవమానానికి గురిచేసి వారి మానసిక ధైర్యాన్ని బలహీనపరచడం. మానసిక ధైర్యం కోల్పోయిన వారు వ్యక్తిగా, పౌరుడిగా, ఒక సమూహ, సమాజ సభ్యుడిగా తనకు జన్మతః రాజ్యాంగ బద్ధంగా లభించిన హక్కులను సాకారం చేసుకునే ధైర్యం కోల్పోతాడు. కథనంలో పేర్కొన్న ఒక అంశం ఆధారంగా నా పాయింట్ చెబుతాను.

భానుప్రతాపం ఉపశీర్షికలో బడుగు, బలహీనవర్గాల నేతలు స్టార్ హోటళ్లలో సమావేశాలు నిర్వహించారు అని చెప్పడం జరిగింది. ఇందులో మనం గమనించవలసిన విషయాలు రెండు – సమావేశం, స్టార్ హోటళ్లు. ఆ శీర్షికలో పేర్కొన్న వ్యక్తి, నేతకు 'రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల ఉద్యమాలకు నాయకత్వం వహించాలనే' ఒక కోర్కె ఉందని, ఆ కోర్కెను సాధించుకునే దిశగా మిగిలిన నేతలతో కలిసి సమావేశాలు నిర్వహించాడు అని చెప్పడంలో కోర్కె, ఆ కోర్కెను సాధించుకునే చర్యను రిపోర్ట్ చెయ్యడం. కాని 'స్టార్ హోటల్' అని ఒక ప్రత్యేక విశేషణాన్ని సమావేశానికి అనుసంధానం చేసి చెప్పడంలో కథన రచయిత అగ్రకుల అక్కసు, ఆ అక్కసుకు రంగు వేసి అది బడుగు, బలహీనవర్గాల వారిపై అవ్యాజమైన అనురాగం, అనురక్తి అనే పేర్లతో బడుగు, బలహీనవర్గాల వారికే అమ్మి సొమ్ము చేసుకునే అగ్రకుల నేర్పరితనం రెండూ తెలుస్తుంది.

గ్రామాలలోని అగ్రకులాలు నడిపే హోటళ్లు ముందు కండువాను నడుముకు చుట్టుకొని వారి కోసమే పక్కన పడేయబడ్డ గ్లాసుల్లో టీ, కాఫీలు తాగే ఈ అంటరానివారు ఇన్నేళ్లుగా అగ్రకులాలకే పరిమితమయిన స్టార్ హోటళ్లలోకి ప్రవేశించడమే గాక సమావేశాలు కూడా నిర్వహించుకునే స్థాయికి ఎదిగారనే ఒక అగ్రకుల అక్కసు వెళ్లగక్కడం ఆ స్టార్ హోటల్ విశేషణ ప్రయోగం ఒకటయితే, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రెక్కాడితే గాని డొక్కాడని ప్రజలు తమ పూరి గుడిసె కొప్పుల్లో బాహాటంగా ఉన్న బొక్కలలో నుండి అందరాని ఆకాశ ఎత్తులో మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాలను తడి చేరిన కళ్లతో లెక్కవేస్తుంటే, ఈ నేతలు మాత్రం ఆ ఆకాశ తారలనే తలదన్నే ఈ భూలోక హోర్మ్యాలలో సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పడం విశేషణ ప్రయోగం ద్వారా ఆశించిన రెండవ ప్రయోజనం. మొదటి అంశంలో తన అగ్రకుల అక్కసుతో స్టార్ హోటళ్లలో సమావేశాలు జరుపుకునేటంత వారయ్యారా అని ఆ నేతలను అవమానించే చర్యకు పూనుకోగా, రెండవ అంశంలో అణచివేతకు గురికాబడిన ప్రజలకు వారి నేతలకు మధ్య అఖాతాన్ని సృష్టించే చర్యకు పూనుకోవడం జరిగింది. కథనంలోని అంశాలను లోతుగా విశ్లేషించకుండా 'ఆ కథనం అక్షర సత్యం' అని కొందరు అణచివేతకు గురికాబడ్డ కుల – వర్గాల వారే వ్యాఖ్యానించారంటే అది ఆ ప్రజల మధ్య అఖాతాన్ని కల్పించడానికి అగ్రకుల కలం వేసిన పథకం పారబట్టే.

రెండు, అణచివేతకు గురికాబడిన కుల – వర్గాల నుండి ఎదిగిన నాయకులు వారి వారి కుల-వర్గాలకు బయట నాయకులుగా ఎదిగేందుకు వీలు లేకుండా అగ్రకుల రాజకీయ నాయకులు ప్రాతినిధ్య రూపంలో వారిని కుల-వర్గాల చెరసాలలో బందీలుగావించి తమ నాయకత్వ పరంపరను కొనసాగిస్తుంటే, చెరసాలలో బంధింపబడినవారు బయటపడకుండా తన రాతలతో, మాటలతో మీడియా పహారా కాస్తుంది. 'బాడుగ నేతలు' కథనంలోనే గాక మొత్తం మీడియా అణచివేతకు గురైన ప్రజా నేతలకిచ్చే ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఉదాహరణకు కృష్ణమాదిగ గురించో, కృష్ణయ్యల గురించో రాయవలసిన సందర్భంలో వాడే మాటలు 'మాదిగ నాయకుడు మందకృష్ణమాదిగ' 'బలహీనవర్గాల నాయకుడు కృష్ణయ్య'. ఈ నాయకులు ఆరంభంలో తమ కుల నాయకులుగానో, వర్గ నాయకులుగానో ప్రజా జీవితాన్ని ప్రారంభించిన మాట వాస్తవం. అయితే కొంత కాలంగా ఆ కుల-వర్గాల వారికోసమే గాక ఇతర కుల-వర్గ ప్రజా

*ఆంధ్రజ్యోతి - ఎం.ఆర్.పి.ఎస్. వివాదం మన సామాజిక, సాంస్కృతిక జీవనంపైన ఎన్నో ప్రశ్నలను లేవనెత్తిందని, వాటిపై సరైన చర్చ జరగలేదని అంటున్నారు* **ఎన్. వేణుగోపాల్**

# జవాబు కోరుతున్న ప్రశ్నలు

ఆంధ్రజ్యోతి దినపత్రికలో మే 26 న అచ్చయిన మొదటిపేజీ వార్తాకథనం ('బాడుగనేతలు') తో మొదలయిన ఆంధ్రజ్యోతి – ఎమ్మార్పీఎస్ వివాదం పత్రికల గురించీ ప్రజా ఉద్యమాల గురించీ సామాజిక అంశాల పట్ల మన వైఖరులగురించీ కూడ చాల లోతయిన ప్రశ్నలను లేవనెత్తింది. కాని కారణాలేమయినప్పటికీ తెలుగు ఆలోచనాపరులు ఆ ప్రశ్నలను నిజాయితీగా స్వీకరించి జరపవలసిన పద్ధతిలో అన్ని విషయాలమీద చర్చ జరిపినట్టులేదు. ఏవో ఒకటి రెండు అంశాలమీద మాత్రమే అది కూడ పైపైన మాత్రమే చర్చ జరిగింది. అంతకన్న ముఖ్యంగా వేరువేరు వర్గాలు వేరువేరు స్థాయిలలో తమ ఇష్టం వచ్చినట్టు మాట్లాడాయి, పనులు చేశాయి గాని ప్రస్తుత వివాదంలో తామందరమూ ఒకే అంశాన్ని చర్చిస్తున్నామనీ, కనుక ఒకే స్థాయిలో, ఒకే భాషలో చర్చించవలసి ఉంటుందనీ మరచిపోయాయి. అసలే ఆ సంక్లిష్టత ఉండగా ఈ వివాదంలోకి రాజ్యం చొరబడి మరింత గందరగోళానికి కారణమైంది. అందువల్ల కొన్ని కీలకమైన సామాజిక, సాంస్కృతిక అంశాలమీద విస్తృతమైన చర్చ జరపడానికి, కనీసం కొన్ని నిర్ధారణలు వెలికితీయడానికి వచ్చిన అవకాశాన్ని తెలుగునాట బుద్ధిజీవులు పోగుట్టుకున్నట్టు కనబడుతుంది.

మన సమాజంలో సరయిన చర్చావాతావరణం లేకపోవడం ఇందుకు కారణం. ఎవరిని ఏమంటే ఎవరికి కోపం వస్తుందో అనే వాతావరణం ఉన్నప్పుడు, మాట్లాడవలసిన, మాట్లాడదలచుకున్న విషయాలన్నీ మాట్లాడగలిగే పరిస్థితి లేనప్పుడు నిజమైన చర్చ జరగదు. మరీ ముఖ్యంగా ఆ వాతావరణంలో సున్నితమైన సామాజిక, సాంస్కృతిక, చారిత్రక అంశాలు ఇమిడి ఉన్నప్పుడు ఆ వాతావరణమే చర్చకు అడ్డంకి అయిపోతుంది. ఎప్పుడయినా ఒక నిజమైన, నిర్మొహమాటమైన చర్చ జరగాలన్నా, వివాదాస్పద అంశాల నిగ్గు తేలి వాస్తవాలు, హేతుబద్ధ వాదనలు బయటికి రావాలన్నా చర్చ జరిపేవాళ్లు భయపడే, సందేహపడే, ముద్రలు పడతాయని సంకోచించే, అరకొరగా మాట్లాడే వాతావరణం ఉండగూడదు. అప్పుడు చర్చ జరగదు, రచ్చ మాత్రమే జరుగుతుంది. జరగవలసింది సంపూర్ణమైన చర్చ గాని అసమగ్రమైన రచ్చ కాదు. రచ్చలో ఎవరికి వారు తమ అభిప్రాయాలనో దురభిప్రాయాలనో మరింత బలంగా చెప్పడం, అవతలివారిమీద బురద చల్లడం, ఎవరు ఏమంటున్నారో వినబడని రణగొణధ్వని మినహా జరిగేదేమీ ఉండదు. రచ్చ అనేది మౌలికంగా అప్రజాస్వామికమైనది. అసమానమైనది. విషయం మీద వస్తుగతంగా మాట్లాడడం కాకుండా ఆత్మస్తుతి, పరనింద ద్వారా గెలువదలచుకున్నది. రచ్చలో గెలిచేది వాదిబలమే గాని వాదబలం కాదు. చర్చ అనేది ప్రజాస్వామికమైనది. అవతలివారికి కూడ ఒక అభిప్రాయం ఉంటుందని, దానికి హేతువులూ రుజువులూ ఉన్నాలేకున్నా, అది ఎంత అసమంజసమైనదని అనుకున్నా అవతలివారికి ఆ అభిప్రాయాలు ఉంచుకునే హక్కు ఉంటుందని, మొదట అవతలివారిని తమతో సమానంగా, అవతలివారి అభిప్రాయాలను తమ అభిప్రాయాలతో సమానంగా గౌరవించవలసి ఉంటుందని చర్చ గుర్తిస్తుంది. ఆ అభిప్రాయాలను గుర్తించడానికి ఆ అభిప్రాయాలు కలిగి

---

సమస్యల పరిష్కారానికి కూడా నడుం బిగించిన మాట కూడా వాస్తవం. కృష్ణ మాదిగ విషయాన్నే తీసుకుంటే నక్సలైట్‌గా – ఒక వర్గ ప్రజల శ్రేయస్సుకు పోరాటం జరిపి, దండోరా నాయకుడిగా ఒక కుల ప్రజల అభ్యున్నతికి ఉద్యమాన్ని నడిపి, గుజరాత్‌లో హిందూత్వ నాయకత్వంలో ముస్లింలపై మారణహోం జరిగినప్పుడూ, తమగోడు పట్టించుకోని ప్రభుత్వాన్ని వికలాంగులు నిలదీసినప్పుడూ సాటి మనిషిగా స్పందించాడు. కుల – వర్గ, మతాతీతంగా బాధాతప్తులను తన అక్కున చేర్చుకునే మానవీయత కలిగిన నేతగా కృష్ణమాదిగను ప్రజా బాహుళ్యానికి మీడియా ఏనాడూ పరిచయం చెయ్యలేదు. కాని అతను మాదిగగా, ఆ కులసంఘనేతగా పేర్కొనడంలో మాత్రం ముందుంటుంది. ఇలా ముందుండటం తన చెరసాల పహారా విధులలో భాగం.

ఈ విషయాన్ని ఇంకొంత స్పష్టంగా చెప్పుకోవాలంటే, రెడ్ల కులానికి, కమ్మ కులానికి చెందినవారు కాకపోతే రాజశేఖరరెడ్డి అధికార పక్షనాయకుడిగా, చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఈ రోజున ప్రజా జీవితంలో నిలబడగలిగి ఉండేవారు కాదు అని భారతీయ కుల సమాజ కనీస అవగాహన ఉన్నవారెవరికీ ఎటువంటి సందేహం ఉండదు. ఈ నాయకుల గురించి చెప్పాల్సిన సందర్భంలో ఏనాడూ వారి కులాల గురించి మీడియా ప్రస్తావించక పోవడం అటుంచి, రాష్ట్ర నేతల నుండి, దక్షిణ భారతదేశ నేతలుగా మొత్తం భారతదేశ నేతలుగా చూపించడానికి కూడా ఎటువంటి తొట్రుపాటు పడదు. వారు కులనాయకులుగా కుంచించుకుపోవడం వెనుక వీరు ప్రజానేతలుగా రాజిల్లడం వెనుక బాడుగ తీసుకుని మీడియా నిర్వహిస్తున్న పహారాపాత్ర అర్థమవుతుంది. ◆

ఉండేవారి కులమూ మతమూ భాషా ప్రాంతమూ ఆస్తీ ఏమిటనే ప్రశ్న ఉన్నప్పటికీ, ఆ ప్రాతిపదికలకు ఎంత స్థానం ఇవ్వాలో అంత స్థానం ఇవ్వవచ్చు. కాని అవే ఏకైకమూ అంతిమమూ కానక్కరలేదు. అవతలి మనిషి అభిప్రాయాలను అంగీకరించకపోయినా గుర్తించి గౌరవించడం చర్చా సంప్రదాయపు ప్రజాస్వామిక పద్ధతి.

విచారకరమైన వాస్తవమేమంటే ఆంధ్రజ్యోతి –ఎమ్మార్పీఎస్ వివాదం మొదలయినప్పటినుంచీ ప్రజాస్వామికమైన చర్చా వాతావరణం లేదు, రచ్చ మాత్రం సాగింది, సాగుతోంది.

ఈరకంగా చర్చావాతావరణం లేకుండా చేయడం ద్వారా, చర్చ చేయాలంటే సంకోచించే, భయపడే వాతావరణం కల్పించడం ద్వారా తాత్కాలికంగా ఒక పక్షానికి ప్రయోజనం చేకూరవచ్చు. ఆ పక్షం గెలిచినట్టు, అవతలి పక్షం ఓడినట్టు కూడ అనిపించవచ్చు. అసలు ఆ రెండు పక్షాలూ ప్రత్యర్థి పక్షాలు కానప్పుడు, ఒకే శిబిరంలోని భిన్నాభిప్రాయాలయినప్పుడు, ఈ వైరుధ్యాన్ని వాడుకుని మూడో పక్షం తన పబ్బం గడుపుకోవచ్చు. కాని దీర్ఘకాలికంగా చూసినప్పుడు ఇటువంటి పరిణామం అసలు చర్చకే తావులేకుండా చేస్తుంది. ఇంక ఎప్పుడయినా ఎవరయినా చర్చించడానికి భయపడే స్థితి కల్పించడం ద్వారా అసలు సమాజంలోని ప్రజాస్వామిక సంప్రదాయాలకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది.

జరిగిన రచ్చలో రెండువైపులా చర్చించవలసిన అంశాలు ఎన్నో ఉండగా అటువైపుంటావా, ఇటువైపుంటావా అన్నపద్ధతిలో విభజన జరిగింది. మావైపు లేకపోతే వాళ్లవైపు ఉన్నట్టే అనే మొరటువైఖరి ఇరువైపులా కనబడినందువల్ల రెండుపక్షాలలోనూ కొంత సవ్యమైన వాదనా, కొంత అపసవ్యమైన వాదనా ఉన్నదని అనుకునేవాళ్లకు, ఒక సమ్యగ్ దృక్పథం అవసరమని అనుకునేవాళ్లకు చర్చాస్థలమే లేకుండా పోయింది.

అలాగే చర్చాస్థలం కుంచించుకుపోవడంలో, చర్చాపద్ధతి దిగజారడంలో మరికొన్ని అంశాలు కూడ ఉన్నాయి. మామూలుగానే తెలుగు సమాజంలో ప్రజలు ఒక ప్రశ్న వేస్తుంటే పాలకవర్గాలు మరొక జవాబు చెప్పడం చాలా కాలంగా అలవాటు చేసుకున్నాయి. ఉదాహరణకు విద్యార్థులు ఫీ పెంపుదలపై చేసే ఆందోళన నుంచి విప్లవోద్యమం దాకా లేవనెత్తుతున్న ప్రశ్నలు సామాజిక, ఆర్థిక, రాజకీయ పరమైనవి కాగా, పాలకులు వాటిని శాంతిభద్రతల సమస్యలుగా చూస్తున్నారు. ప్రస్తుత సందర్భంలో కూడ అవినీతి ఆరోపణలు, ఉద్యమాన్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలు, నిరసన ప్రదర్శనలు, ఆత్మగౌరవం, అత్యాచారం అనే భిన్న స్థాయిల ప్రశ్నలూ జవాబులూ ఒకదానితో ఒకటి సంబంధంలేకుండా వెలువడ్డాయి. అలాగే ఇటీవల ప్రచారసాధనాల రంగంలో వ్యాపారపోటీ తీవ్రతరమయినందువల్ల పెరిగిన సంచలనాత్మకత, గోరంతను కొండంతలు చేయడం, తమ మాటలను అవతలి వాళ్ల నోళ్లలో పెట్టడం, కలహభోజనం కూడ ప్రస్తుత వివాదంలో తమ వంతుపాత్ర పోషించాయి.

ఈ రచ్చలో మందకృష్ణ మాదిగ లేవనెత్తిన ఒక వాదన గురించి ముందుగా మాట్లాడుకోవాలి. ఆయన ప్రస్తుత వివాదంలో తనను, తన వైఖరిని సమర్థించుకోవడానికి, తనను వ్యతిరేకిస్తున్న వారందరినీ ఖండించడానికి ఆ వాదన ముందుకు తెచ్చి ఉంటారు గాని అది దీర్ఘకాలికంగా చూసినప్పుడు ఆయనకూ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న దళిత వర్గాలకూ మేలు కన్న కీడే ఎక్కువ చేస్తుంది. మేలు చేస్తుందా, కీడు చేస్తుందా అన్నదానికన్న ముఖ్యంగా, ఆ వాదన తాత్వికంగా ఓడించదలచుకున్న మనువాద భావజాలంలో భాగం అనేది గుర్తించవలసి ఉంది. మనువు మనుషులను పుట్టుకను బట్టి గుర్తించాడు. పుట్టుకను బట్టి కొందరికి ఏ అవకాశమూ ఉండగూడదని నిర్ధారించాడు. మనువాద భావజాలంలోని దుర్మార్గమైన అంశాలన్నిటిలోకి పరమ దుర్మార్గమైనది మనిషి ప్రవర్తనకు పుట్టుకే ఏకైక గీటురాయి అనడం. మనిషి పుట్టుకతో ఒక కులంలో పుడితే, ఇక అక్కడినుంచి మారడానికి వీలులేదని, ఆ కులధర్మానికి లొంగి ఉండవలసిందేననీ అనడం ద్వారా మనువు సామాజిక మార్పుకు, మనిషిలో మార్పుకు వీలు లేదనే నిలువనీటి సంస్కృతిని ప్రబోధించాడు, సిద్ధాంతీకరించాడు.

ఇవాళ మనువాద వ్యతిరేకులమని తమకు తాము చెప్పుకుంటున్న వాళ్లు చాల మంది మనువు చెప్పిన ఈ పుట్టుక ప్రాధాన్యతను, మనిషి మారడనే అవగాహనను యథాతథంగా అంగీకరిస్తున్నారు. ఫలానివాళ్లు ఫలాని కులంలో పుట్టారు గనుక వాళ్ల ప్రవర్తన ఇలా ఉంటుంది అని శిలాసదృశమైన సిద్ధాంతాలు చేస్తున్నారు. ఇది ఒకరకంగా మనువాదాన్ని తిరగేసి కొనసాగించడమే అవుతుంది గాని మనువును తిరస్కరించడం కాదు.

మన సమాజంలో కులం అతి ముఖ్యమైన సామాజిక ప్రమాణం అనే మాట నిజమే. కాని ఏ ఒక్కరూ తాము ఏ కులంలో పుట్టాలో నిర్ణయించుకుని పుట్టలేదు, అలా పుట్టడం సాధ్యం కాదు. ఒక అగ్రకులం అనబడే దానిలో పుట్టిన వాళ్లకు ఆస్తిలో, చదువులో, ఉద్యోగాలలో, అధికారంలో, వ్యక్తీకరణలో, సామాజిక స్థాయిలో, హోదాలో తమ పూర్వీకులనుంచి, సామాజికస్థితి నుంచి అందిన అదనపు సౌకర్యాలు ఉండవచ్చు. అందువల్ల అభిజాత్యం, ఆధిక్యతా భావం, పొగరు, ఆత్మవిశ్వాసం కూడా ఉండవచ్చు. అట్లాగే సామాజిక నిచ్చెనలో కింది కులాలనబడే వాటిలో పుట్టిన వాళ్లకు అసౌకర్యాలు అందకపోయి ఉండవచ్చు. ఆత్మన్యూనతాభావం కూడ ఉండవచ్చు. పుట్టుకవల్ల వచ్చిన ఆ స్థితిని సమర్థించడం తప్పు. దానిని వాడుకుని తమ హోదాను, అవకాశాలను బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నించడం తప్పు. ఆ భావజాలాన్ని నిలబెట్టడం తప్పు. అంతేగాని, ఆ కులంలో పుట్టడమే తప్పుకాదు. పుట్టుకనుబట్టి మనిషి అస్తిత్వాన్ని నిర్ణయించి, నిందించడమో, గౌరవించడమో మనువు చేశాడు. మనువును వ్యతిరేకించేవాళ్లు అలా చేయగూడదు. పుట్టుక వల్ల సమాజంలో వస్తున్న గౌరవాన్నీ అవమానాన్నీ గుర్తిస్తూనే, ఆ పుట్టుకకు ఉండగల అవకాశాన్ని అంగీకరిస్తూనే, ఆ మనిషి వ్యక్తిగతంగా ఏ ఆచరణలో ఉన్నాడో చూడాలి. ఆ మనిషి పుట్టుకవల్ల వచ్చిన అవకాశాల్ని తిరస్కరిస్తున్నాడో లేదో గుర్తించి దాన్ని బట్టి మనిషిని అంచనా వేయడం జరగాలి. ఒక మనిషి స్థానం ఏమిటో నిర్ధారించేటప్పుడు పుట్టుకనూ, పెంపకాన్నీ, సామాజిక సంబంధాలనూ విస్మరించకుండానే, ఆ మనిషి ఆలోచనలనూ, ఆచరణనూ, ప్రాతినిధ్యం వహించే విలువలనూ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. పుట్టుక ప్రాధాన్యతను ఎవరూ తగ్గించలేరుగాని పుట్టుకే ఏకైకమని అనడం

మనువాదమే. పుట్టుకకు ఇవ్వవలసిన స్థానాన్ని ఇస్తూనే, చైతన్యం, ఆలోచనలు, ఆచరణ, విలువలు, చరిత్రలను కూడ పరిగణనలోకి తీసుకోవాలి.

ఆవిధంగా చూసినప్పుడు తాను పుట్టిన కులానికి, వర్గానికి, మతానికి, లింగానికి, ప్రాంతానికి, భాషకు భిన్నమైన ఆలోచనలు, ఆచరణలు, విలువలు ఉన్న మనుషులు మనచుట్టూ ఎంతోమంది ఉన్నారు. వారి పుట్టుకతో ఉండగల అవలక్షణాలను వదుల్చుకొమ్మని వారిని నిరంతరం హెచ్చరిస్తూనే ఉండాలి. ఎప్పుడైనా అటువంటి అవలక్షణాలు పొడసూపితే వాటిని ఖండిస్తూనే ఉండాలి. కాని వారి ఆచరణను బట్టి, విలువలను బట్టి వారిని అంచనా వేయవలసిఉంటుంది. వారి ఆచరణతో, విలువలతో సంబంధంలేకుండా, "ఫలానికులంలో పుట్టినవాళ్లందరూ చెడ్డవాళ్లు, ఫలాని కాలంలో పుట్టిన వాళ్లందరూ మంచివాళ్లు" అని అంత సులభంగా నిర్ధారించేట్టయితే, అది మనువును పునరుద్ధరించడమే అవుతుంది.

ఇక ఈ గందరగోళంలో అసలు ఈ వివాదానికంతకూ మూలకారణమైన ఆంధ్రజ్యోతి వార్తాకథనపు నిజానిజాల మీద చర్చ మాయమైపోయింది. ఆ కథనంలో వాడిన కొన్ని పదాలు అభ్యంతరకరంగానో, ఆయా సామాజిక ఉద్యమాల నాయకులకు మనస్తాపం కలిగించేవిగానో ఉండవచ్చు. ఉన్నాయి కూడ. కాని ముఖ్యమైనది ఆ కథనంలోని వస్తువు. ఆ కథనం బడుగువర్గాల పేరు చెప్పుకుని తమ స్వార్థప్రయోజనాలు చూసుకుంటున్న కొందరు నాయకుల గురించి మాట్లాడింది. ఆ నాయకుల తప్పుడు ప్రవర్తన గురించి మాట్లాడింది. సామాజిక జీవితంలో ఉన్నవారికెవరికైనా వారి ఆచరణ గురించి సమాజం వేసే ప్రశ్నలు తప్పవు. నిజానికి ఆ నాయకుల గురించీ, వారి అభ్యంతరకరమైన ప్రవర్తన గురించీ ఆయా సంస్థలలో పనిచేసి బయటికి వచ్చిన నాయకులూ కార్యకర్తలూ ఇంతకన్న ఘోరమైన ఆరోపణలు చేశారు. ఇంతకన్న తీవ్రమైన భాష వాడారు. బైటికి వచ్చాక చేశారు కాబట్టి ఆ ఆరోపణల్లో అన్నిటికన్నీ నిజాలు కాకపోయినా, కనీసం కొన్ని అయినా నిజాలే. ఆ కథనంలోని అవినీతి ఆరోపణలను రుజువు చేయడం కష్టం కావచ్చు గాని కొందరు నాయకులు పాలకవర్గాలకూ, పాలకపక్షాలకూ కొమ్ము కాస్తున్నారనేది అందరికీ తెలిసిన విషయమే.

ఆ కథనంలోని ఆరోపణలన్నీ నిజమే అయినా అవి ప్రస్తుత సందర్భంలో బయటపెట్టడంలో ఆంధ్రజ్యోతికి స్వార్థ ప్రయోజనాలు ఉండవచ్చు. వాటిని బయటపెట్టే అర్హత ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి లేకపోవచ్చు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం అనేక అక్రమాలకు పాల్పడి ఉండవచ్చు. ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ కోట్లు ఎలా సంపాదించాడని లక్ష్మీపార్వతి వేసిన ప్రశ్నలు ఇంకా అందరికీ గుర్తున్నాయి. ఆంధ్రజ్యోతికి చంద్రబాబునాయుడుతో ఉన్న మైత్రి, రాజశేఖరరెడ్డితో ఉన్న వైరం అందరికీ తెలిసినవే. అయినా ఆ పత్రికలో వచ్చిన ఒక వార్తను ఖండించడానికి ఆ వార్తాంశాలను ఖండించవలసి ఉంటుంది గాని ఈ ప్రత్యారోపణలు చేస్తే సరిపోదు.

ఎమ్మార్పీఎస్ నాయకులు గాని ఇతర సామాజిక ఉద్యమాల నాయకులు గాని తమ మీద వచ్చిన ఆరోపణలకు, అవి నిజాలయినా అబద్ధాలయినా, సకారణంగా జవాబు చెప్పుకోవలసి ఉంటుంది గాని దాడికి దిగడం జవాబు కాదు. అవతలివాళ్లు ఒక అభిప్రాయం/ ఆరోపణ/ నింద ప్రకటించినప్పుడు దానికి జవాబు చెప్పి ఆ తర్వాత వాళ్లు అది లేవనెత్తడం వెనుక ఉద్దేశ్యాన్ని ప్రశ్నించాలి గాని, అవతలి వాళ్ల దురుద్దేశ్యాన్ని విప్పి చెప్పడమే ఆరోపణకు జవాబు కాదు. లేదా అగ్రవర్ణాల వారు అవినీతిపరులు కాదా అనో, వారు మూడువేలఏళ్లపాటు చేసిన అవినీతిని మేం ఇప్పుడు చేస్తే ప్రశ్నించడమా అనో అనడం ప్రజాస్వామిక చర్చా సంప్రదాయం అయితే కాదు. అది కూడ ఒకరకంగా మనువును తిరగేసి మాట్లాడడమే అవుతుంది.

ప్రజాస్వామిక చర్చా సంప్రదాయం లేకపోతే పోయింది, రాసిన వారిమీద భౌతిక దాడికి దిగడం ఉక్రోషాన్ని తప్ప మరేమీ సూచించడం లేదు. భౌతిక దాడి జరిగేటప్పుడు, అది కూడ ఒక సమూహం పాల్గొనేటప్పుడు క్రమశిక్షణా యుతంగా లక్ష్యం మీద మాత్రమే ఎక్కుపెట్టే చర్యలు జరుగుతాయని ఊహించలేము. అందువల్లనే ఆ దాడి పత్రికా కార్యాలయం మీద పెట్రోలు సీసాలు విసరడంగా, అగ్గిపుల్ల గీసి విసరడంగా పరిణమించింది. ఆ వార్తాకథన రచనతో గాని, మనోభావాలను గాయపరచడంతోగాని ఎటువంటి సంబంధమూలేని ఒక ఉద్యోగి మీద దాడి జరిగింది. ఆ దాడి ఒకవేళ తాత్కాలిక ఆవేశంలో ఉద్రేకంలో జరిగిందే అనుకున్నా, దాన్ని సమర్థించడం ద్వారా, మళ్లీ మళ్లీ దాడి చేస్తామని కూడ ప్రకటించడం ద్వారా మందకృష్ణ మాదిగ చాల దీర్ఘకాలిక ప్రభావం వేయగల తప్పుడు సంప్రదాయానికి తెరతీశారు. 'మాకు నచ్చని రాతలు రాస్తే పత్రికా కార్యాలయం మీద దాడి చేస్తాం, పెట్రోలు పోసి తగులబెడతాం, అలా దాడి చేయడానికీ, తగులబెట్టడానికీ మాకు హక్కుంది, అది సరయినదే' అని ఈ సారి కృష్ణ అనవచ్చు, రేపు మరొకరు అనవచ్చు. ఇది కొనసాగితే ఇక పత్రికలు ఏమి రాసినా భౌతిక దాడుల రూపంలో ప్రతిస్పందనలను ఒప్పుకోవలసి ఉంటుంది. ఎందుకంటే రాసిన ప్రతి వార్తా, ప్రతి కథనమూ, ప్రతి వాస్తవ నివేదికా ఎవరో ఒకరికి నచ్చకుండానే ఉంటుంది. ముఖ్యంగా పాలకవర్గాలకు కంటగింపుగానే ఉంటుంది.

అసలు ఇవాళ తెలుగు పత్రికలేవో అన్నీ వాస్తవాలే రాస్తున్నాయని కాదు. ప్రస్తుతం తెలుగు పత్రికాప్రపంచం చాల అన్యాయమైన స్థితిలో ఉంది. ఘోరమైన విలువల పతనం జరుగుతోంది. పత్రికలు వ్యాపార, రాజకీయ ప్రయోజనాలకు వేదికలుగా మారిపోయాయి. బహిరంగంగా ఏదో ఒక పాలకపక్ష ముఠాకు కొమ్ము కాస్తున్నాయి. దాదాపు దినపత్రికలన్నిటి యాజమాన్యం అగ్రవర్ణాలలో పుట్టినవారి చేతుల్లో ఉండడం మాత్రమే కాదు, అగ్రవర్ణ భావజాలాన్ని సమర్థించే వారి చేతుల్లో కూడ ఉంది. అయినా ప్రజలందరికీ, సమాజానికీ ఉండే భావప్రకటనాస్వేచ్ఛలో భాగంగా కొనసాగేది పత్రికాస్వేచ్ఛ. అది ఇవాళ యజమానుల స్వేచ్ఛగా దుర్వినియోగం అవుతూ ఉండవచ్చు. యజమానుల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల బరువుకింద ఊపిరికోల్పోతుండవచ్చు. కాని ఒక ప్రజాస్వామిక విలువగా పత్రికాస్వేచ్ఛను కాపాడుకోవడం ప్రజల భావప్రకటనాస్వేచ్ఛను పరిరక్షించుకోవడంలో భాగమవుతుంది. భావప్రకటనాస్వేచ్ఛ లేకపోతే ప్రజలు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకునే అవకాశాన్ని కూడ కోల్పోతారు, మంచిబతుకుకోసం అన్వేషించే, పోరాడే హక్కును కూడ కోల్పోతారు. దళితుల, అణగారినవర్గాల ఆక్రోశాన్ని, ఆరాటాన్ని,

పోరాటాన్ని సమాజం గుర్తించాలంటే అది నిర్నిబంధమైన భావప్రకటనాస్వేచ్ఛ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఆ భావప్రకటనా స్వేచ్ఛ మీద పాలకవర్గాలు, అగ్రవర్ణాలు, మనువాద భావజాలం విధించిన సంకెళ్లను బద్దలుకొట్టి, భావప్రకటనాస్వేచ్ఛను విస్తరించడం కూడ పీడితుల కర్తవ్యమే. భావప్రకటనాస్వేచ్ఛను విస్తరించడమంటే దానిలో ఒక చిన్న భాగమైన పత్రికాస్వేచ్ఛను లేకుండాచేయడం కాదు. పత్రికా కార్యాలయం మీద దాడిచేయడం, పాత్రికేయులను భయపెట్టడం, కాదు.

ఆంధ్రజ్యోతి కార్యాలయం మీద దాడికి ప్రతిస్పందనగా పాత్రికేయులు తీసిన ఊరేగింపులో మందకృష్ణ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టడం, తగులబెట్టడం తీవ్రమైన తప్పులే. తమ మీద దాడి చేసిన వారికి వ్యతిరేకంగా ఊరేగింపులు తీయడం, వారికి వ్యతిరేకంగా నినాదాలు ఇవ్వడం, వారి దిష్టిబొమ్మలు తగులబెట్టడం నిరసన రూపాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. తమ నిరసనను ప్రకటించే సమయంలో అగ్రవర్ణాలవారయినా, దళిత, వెనుకబడిన వర్గాల వారయినా ఆ నిరసనరూపాలను వాడుకుంటూనే ఉన్నారు. అలాగే సామూహిక దాడి జరిగినప్పుడు అనుకోని పరిణామాలు సంభవిస్తాయనేది ఆంధ్రజ్యోతి మీద దాడికి ఎంత వర్తిస్తుందో, పాత్రికేయుల ఊరేగింపుకు కూడ అంతగానే వర్తిస్తుంది. అయినా పాత్రికేయులు ఒక సామాజిక ఉద్యమనేత విషయంలో మాట తూలకుండా ఉండడానికి, అవమానం చేయకుండా ఉండడానికి, తమ నిరసనను ప్రజాస్వామికంగా వ్యక్తీకరించడానికి ప్రయత్నించవలసి ఉండింది.

ఆ ఊరేగింపులో జరిగిన విచారకరమైన పరిణామాలను ఆసరాగా తీసుకుని ఆంధ్రజ్యోతి మీద కక్ష తీర్చుకునే అవకాశం వచ్చిందని రాజ్యం భావించింది. మూడు నాలుగు సంవత్సరాలుగా పాలకవర్గ ముఠాల కుమ్ములాటలలో భాగంగా పాలకపక్షానికీ ఆంధ్రజ్యోతి పత్రికకూ రగులుతున్న వివాదం ఇప్పుడు రాజ్యాంగ యంత్రానికి కలిసి వచ్చింది. రోజురోజుకూ వేడెక్కిన పరిణామాలలో ఇటు పత్రికారచయితలు, అటు సామాజిక ఉద్యమాల నాయకులు తమ మధ్య ఉండవలసిన మైత్రిని, సుహృద్భావాన్ని మరిచిపోయి కయ్యానికి కాలుదువ్వారు. పత్రికా రంగాన్ని, సామాజిక ఉద్యమాలన్నా కంటగింపుగా భావించే పాలకపక్షాలు ఈ కయ్యాన్ని తమ ప్రయోజనాలకు వినియోగించుకోగలిగాయి.

ప్రతిరోజు ప్రతి గ్రామంలోనూ ప్రతి పట్టణంలోనూ దళితులమీద, ఆదివాసులమీద జరుగుతున్న అత్యాచారాల మీద కేసులు కూడ నమోదు చేయకుండా ఉంటున్న రాజ్యం, వాకపల్లి వంటి సుప్రసిద్ధ అత్యాచారాల విషయంలో కూడ మసిపూసి మారేడుకాయ చేయడానికి ప్రయత్నించిన రాజ్యం పాత్రికేయులను భయపెట్టే, ఆంధ్రజ్యోతి మీద కక్ష తీర్చుకునే అవకాశం రాగానే ఎగిరి గంతు వేసింది. బతికిఉన్న మనుషులకు అవమానాలు జరుగుతుంటే, వారిమీద అత్యాచారాలు జరుగుతుంటే, సజీవదహనాలు జరుగుతుంటే, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల నిరోధక చట్టంలో నమోదు చేసిన ప్రతి ఒక్క నేరమూ ఎక్కడ పడితే అక్కడ జరుగుతుంటే మౌనంగా ఉంటున్న, నేరస్తులకు సహకరిస్తున్న రాజ్యం దిష్టిబొమ్మను అవమానించిన ఈ కేసులో మాత్రం పద్ధతి ప్రకారం పనిచేసింది. ఒక సంపాదకుడిని, ఇద్దరు విలేకరులను అరెస్ట్ చేసింది. అప్పటికే ఆంధ్రజ్యోతి మీద దాడికేసులో అరెస్టయి జైల్లో ఉన్న నిందితులను విడుదల చేయడానికి ఆలస్యం చేసింది. అసలు ఎస్ సి ఎస్ టి అత్యాచారాల నిరోధక చట్టం ఈ విధంగా దుర్వినియోగం అవుతున్నదని, అందువల్ల అసలు దాన్ని రద్దుచేయాలని పాలకవర్గ ప్రతినిధులు సన్నాయి నొక్కులు నొక్కడం ప్రారంభించారు. అంటే నిజంగా సహకరించుకోవలసిన రెండు పక్షాలు ఒక అనవసర వివాదంలో చిక్కుకుని ఎదురుబొదురుగా నిలుచుని ఉండగా రెండుపక్షాలమీద రాజ్యం తన కక్ష తీర్చుకుంది. ఇటువంటి విచారకరమైన మజిలీకి చేరి ఉండే బదులు, సవ్యమైన, ప్రజాస్వామిక దృక్పథంతో కూడిన చర్చ జరిగి ఉంటే ఈ వివాదంలో ఈ కింది ప్రశ్నల మీద సమాజానికి మరింత ఎక్కువ అవగాహన, చైతన్యం కలిగి ఉండేవి.

1. ఆంధ్రజ్యోతి కథనంలో నిజానిజాలేమిటి?
2. ఆ కథనం ప్రచురించడం వెనుక ఆంధ్రజ్యోతి ఉద్దేశ్యాలేమిటి?
3. బాడుగనేతలు అని సామాజిక ఉద్యమాల నేతలను విమర్శించే అర్హత ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి ఉందా?
4. ఆ కథనం తమను నొప్పించినప్పటికీ సామాజిక ఉద్యమాల నాయకులు పత్రిక మీద దాడి చేయడం సమంజసమేనా?
5. ఆంధ్రజ్యోతి మీద ఎమ్మార్పీఎస్ దాడి పత్రికాస్వేచ్ఛ మీద దాడి అవుతుందా, కాదా?
6. పత్రికాస్వేచ్ఛ అంటే పత్రిక యజమాని స్వేచ్ఛనా, సంపాదకవర్గపు స్వేచ్ఛనా, ప్రజల భావప్రకటనా స్వేచ్ఛకు ఒక వ్యక్తీకరణా?
7. దళితులమీద, అణగారిన వర్గాల మీద కొనసాగుతున్న అత్యాచారాల, అవమానాల నేపథ్యంలో పాత్రికేయుల నిరసన మరింత జాగ్రత్తగా ఉండవలసింది కాదా?
8. ఒక పత్రికకూ ఒక సామాజిక ఉద్యమ నాయకుడికీ మధ్య మొదలయిన వివాదం పాత్రికేయులకూ, సామాజిక ఉద్యమాలకూ మధ్య జరుగుతున్నదిగా చూపబడి చివరికి రాజ్యానికి ఎట్లా ఉపయోగపడింది?
9. ఒక పత్రిక మీద కక్ష తీర్చుకోదలచుకున్న పాలకపక్షం ఈ ఉదంతాన్ని మొత్తం పాత్రికేయలోకాన్ని భయపెట్టడానికి ఎట్లా వాడుకున్నది? ◆

**వచ్చే సంచికలో...**

- **ఫోకస్ - సెప్టెంబర్ 2008 : మారుతున్న హైదరాబాద్**
- **నాడు నేడు పరాధీన భారతం - వి. హనుమంతరావు (తరిమెల నాగిరెడ్డి స్మారకోపన్యాసం)**
- **పోలీస్ వ్యవస్థ సంస్కరణలు - పటోళ్ల గోవర్ధన్ రెడ్డి**
- **కొత్త ఖనిజ విధానం - ఎం. నాగరత్నం**
- **తెలుగు భాష సంస్కృతి, సంప్రదాయాలు - కె. పుణ్యవతి**

*పార్టీల బలాబలాలను, స్థితిగతుల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లోని సంక్లిష్టతను వివరిస్తున్నారు*

**వి. హనుమంతరావు**

# మారుతున్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ ఆటలిక సాగవని గ్రహించి దేశ పాలనను స్వాతంత్ర్య పోరాటానికి సారథ్యం వహించిన బూర్జువా పార్టీ అయిన కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పగించి నిష్క్రమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలను మినహాయిస్తే మిగతా అన్ని రాష్ట్రాల్లో, కేంద్రంలో వివిధ పార్టీలు అధికారంలోకి వచ్చినా, అదే బూర్జువా వర్గమే పరిపాలన కొనసాగిస్తూ వచ్చింది. ఏ వర్గం అధికారంలో ఉంటుందో, ఆ వర్గం తన వర్గ ప్రయోజనాలను రక్షించుకొంటూ వస్తుందనటానికి రాజకీయ పాండిత్యమేమీ అవసరంలేదు. ఆనాడు కాంగ్రెస్‌ను కాదని తెలుగుదేశాన్ని, ఇంకా పార్టీ పుట్టకుండానే పత్రికలు చిరంజీవి పల్లకీని మోస్తూ ఆయనే కాబోయే ముఖ్యమంత్రి అన్నట్లు ప్రచారం చేస్తున్నాయి. ఆయనే ముఖ్యమంత్రి అయినా, పాలించిన, పాలించబోయే పార్టీలన్నీ బూర్జువా పార్టీలే అన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. చిరంజీవి గెలిచినా, రాజశేఖరుడు మళ్లీ ఎంపికైనా వారి వర్గ ప్రయోజనాలనే కాపాడు కొంటారు తప్ప, సామాన్యుల జీవితాలు మార్చలేరనేది తెలుగుదేశం దశాబ్దంన్నర కాలం పరిపాలించి ఆచరణలో రుజువు చేసింది. ఇక ముందు అలా జరగబోదని చిరంజీవి అభిమానులంటున్నారు.

చిరంజీవికి రాజకీయానుభవం లేదు. పరిపాలనానుభవం అసలే లేదు. అటువంటి వ్యక్తి దేశాన్ని, రాష్ట్రాన్ని, ప్రజల్ని ఎలా ఉద్ధరిస్తాడన్న విమర్శకు 'ఏం, ఎన్.టి.ఆర్. ఏ అనుభవం లేకుండానే అధికారంలోకి రాలేదా?' అనే జవాబు చిరంజీవి అభిమానులంటూంటే, అప్పటి పరిస్థితి వేరు, ఆనాటి నేపథ్యం ఈనాడు లేదని ఎదురు జవాబు వస్తోంది. కాగా ఆనాటి నేపథ్యం ఏమిటి అనే ప్రశ్న ఎదురవుతుంది. ఆనాటి నేపథ్యాన్ని ముందు నెమరువేసుకొంటే, రేపేమవుతుందో అంచనా వేయొచ్చు. ఆనాడు 'ఆంధ్రప్రదేశ్ దర్శిని' (విశాలాంధ్ర ప్రచురణాలయం) అప్పటి పరిస్థితుల గురించి చేసిన విశ్లేషణను కాస్త సుదీర్ఘంగానే ఇక్కడ ఉదహరిస్తా. ఆ తర్వాత మన విశ్లేషణ మనం చేసుకొందాం.

'అవినీతిని అత్యున్నత స్థాయికి తెచ్చిన చెన్నారెడ్డి పాలన, పరిపాలనా దక్షత లేని అంజయ్య, నాయకత్వ లక్షణం లోపించిన భవనం వెంకట్రామ్ ముఖ్యమంత్రులుగా ఇందిరా కాంగ్రెస్ ప్రతిష్ఠను అట్టడుగు స్థాయికి దిగజార్చారు. కాంగ్రెస్ నాయకుల అధికార వ్యామోహం, పదవీకాంక్షలు, నీతిబాహ్యమైన పద్ధతిలో పయనించడంతో కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు పెచ్చుపెరిగి విచ్ఛిన్న దశకు ఆ పార్టీ చేరుకుంది. కోన ప్రభాకరరావు, జనార్ధనరెడ్డి, నాదెండ్ల భాస్కరరావుల మధ్య తీవ్రమైన నాయకత్వ పోటీ, అధికారంలోకి వచ్చిన ఏ ముఖ్యమంత్రినీ ఎక్కువ కాలం కొనసాగనీయకుండా చేశాయి. 1982 నాటికి రాష్ట్రంలో విలయ తాండవం చేస్తున్న క్షామ పరిస్థితుల నివారణకై ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టలేకపోయింది. ప్రభుత్వ పాలన పూర్తిగా స్తంభించి పోయింది. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా కుంటుపడ్డాయి. రాష్ట్ర ప్రజలు పూర్తిగా వేసారి మరో ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారు. కేవలం నాలుగు సంవత్సరాల కాలంలో నలుగురు ముఖ్యమంత్రులను మార్చడం జరిగింది. ఇదే సమయంలో రాజీవ్ గాంధీ హైదరాబాద్ వచ్చినప్పుడు విమానాశ్రయంలో అప్పటి ముఖ్యమంత్రి అంజయ్యను నవ్వుల పాలు చేసే ప్రవర్తనను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఏవగించుకున్నారు.

అప్పుడే రాజకీయరంగంలోకి అడుగిడుతున్న ఎన్.టి. రామారావు ఈ ప్రవర్తనను అవకాశంగా తీసుకొని 'ఆంధ్రుల ఆత్మగౌరవం' నినాదంతో ప్రజలను ఆకట్టుకొన్నారు. అప్పటి వరకూ ఆంధ్ర ప్రజలకు దేశంలో, దేశ రాజకీయాల్లో గుర్తింపు లేదు. వారికి దక్షిణాది వారిగానే గుర్తింపు ఉండింది. ఈ గుర్తింపు లేకపోవడాన్ని కూడా ఎన్.టి.ఆర్. ఒక అస్త్రంగా మలుచుకొని ప్రచారానికి పూనుకున్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పరిపాలన తీరుపట్ల అసంతృప్తి ఉండనే ఉంది. సినిమాల్లో నటనలో నేర్చుకొన్న, అబ్బిన వాగ్ధాటి తోడ్పడింది. పురాణాల్లోని అవతార పురుషులందరి పాత్రలను అమోఘంగా, అవలీలగా నటించి గ్రామీణ ప్రజల్లో తానే ఓ అవతార పురుషుడిగా ముద్ర వేసుకోవడంతో గ్రామీణ ప్రజల్లో, ముఖ్యంగా మహిళలలో పాపులారిటీ సంపాదించుకొని ఉండడంతో ఆయన ఎన్నికల ప్రచారం చాలా సులువైంది. వీటన్నిటినీ మించి రెండు రూపాయల కిలో బియ్యం వాగ్దానం సామాన్యులను, ముఖ్యంగా పేద ప్రజానికాన్ని అశేషంగా ఆకర్షించింది. వానల కోసం ఎదురు చూస్తున్న భూమి తల్లి మీద వాన చినుకులు పడటంతో రైతాంగంలో ఆనందం ఎలా కట్టలు తెంచు కుంటుందో, పేదప్రజలు అంత ఆనందపడి పోయారు. అప్పటి వరకూ పేద రైతుల ఇళ్లకు అల్లుళ్లు వచ్చినప్పుడే బియ్యం అన్నం వండే పరిస్థితి ఉండేది. రెండు రూపాయలకు కిలో బియ్యం అనేసరికి వారందరికీ నోరూరింది. ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్న రాష్ట్ర ప్రజానీకం ఎన్.టి.ఆర్.ను రెండు చేతుల్తో ఆహ్వానించింది.

ఆయన ఎన్నికల ప్రచార సందర్భంలో నేను గుడివాడలో ఉండడం, అదే రోజున రామారావు బహిరంగసభ జరగడం, ప్రజా

స్పందనను చూసే అవకాశం నాకు కలిగింది. ఆయన వస్తానన్న సమయానికి అయిదు గంటలు ఆలస్యంగా వచ్చినా జనం కదల్లేదు, మెదల్లేదు. వారంతా రాజకీయంగా స్పందించి రాలేదు. రామారావును కళ్లారా చూద్దామని మాత్రమే. ఆయన ఉపన్యాసం విన్న తరవాత వారెదురు చూస్తున్న ప్రత్యామ్నాయం వారి మనసులో రూపుదిద్దుకొంది. ఆయనకనూలంగా ఓట్ల పెట్టెలు నిండిపోయాయి. ఆయన గెల్చుకొన్న సీట్లు (202), కాంగ్రెస్ చరిత్రలో (ఒక్క 1972 ఎన్నికల్లో తప్ప) ఎపుడూ అన్ని సీట్లు గెల్చుకోలేదు.

ఇక్కడ ఒక పరిణామాన్ని గమనంలో ఉంచుకోవాలి. 1983లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చేవరకూ జరిగిన రాష్ట్ర అభివృద్ధి అప్రతిహతంగా సాగింది. నాగార్జునసాగర్, పోచంపాడు (శ్రీరాం సాగర్) లాంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమలు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులకు ప్రణాళికకు యాభై శాతం నిధుల కేటాయింపు, సస్య విప్లవం, ఎన్ని లోటుపాట్లున్నా భూ సంస్కరణల అమలు, రవాణా సౌకర్యాల విస్తరణ, అయిదారు సంవత్సరాల్లో తప్ప మిగతా అన్ని సంవత్సరాల్లో మిగులు బడ్జెట్లు – 1983 ఎన్నికల వరకూ జరిగిన కాంగ్రెస్ పాలనలో ఇవి కొన్ని మైలురాళ్లు. మరి ఇంత అభివృద్ధి జరిగితే కాంగ్రెస్ ఎందుకు చిత్తుగా ఓడిపోయింది? అభివృద్ధి జరిగింది కాని దాని ఫలితాలు ప్రజలకు అందాల్సిన మేరకు అందలేదు. 20 సూత్రాల పథకం ఇందిరాగాంధీ ఓడిపోవడంతో మూలపడింది. ఈ పరిణామాలకు పైన పేర్కొన్న పరిణామాలు తోడై ఆ పార్టీ ఓటమికి దారితీసాయి.

అటువంటి నేపథ్యం ఈ రోజున ఏ పార్టీకైనా ఉందా? అభివృద్ధి కార్యక్రమాలు ఎంత బాగా అమలు పరచినా ఎన్నికల్లో ఓట్ల సంపాదనకు దారితీయవని కాంగ్రెస్ పార్టీ గ్రహించాలి. వాటి ఫలితాలు ప్రజలకు అందకపోతే అంతే సంగతులు. పరిపాలనా వ్యవస్థ అప్పటికన్నా ఇప్పుడు మరింత అసమర్థత, అవినీతికి ఆలవాలమైంది. తెలుగుదేశం చేసిన ప్రతి అవినీతి ఆరోపణా నిజమని నమ్మలేం. అన్నీ అబద్ధాలని కొట్టివేయలేం. అనేక వర్గాల ప్రజలు, చేతివృత్తుల వారు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతాంగం, నిరుద్యోగులు వారి తీవ్ర అసంతృప్తిని ప్రదర్శనలు, నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, ప్రభుత్వ కార్యాలయాల మీద దాడుల ద్వారా వెలిబుచ్చుతున్నారు. ఈ అసంతృప్తి ఓట్ల రూపం దాలిస్తే కాంగ్రెస్ అధికార పీఠం నుంచి దబ్బున కింద పడిపోవాలి. పడిపోతుందా?

ఎవరి కళ్లద్దాల్లోంచి వారు చూస్తే అనేక జవాబులొస్తాయి. కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లు అనేక పార్టీల మధ్య చీలిపోతే, కాంగ్రెస్ ఓటు తగ్గినా, అధికారంలోకి రావడం అనేది ఒక వ్యాఖ్య. ఓటర్లను ఆకట్టుకోవడానికి అదిస్తాం, ఇదిచేస్తాం అని వాగ్దానాలు చేయడం మామూలే. కాని ఈసారి ఎపుడూ కనివిని ఎరుగని రీతిలో వాగ్దానాల పర్వం కొనసాగుతోంది. ప్రధానంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, నిద్రలో కూడా ముఖ్యమంత్రి నవుతానని కలలు కంటున్న చంద్రబాబు వరాలు, వాగ్దానాలు చేస్తున్నారు. అయితే ఒక ముఖ్యమైన తేడా ఏమంటే అధికారంలో ఉంది కాబట్టి కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు అమలుపరచడం ప్రారంభించేసింది. (ఉదాహరణకు రెండు రూపాయల కిలో బియ్యం వగైరా) చంద్రబాబు వాగ్దానాలు మరింత ఆకర్షణీయంగా ఉన్నాయి, కాని అధికారంలోకి వస్తే గిస్తే అనే పరిస్థితి ఉంది. ఆయన అధికారంలో ఉన్నన్నాళ్లు ఎపుడూ చేయని పనులు ఇపుడు చేస్తానని అంటూంటే (ఉదాహరణకు రెండు రూపాయల కిలో బియ్యాన్ని అయిదు రూపాయలు చేసిన చంద్రబాబు, ఇపుడు అధికారంలోకి వస్తే పేదలందరికీ ఉచితంగా ఇస్తాననంటే) ప్రజల్లో ఎంత మేరకు విశ్వాసం కలుగుతుంది? అదీగాక ఆ పార్టీలో చాలామంది సీనియర్ నాయకులు పార్టీని వదిలిపెట్టి, ఇంకా పెట్టని చిరంజీవి పార్టీలో చేరడం, అక్కడక్కడ కొంత మంది కాంగ్రెస్‌లో చేరడంతో, రాజకీయ వ్యాఖ్యాతలు ఆ పార్టీని ఖర్చు ఖాతాలో వేసేశారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అధికారానికి ఆమడ దూరంలో ఉన్నారు కాబట్టి, ఈ చర్చ పరిధిలోకి రారు. అయితే వారు చిరంజీవితో జత కడితే, ఆ పార్టీల నిర్మాణ శక్తి, చిరంజీవి పాపులారిటీ కలిస్తే అది ప్రధానంగా చిరంజీవికే లాభిస్తుంది. ఇక మిగిలింది చిరంజీవే.

చిరంజీవికి నిస్సందేహంగా రామారావుకున్నంత పాపులారిటీ ఉంది. అయితే ఈ పాపులారిటీలు వేర్వేరుగా ఉన్నాయి. చిరంజీవి పాపులారిటీకి యావన్మంది ప్రజల్లో పునాదుల్లేవు. అది యువతకే పరిమితం. రామారావులా ఆయనకు రాష్ట్రమంతటా అభిమానులున్నారు కాని అభిమాన సంఘాలు లేవు. గ్రామీణ ప్రజలు రామారావును దేవుడిలా కొలిచినట్లు చిరంజీవిని కొలవరు. ఆయన సినిమాలు చూస్తారు అంతే, అభిమానిస్తారు, కాని అనుసరించరు. తెలంగాణ జిల్లాల్లో ఆయన అభిమానం పరిమితం. అయితే కులం, తదితర కారణాల వల్ల ఆయనకు ఓట్లు గణనీయంగానే పడవచ్చు. ప్రజల సమస్యల మీద పోరాటాలకు నాయకత్వం వహించిన చరిత్ర లేకపోవటం మాట అటుంచి, వారి సమస్యలకు స్పందించిన దాఖలాలు లేవు. (రామారావుకూ లేవనుకొండి).

చిరంజీవి పాలసీలు, విధానాల కోసం ఎదురు చూడాల్సిన పని లేదు. ఆయనే కాదు, అన్ని పార్టీలవారు పేదల కష్టాల గురించి కడివెడు కన్నీళ్లు కారుస్తారు. వారికి బాసటగా ఉన్నామంటారు. ఆయన నుంచి రెండే ప్రధాన విషయాల గురించి ఏమి చెబుతారోనని ఎదురు చూడవచ్చు; 1) తెలంగాణ, 2) రామారావు రెండు రూపాయల కిలో బియ్యం లాంటి యావన్మందిని ఆకర్షించే నినాదం ఆయన వద్ద ఏమైనా ఉందా? ఈ రెండింటికీ ఆయన ఇచ్చే జవాబు మీద ఆయన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఏ ప్రభుత్వానికైనా ప్రజల్లో వ్యతిరేకత ఉంటుంది. అయితే ఆ వ్యతిరేకత అంతా ఆయన గుత్త సొమ్ము కానేరదు. ఫ్యాక్షనిస్టు రాజకీయాలు, డబ్బుతో రాజకీయాలు నడిపిస్తూ వచ్చిన వారు, ఇతర పార్టీల్లో ఇమడలేకపోయిన వారు, చిరంజీవి పాపులారిటీని సొమ్ము చేసుకొందామనుకొన్న వారు, ఇలా రకరకాల నాయకులు ఆయన గూటిలో చేరాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఆ బురద అంటకుండా చిరంజీవి సంభాలించుకోగలరా?

ఏమైనా కాంగ్రెస్ కొన్ని సీట్లు పోగొట్టుకోవటం ఖాయం. నెలల దూరంలో ఉన్న ఎన్నికల్లో ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే.

అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి రోజునే రెండు రూపాయల కిలో బియ్యం అధికారికంగా ప్రకటించారు. గ్రామాల్లో భూస్వాముల కొమ్ముకాస్తూ పేదలను దశాబ్దాలుగా పీల్చిపిప్పి చేయడంలో సహకరించిన మున్సబు, కరణం వ్యవస్థను రద్దు చేశారు. స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించారు. నీటి పారుదల, విద్యుచ్ఛక్తి రంగాలకు ప్రణాళికలో కేటాయింపులు తగ్గించి, సంక్షేమ పద్దుకు ఎక్కువ నిధులు కేటాయించారు. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఊహించలేని, వ్యవస్థలోనే మార్పులు తెచ్చిన నిర్ణయాలు. చిరంజీవి అటువంటి మార్పుల గురించి ఆలోచించగలరా? ◆

*సంప్రదాయ రాజకీయలను సమూలంగా మార్చి, ప్రజల చుట్టూ తిరిగే రాజకీయాలను తీసుకురావడానికి నిబద్ధతతో కృషి చేయడంలో రాజకీయ పార్టీలన్నీ విఫలమయ్యాయని అంటున్నారు* **డా. జయప్రకాష్ నారాయణ్**

# లోక్‌సత్తా ప్రత్యామ్నాయ రాజకీయ ఒరవడి

**2004** నాటికీ, ఇప్పటికీ రాష్ట్ర రాజకీయ వాతావరణంలో గణనీయ తేడా ఉందనేది విస్పష్టం. అప్పటికీ, ఇప్పటికీ ఉన్న ప్రధానమైన తేడాను విశ్లేషిస్తే... లోక్‌సత్తా పార్టీ కీలకపాత్ర అర్థమవుతుంది. పదేళ్ల లోక్‌సత్తా ఉద్యమం 2006 అక్టోబర్‌లో పార్టీగా రూపుదిద్దుకుని మౌలిక సమస్యలు పరిష్కరించే విధానాలతో నూతన పోరాట పంథాతో కృషిని మొదలు పెట్టింది. ఇన్ని దశాబ్దాల తమ ఏలుబడిలో కోట్లమంది ప్రజల్ని ఇంకా యాచకులుగా మిగిల్చిన రెండు సంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయం తీసుకురావటమే తన లక్ష్యమని లోక్‌సత్తా విస్పష్టంగా ప్రకటించింది. సంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయం నిర్మిస్తామని అంత నిర్ద్వంద్వంగా ప్రకటించిన పార్టీ లోక్‌సత్తా ఒక్కటే. ఆ లక్ష్యానికి కట్టుబడే పార్టీ తన కృషిని కొనసాగించింది. రాష్ట్ర రాజకీయాల్ని గణనీయంగా ప్రభావితం చేసింది.

2007 ముగింపుకొచ్చేసరికి ప్రత్యామ్నాయ రాజకీయం రాష్ట్రంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. 2007లో రాష్ట్రంలో నూతన రాజకీయ సంస్కృతి ప్రారంభమైంది. విశ్వసనీయ 'మార్పు' మొదలైంది. పుట్టుకతో వివక్ష లేకుండా ఈ దేశంలో ప్రతి బిడ్డా సమానావకాశాలు పొంది వికసించాలనే లక్ష్యంతో రాజకీయ ప్రక్షాళనకు లోక్‌సత్తా వెలువరించిన విధానాలకు, చూపించిన పరిష్కారాలకు, అనుసరించిన పోరాట పంథాకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆమోదం లభించింది. తమ ప్రయోజనం కోసం ఒక వర్గం, మరో వర్గంతో ఘర్షణపడే పరిస్థితుల్ని నివారించి సమన్వయంతో అభివృద్ధి సాధించే రాజకీయాల్ని లోక్‌సత్తా తీసుకొచ్చింది. ఒకప్పుడు అసాధ్యం అని అన్ని పార్టీలూ తేల్చేసిన అంశాలను లోక్‌సత్తా ఆచరణసాధ్య రాజకీయ ఎజెండాగా ముందుకు తీసుకొచ్చింది. నాణ్యమైన విద్య, ఆరోగ్యంతో మొదలుపెట్టి ఆ ఎజెండాలోని అంశాల గురించి అన్ని పార్టీలూ ఏదో ఒక రూపంలో మాట్లాడక తప్పని పరిస్థితి ఏర్పడింది. మౌలికసమస్యలకు పరిష్కారం ప్రజాస్వామ్యంలోనే ఉందని లోక్‌సత్తా స్పష్టంగా తెలియచెప్పింది.

పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉన్నప్పుడే అది ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయగలగుతుంది. కాబట్టి, లోక్‌సత్తా నిర్మాణంలో ఆ ఏర్పాట్లను పకడ్బందీగా చేయడం జరిగింది. పార్టీ అంతర్గత పదవుల్లో ఎన్నికలకు, రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలకు శ్రీకారం చుట్టడం, వెనకబడిన, అణగారిన వర్గాలకు పార్టీ పదవుల్లో దామాషా పద్ధతిన కేటాయింపు, యువతకు యాభై శాతం, మహిళలకు 33 శాతం, కీలకపదవుల్లో అణగారిన వర్గాల ప్రతినిధులకు అవకాశం, పార్టీ పనితీరును పర్యవేక్షించేందుకు స్వతంత్ర ప్రతిపత్తిగల అంబుడ్స్‌మెన్ వ్యవస్థ ఏర్పాటు.... ఇవన్నీ అంతర్గత ప్రజాస్వామ్యంతోపాటు పార్టీలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం కోసమే. పార్టీని నాయకుల సొత్తుగా కాకుండా ప్రజల ఆస్తిగా నిర్మించటానికి వ్యవస్థాగత ఏర్పాట్లు చేయడం అనేది భారత రాజకీయాల్లో గుణాత్మకమార్పునకు నాంది.

మరో ముఖ్యమైన అంశం. పార్టీ అదాయ, వ్యయ వివరాలను ప్రజలకు విడుదల చేయడం. అలా చేసిన మొదటి పార్టీ లోక్‌సత్తా. వెబ్‌సైట్‌లో ఉన్న ఈ వివరాలను ప్రపంచ వ్యాప్తంగా ఎవరైనా తనిఖీ చేసుకోవచ్చు. పార్టీల ఆర్థిక లావాదేవీలు ప్రజలకు జవాబుదారీగా ఉండటం. ప్రజాస్వామ్య లక్ష్య సాధనలో మరో కీలకావసరం. వీటన్నిటితోపాటు, మౌలిక సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని అందించే ఎజెండా లోక్‌సత్తాది. విద్య, వైద్యం, ఉపాధి, మద్య నియంత్రణ, రిజర్వేషన్లు, వ్యవసాయం, పోలీసు, న్యాయవ్యవస్థలో సంస్కరణలు.... ఇలా ప్రతి వ్యక్తికీ స్వావలంబన, సార్వభౌమాధికారం హామీ దిశగా విధానాల్ని ప్రవేశపెట్టింది. ప్రజలు ఎక్కడికక్కడ పాలనలో భాగస్వాములై తమ సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు వీలుగా ఇంటి ముందు పాలన – కంటిముందు ప్రభుత్వం తెచ్చేందుకు లోక్‌సత్తా జిల్లా ప్రభుత్వాల భావనను రూపొందించింది. నిరసనల వ్యక్తీకరణకు బంద్‌లు, రాస్తారోకోలతో ప్రజల్ని ఇబ్బంది పెట్టకుండా, విమర్శల్లో సంకుచిత దృక్పథం, వ్యక్తిగత దూషణలు లేకుండా లోక్‌సత్తా ప్రవేశపెట్టిన కొత్త రాజకీయ సంస్కృతి అందరినీ ఆలోచింపచేస్తోంది.

వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ఇటీవలి ఉప ఎన్నికల్లో మేం ఖైరతాబాద్, తెర్లాంలలో పోటీ చేసినప్పుడు ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా ప్రజలు మాకు గణనీయ మద్దతును ఇచ్చారు. రాబోయే కాలంలో ఇది దాదాపు అన్ని రాజకీయ పార్టీలకూ ఓ కుదుపు అవుతుందనటంలో సందేహం లేదు. ఎన్నికల వ్యయంలో కావొచ్చు, ప్రచార సరళిలో కావచ్చు. ఆ ఉప ఎన్నికలు కొత్త రాజకీయానికి గట్టి పునాది వేశాయి. ఎన్నికల సంఘం చెప్పిన నిబంధనల పరిధిలోనే ఖర్చు పెట్టాం. ప్రచారంలో ఎక్కడా ప్రజలను ఇబ్బంది పెట్టకుండా, ప్రత్యర్థులపై వ్యక్తిగత దూషణలకు దిగకుండా హుందాగా వ్యవహరించాం. మద్యం, డబ్బు పంచలేదు. కిరాయికి ఏజెంట్లను తెచ్చుకోలేదు. అయినా గణనీయంగా ఓట్ల శాతం తెచ్చుకున్నాం. మార్పు కోసం చిత్తశుద్ధితో చేసే ప్రయత్నానికి ప్రజల ఆదరణ ఉంటుందని

నిరూపించాం. చెప్పినదానికి, చేసేదానికి మధ్య అంతరాన్ని తగ్గించుకోవటానికి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయానికి లోక్‌సత్తా పార్టీ ఒరవడి దిద్దిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. అందుకుతగ్గ వాతావరణాన్ని తీసుకురావటంలో సఫలమయ్యాం. అయితే అది సరిపోదు.

అధికారాన్ని కాపాడుకునేందుకు సంప్రదాయ పార్టీలు సాధ్యమైనన్ని ఎత్తులు, జిత్తులు ప్రదర్శిస్తున్నాయి. ఈ రోజు కేవలం వెయ్యి మంది నేతలు మాత్రమే కోట్లమంది తెలుగు ప్రజల తలరాతల్ని రాస్తున్నారు. ప్రజల సొమ్మును యథేచ్ఛగా మింగుతూ, తమ వారసులకు స్థానం కల్పిస్తూ, ప్రజల్ని మాత్రం యాచకులుగా కొనసాగిస్తున్నారు. ఓ పక్క విచ్చలవిడి అవినీతి, మరోపక్క తాత్కాలిక ఉపశమనాన్నిచ్చే తాయిలాలు. ఇదే రాజకీయంగా మారిపోయింది. దీనివల్ల కొద్దిమంది నేతలు, వారి కుటుంబాలు మాత్రమే లాభపడుతుండగా, కోట్లాది ప్రజలు శాశ్వతంగా పేదలుగా మిగిలిపోతున్నారు. రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారింది కాబట్టే, ఇక్కడ అందినంత దండుకునేందుకు సంప్రదాయ పార్టీల్లో పోటీ నెలకొంది. ఎన్నికల్లో పెట్టుబడి పెట్టడం, తర్వాత అందుకు అనేక రెట్లు దోచుకోవడం, వారసులకు అందించడం, గూండాయిజం, ప్రగతి నిరోధకత్వం రాజకీయ సంస్కృతిగా మారాయి.

ప్రజల్ని ఓటువేసే యంత్రాలుగా మాత్రమే చూస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే రాజకీయాల వల్లే ఈ రోజు సమాజంలో చాలావర్గాలు అణగారిపోయాయి. వారి ఆవేదన ఆగ్రహంగా మారి హింసాత్మక ఉద్యమాలకు దారితీస్తోంది. నక్సలిజం పోరాట పంథాను ఎవరూ సమర్థించకపోయినా, వారి పోరాటం వెనక అర్థాన్ని తోసిపుచ్చలేం. ఎప్పుడైతే అధికారం కొందరి చేతుల్లో కేంద్రీకృతమై, రాజకీయాలంటే ప్రజల్లో విశ్వసనీయత పోయిందో అక్కడ్నుంచి ప్రాంతీయ, కుల ఉద్యమాలు మొదలయ్యాయి. ఇదే ఇప్పుడు రాష్ట్రంలో కొనసాగుతున్న పరిస్థితి. నడుస్తున్న ఈ రాజకీయాల పట్ల ఏహ్యభావం, ప్రత్యామ్నాయ రాజకీయం పట్ల బలమైన ఆకాంక్ష ప్రజల మనసుల్లో ఉన్నప్పటికీ ఏదో రకంగా ఇన్నేళ్లుగా తాము కొనసాగిస్తున్న దోపిడీ రాజకీయాన్ని తిరిగి తీసుకొచ్చేందుకే సంప్రదాయ పార్టీలు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి.

ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలకు రకరకాల తాయిలాలను రాజకీయ పార్టీలు ఎడాపెడా ప్రకటిస్తున్నాయి. కిలో బియ్యం రెండు రూపాయిల పథకం, ఉచిత బియ్యం, పావలా వడ్డీ, పది పైసల వడ్డీ, రుణమాఫీలు, ఉచిత గ్యాస్, ఉచితంగా తాళిబొట్లు ఇలా రకరకాలు. వీటిలో ఏదీ శాశ్వతంగా పేదరికాన్ని తొలగించేదికాదు. ప్రజల్ని చావనీయకుండా, బతకనీయకుండా జీవచ్ఛవాల్లా చేసి ఓట్లు దండుకోవడమే ఈ ప్రలోభాల లక్ష్యం. దేశ రాజకీయాలలో ఇన్ని ప్రలోభాలు ఎక్కడా లేవు. మరోవైపు కులం, మతం, అతి ప్రాంతీయత వంటి సంకుచిత అంశాలతో ప్రజల్ని విడదీసి ఓట్లు దండుకునేందుకు రెచ్చగొడుతున్నారు. ఏ పార్టీని చూసినా ఇదే తీరుగా కన్పిస్తోంది. సంప్రదాయ రాజకీయాల్ని సమూలంగా మార్చి, ప్రజల చుట్టూ తిరిగి రాజకీయాల్ని తీసుకురావటానికి నిబద్ధతతో కృషి జరగటం లేదు. ఏ వర్గాన్ని ఎలా ఆకర్షించవచ్చు, ఏ ఎత్తుగడ వేస్తే ఎక్కడ ఎన్ని ఓట్లు వస్తాయి, ఎవరితో కలిస్తే ఎన్ని సీట్లు గెలవొచ్చు వంటి అధికార లెక్కలు తప్ప ప్రజల స్థితిగతుల్ని మెరుగుపరిచి వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేందుకు ఏం చేద్దాం అనే చర్చ కొరవడింది. ఎన్నికలు నేతల కోసమా? ప్రజల కోసమా? అధికారం కోసం పోటీ బహుముఖమై తీవ్రతరం కావటంతో ఇదివరకు ఎప్పుడూ లేనంత గందరగోళం ఈ రోజు రాష్ట్ర రాజకీయాల్లో నెలకొంది.

ఈ పరిస్థితిని ఎదుర్కొని ప్రత్యామ్నాయ రాజకీయం కోసం రాష్ట్రం సన్నద్ధం కావాల్సి ఉంది. రాజకీయం అంటే నాయకుల, పార్టీల సొంత వ్యవహారం కాదు. అది మౌలికంగా ప్రజలకు సంబంధించిన వ్యవహారం. ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి అధికారాన్ని మార్గంగా ఉపయోగించాలి తప్ప అది గమ్యం కాదు. అందుకు తగిన ఎజెండా ఉండాలి. మొదటగా, రాజకీయ సంస్కృతి మారాలి. రెండు, వివక్ష లేకుండా ప్రతి ఒక్కరూ తమ కాళ్లమీద తాము నిలబడేందుకు నాణ్యమైన చదువు, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు అందాలి. మూడు, ఇంటిముందు పాలన – కంటి ముందు ప్రభుత్వం వచ్చేలా అధికారాన్ని వికేంద్రీకరించాలి. నాలుగు, చట్టబద్ధ పాలన ఉండాలి. ఈ నాలుగు అంశాల చుట్టూ రాజకీయం తిరగాలి. రాజకీయాన్ని ఆదాయ మార్గంగా, కేవలం ఓట్లు, సీట్లు కోణంలో చూడకుండా ఉంటేనే ఈ ఎజెండా సాధ్యమవుతుంది. దీంతోపాటు తమ బంధువులకు, వారసులకు కాకుండా సమాజంలో వివిధ వర్గాలకు రాజకీయాల్లోకి అవకాశం కల్పించాలి. ఇందుకోసం రెండు మౌలిక శక్తుల్ని సమాజంలో ప్రోత్సహించాలి.

1) సామర్థ్యం, నిజాయితీ, వనరులు, నాయకత్వ లక్షణాలు ఉన్నవారు వేలాదిమంది రాజకీయ తీరు మార్చడానికి, తమ పిల్లల భవిష్యత్తును కాపాడుకోవడానికి దీర్ఘకాలిక పోరాటానికి సమాయత్తం కావాలి. ఇందుకు పార్టీలు అవకాశం కల్పిస్తూ, ప్రోత్సహించాలి.

2) లక్షలాది సామాన్యపౌరులు తమ నిత్యజీవితంలో నిజాయితీ గల రాజకీయం ఓ భాగంగా గుర్తించి ప్రజల్ని ఎక్కడికక్కడ స్థానికంగా సంఘటితం చేయాలి. దీన్ని పార్టీలు రాజకీయంలో ఒక ప్రధాన కార్యక్రమంగా భావించాలి.

ఈ రెండూ జరిగినప్పుడే నిజమైన మార్పు ఈ దేశంలో సాధ్యమవుతుంది. అందుకోసమే లోక్‌సత్తా పార్టీ ప్రయత్నిస్తోంది. మౌలిక సమస్యలు పరిష్కరించే సమగ్ర విధానాలు, ప్రజల భాగస్వామ్యం, కొత్త రాజకీయ సంస్కృతి లేకుండా ఓట్లు కొనుగోలు మీద, మద్యం పంపిణీ మీద, కులాల లెక్కల మీద, రాజకీయాన్ని వ్యాపారంగా భావించే పెట్టుబడి దారుల మీద ఆధారపడి పార్టీలను నిర్మించినంతకాలం మన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదు. అలాంటి రాజకీయం పత్రికలు, టివి ఛానళ్లలో ఖాళీని పూరించటానికి మినహా ఎందుకూ పనికిరాదు. ప్రజల జీవితాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటాయి.

నిజమైన మార్పును తెచ్చి ప్రతి పౌరుడూ సొంత కాళ్లమీద, ఆత్మగౌరవంతో బతికేందుకు జన రాజకీయం తెచ్చేందుకు లోక్‌సత్తా పార్టీ ప్రారంభించిన కృషిలో నిజాయితీతో, స్పష్టమైన విధానాలతో ఎవరు ముందుకొచ్చినా వారి సహకారం తీసుకోవటానికి అభ్యంతరం లేదు. అయితే ఆట నియమాలు మార్చకుండా ఆటగాళ్లను మార్చడం, అధికారాన్ని మార్గంగా కాకుండా గమ్యంగా చూడటం వల్ల మాత్రం మార్పు సాధ్యం కాదు అని ఎవరికైనా లోక్‌సత్తా తెగేసి చెప్తుంది. ◆

*తన విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం బలపడుతోందనీ, ప్రతిపక్షాలు అంతర్గత సమస్యలతో బలహీనపడుతున్నాయనీ అంటున్నారు* **ఉండవల్లి అరుణ్‌కుమార్**

# బలహీనపడుతున్న విపక్షాలు

పొట్టేళ్లలా కుమ్ముతాయనుకున్న ప్రతిపక్షాలు రాష్ట్రంలో కుదేలైపోతున్నాయి. అంతర్గత కుమ్ములాటలు, నాయకత్వ వ్యతిరేక ధోరణులతో ప్రతిపక్షాలు నానాటికీ బలహీనపడుతుంటే సమర్థత, ధీటైన విపక్షం లేక ప్రజాస్వామ్యం నీరసపడిపోతోంది. రాజకీయం రంగులు మారి మరింత కళావిహీనంగా తయారవుతోంది. పాతికేళ్ల కాలగమనంలో ఐదేళ్లు మినహా అధికారానికి ఆమడదూరంలో ఉన్న కాంగ్రెస్ వై.ఎస్. పుణ్యమాని పునరుజ్జీవనం పొంది నాలుగేళ్లుగా అధికారపీఠంపై దరహాసం చిందిస్తూ ఠీవీగా కూర్చుంటూ ఐదో యేడూ పూర్తి చేసుకోవడంతోపాటు మరో ఐదేళ్లపాటు సునాయసంగా అధికారంలో కొనసాగే దిశగా దూసుకుపోతోంది. కలహాలకూ, వర్గపోరుకూ పెట్టింది పేరైన కాంగ్రెస్ జాతకం 2004 నుంచి మారింది. అడపాదడపా ఆర్నెల్లకో అపస్వరం వినిపిస్తున్నా వై.ఎస్. చిద్విలాసంగా అన్ని అవరోధాలను సునాయసంగా అధిగమిస్తూ అలుపెరగని బహుదూరపు బాటసారిలా ముందుకు అడుగులు వేస్తూనే ఉన్నారు.

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పగ్గాలను సోనియా గాంధీ చేపట్టిన దశాబ్దకాలంగా పార్టీలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటూ విశ్వాస పరీక్షలో విజేతగా నిలిచి కడిగిన ముత్యంలా మెరిసిపోతోంది. మంచికో చెడుకో పార్టీ పగ్గాలు ఏకసూత్రంపై సాగుతున్నాయి. అందుకేనేమో ఆర్నెల్లకు, ఏడాదికీ తరచూ ముఖ్యమంత్రులను మార్చే సంప్రదాయానికి తిలోదకాలిచ్చి, రాష్ట్ర నాయకత్వాలను కదల్చకుండా పునాదులు పటిష్టం చేసుకుంటోంది. కేవలం ముఖ్యమంత్రులను వారి మానాన వారిని వదిలివేయకుండా అధిష్ఠానం సంపూర్ణ మద్దతునిస్తూ ఎక్కడైనా అసమ్మతి కలుపుమొక్కలు కనిపిస్తే తక్షణమే తొలగించి పార్టీకి ఎటువంటి చీడా అంటకుండా జాగ్రత్త పడుతోంది. పైనుంచి పార్టీపరంగా సోనియా, ప్రభుత్వపరంగా మన్మోహన్‌సింగ్ వై.ఎస్.కు పూర్తి స్వేచ్ఛనివ్వడమే కాకుండా అన్ని కాలాల్లో, అన్ని విషయాల్లో ప్రోత్సహిస్తూ కవచం మాదిరి అండగా ఉంటున్నారు.

గతంలో విన్నింగ్ కాంబినేషన్‌గా పేరొందడం వల్లనేమో మరోసారి డి.ఎస్.ను పి.సి.సి. అధ్యక్షునిగా నియమించి ఈ జోడీని ఎన్నికలకు సిద్ధం చేస్తోంది అధిష్ఠానం. కాంగ్రెస్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రాణవాయువని గమనించే ఈ పర్యాయం కూడా రాష్ట్రాన్నే నమ్ముకుంది. వై.ఎస్. వైరి పక్షాల దాడులను ఎదుర్కొంటూనే ప్రభుత్వాన్ని తనదైన శైలిలో నడుపుతూ డి.ఎస్.తో చక్కని సమన్వయంతో పార్టీని ప్రభుత్వంతో మమేకం చేస్తూ అడుగులు వేస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ 184 సీట్లు గెలుచుకున్నా, మిత్రపక్షాన్ని దూరం చేసుకోకుండా టి.ఆర్.ఎస్.ను అక్కున చేర్చుకుని రాష్ట్ర చరిత్రలో తొలి సంకీర్ణానికి బీజాలు నాటారు. దాదాపు రెండున్నరేళ్లుగా టి.ఆర్.ఎస్. తెగదెంపులు చేసుకుని, వామపక్షాలు 'చేయి' విడిచి విపక్షాల శిబిరంలో చేరినా పెదవి విప్పి ఒక్క విమర్శా చేయకుండా సంయమనం పాటిస్తూ, అంతా అధిష్ఠానేచ్ఛ అనే సూత్రాన్ని వై.ఎస్. పాటిస్తున్నారు.

ఏ పని చేపట్టినా శ్రమలోపం, సంకల్ప లోపం ఉండకూడదనే అభిమతంతో నడుస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రకృతి సైతం సహకరిస్తుందని నాలుగేళ్లలో ఆయన రుజువు చేశారు. స్వశక్తితో, ప్రజాభిమానంతో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించినా, పార్టీ అధినాయకత్వాన్ని గౌరవిస్తూ క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా వ్యవహరిస్తూన్నారే తప్ప మిడిసిపాటుతో ఎగిరెగిరి పడటంలేదు. ఢిల్లీ నాయకత్వాన్ని చెక్కు చెదరనీయకుండా ఆపత్కాలంలో కొండంత అండగా నిలిచి, పైనుంచి ఆదరణ, ఆశీస్సులు పొందుతున్నారు. ఇన్ని చేస్తున్నా ప్రజాసంక్షేమానికీ, రాష్ట్రాభివృద్ధికీ ఏ మాత్రం లోటు రానీయకుండా అహర్నిశలూ శ్రమిస్తున్నందువల్లే ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతున్నదే తప్ప తరగడం లేదు.

ప్రతిపక్షాలు ఎంతగా ప్రభుత్వ వ్యతిరేకతను రెచ్చగొట్టాలని ప్రయత్నించినా అది ఫలించకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆదరణ నానాటికీ పెరుగుతోంది. ఈ ఆదరణే ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను అజేయంగా నిలుపుతోంది. తన రాజకీయ చాతుర్యంతో వై.ఎస్. ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశాన్ని కోలుకోని దెబ్బకొట్టారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, వెనుకబడిన తెలంగాణను అన్నింటా ముందు నిలిపి అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల మన్ననలను చూరగొన్నారు. ప్రత్యేకవాదులు ఏ పార్టీకి చెందినవారైనా మెత్తబడిపోయేలా చేయగలిగారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో టి.ఆర్.ఎస్. సందిగ్ధంలో పడిపోయింది. వై.ఎస్. చెప్పింది చేస్తారన్న విశ్వాసం ప్రజల్లో కలిగించగలిగారు. పని చేసే కార్యకర్తలకు గుర్తింపు తథ్యమన్న నమ్మకాన్ని ఏర్పరిచారు.

రాష్ట్రంలో తెలుగుదేశం కోట కూలిపోతోంది. వామపక్షాలు గందరగోళంలో పడ్డాయి. టి.ఆర్.ఎస్. తెల్లముఖం వేసింది. లోక్‌సత్తా పత్తాలేకుండా పోయింది. ఏడాదిగా అశరీరవాణి వినిపిస్తూ,

ఊహాలోకాల్లో రంగుల కలలుకంటున్న 'మెగా' పార్టీ ఆవిర్భావానికి ముందే వై.ఎస్. హోరుగాలికి చి(గు)రు ఆకులా వణికిపోతోంది. వలసలపై ఆశలు పెంచుకుని, ఫిరాయింపు 'రక్తం'తో బలపడదామనుకుని గాలిమేడలు కడుతోంది. ఇవేవి లెక్కచేయకుండా, వ్యూహాత్మకంగా అడుగులు వేసుకుంటూ వై.ఎస్. ప్రజాప్రస్థానం సాగిపోతోంది. తెలుగుదేశం పార్టీయే వై.ఎస్.కు రాజకీయ ప్రత్యర్థి. మిగిలిన వాటితో ఎలా నెగ్గుకు రావాలో ఆయనకు బాగా తెలుసు. తెలుగుదేశానికి ఎక్కడ, ఎలా చెక్ పెట్టాలా ఆయనకు అనుభవం నేర్పింది. ఎల్లడెలా తానే నెంబర్ వన్ అనుకునే చంద్రబాబు యిప్పుడు రెండోస్థానం కోసం తాపత్రయపడే స్థితి ఏర్పడింది.

ఒకవైపు 'చిరు'గాలి, మరోవైపు 'అణు'హోరు, పార్టీలో అసంతృప్తి జ్వాల, కేడర్‌లో, లీడర్లలో తరుగుతున్న విశ్వాసం, ఆత్మాభిమానుల తిరుగుబాటు, యు.ఎన్.పి.ఎ.లో చీలికలు, 'మీకోసం' లో తప్పటడుగులు ఇవన్నీ చంద్రుణ్ని కళావిహీనం చేస్తున్నాయి. యునైటెడ్ ఫ్రంట్ స్టీరింగ్ తిప్పిన బాబు సైకిల్ చక్రాలు పంక్చర్ అయ్యాయి. కొన్నాళ్లు కలిసి పనిచేసి విడిపోయిన వామపక్షాలతో మరోసారి కలవడానికి సిద్ధపడినా, దూరం చేసుకున్న బి.జె.పి.తో లోపాయికారి ఒప్పందానికి సిద్ధమైనా, ఆజన్మ శత్రువైన టి.ఆర్.ఎస్.తో మైత్రీ బంధం పెనవేసుకునేందుకు ఆత్రుత పడుతున్నా, అన్నీ అపస్వరాలే, ఎదురుదెబ్బలే. బాబు అంటే రాజకీయ పార్టీలకే కాదు, ప్రజలకు, చివరకు పార్టీ కార్యకర్తలకే విశ్వాసం సన్నగిల్లింది. అందుకే ఆనాడే యు.ఎన్.పి.ఎ. నుంచి అమ్మ జయలలిత తప్పుకుంది. తాజాగా ములాయం వ్యతిరేకమయ్యారు. ఫరూక్ అబ్దుల్లా దూరం జరిగారు. ఎ.జి.పి. ఏనాడో బంధం తెంచుకుంది. ఉత్తరాది పార్టీలు ఆయన్ను నమ్మడం ఏనాడో మానేశాయి. నాలుగేళ్లుగా పార్టీలో ఒక్కొక్కరూ తిరుగుబాటు బావుటా ఎగురవేస్తూ సొంత కుంపట్లు పెట్టుకోవడమో, పరాయి పంచన చేరడమో చేస్తూ తెలుగుదేశాన్ని కోలుకోలేని దెబ్బతీస్తున్నారు. దీంతో చంద్రబాబులో అసహనం, అభద్రత నిలువెత్తున పేరుకుపోయాయి. తెలుగుదేశం పార్టీకి ఆనాడు ఎన్.టి.ఆర్. వేసిన బలమైన పునాదులు బాబు తొమ్మిదేళ్ల పాలనలో కదిలిపోవడంతో భ్రమలు తొలగిపోయిన నాయకులు వలసలు పోతున్నారు. బాబు వల్ల పార్టీకి జవసత్వాలు రావడం లేదని భావిస్తున్న వారు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారు.

దీనికితోడు ఆర్నెల్లుగా చిరుపార్టీ 'మెగా' గాలులకు చంద్రబాబు పార్టీ కకావికలం అవుతోంది. ఒక్కొక్క తాటాకు లేచిపోయి వాసాలు కూడా పడిపోయే స్థితికి చేరుకుంది. పాతనీరు పోతోంది. కొత్త నీరు చేరక, చెరువు ఎండిపోయి, కరువు కాటకం ఏర్పడుతోంది. కోటగిరితో పాటు దేవేందర్‌గౌడ్ కూడా వెళ్లిపోయారు. భూమా దంపతులు నిష్క్రమించారు. రామచంద్రయ్య, పెద్దిరెడ్డి, ఖలీల్‌బాషా, జోశ్యుల నెహ్రూ, టి. రామారావు, కుడుపూడి, త్రిమూర్తులు... తాజాగా ఆదికేశవుల నాయుడు, మందా జగన్నాథం ఒక్కొక్కరు గుడ్‌బై చెబుతున్నారు. కడియం శ్రీహరి కాక మీదున్నారు. ఎనమల అసంతృప్తి పెంచుకుంటున్నారు. చెన్నమనేని రాజేశ్వరరావు వంటి వారు రాజకీయ సన్యాసానికి రెడీ అవుతున్నారు. కారణం ఏమిటి? రాజకీయ అహంభావమా? ఆత్మస్తుతా? బావమరుదులు, మేనల్లుళ్ల పట్ల పెంచుకుంటున్న అభిమానమా? ఎన్.టి.ఆర్. ట్రస్ట్ భవన్‌లో ఎన్.టి.ఆర్. ఎటూ లేరు. ట్రస్ట్ (విశ్వాసం) మాయమైంది. భవనం ఖాళీ అవుతోంది. ఫండ్ ఉందేమోగానీ ఫౌండేషన్ కదులుతోంది. వామపక్షాలు, మాయ, ఒకటి రెండు సీట్ల చిన్నా చితకా పార్టీలు ఆయనతో ఉంటాయన్న నమ్మకం ఎటూ లేదు. ప్రపంచ నేతల ప్రశంసలు అందుకున్న ఆనాటి నాయకుడు నేడు ఒంటరి. ఆయన 'మనసులోమాట' ఆయనకే ఎదురుతిరుగుతోంది. 'మీకోసం' ఏ ముహూర్తాన మొదలైందోగానీ అన్నీ అపశకునాలే, అవాంతరాలే. అందుకేనేమో మనిషి మూడ్నెల్లుగా రోడ్డున పడ్డాడు. అధికార ఆరాటం పెరుగుతున్న కొద్దీ 'ఉచితాలు' అనుచితాలు మరిచిపోతున్నారు. ఒకవైపు వై.ఎస్., మరోవైపు 'మెగా' దిగులు ఎక్కువవుతోంది.

ఈ సమయంలో 'చిరు' ఊసు మరింత అవసరం. వంధి మాగధులు, బంధుగణం, మీడియా అసలు కథానాయకుని తెరమీదకు తీసుకురాకుండానే మాటలు, పాటలు, సంగీతం, ఎడిటింగ్, డైరెక్షన్ అంతా హడావిడి సృష్టిస్తున్నారు. ఫ్లాట్‌ఫారాలు కట్టారు, కడుతున్నారు. రైలు వస్తుందా? రాదా? తెలీదు. ఫ్లాట్‌ఫారాలు ఎక్కువై జనం రద్దీ పెరిగింది. రైలులో ఎన్ని భోగీలు ఉంటాయో తెలీదు కాని (పార్టీ) టిక్కెట్టు (రాని) లేని నాయక ప్రయాణికులు గూళ్లు వదిలి, పెట్టాబేడా సర్దుకుని, తోసుకు ఎక్కేందుకు రెడీ అవుతున్నారు. పవన్‌లు, మిత్రాలు, నాగబాబులు, వినయ్‌లు, మూర్తులు, అరవింద్‌లు అవతార మూర్తులుగా విరాజిల్లుతున్నారు. మూలవిరాట్టే పన్నెత్తు మాట్లాడటం లేదు. కన్నెత్తి చూడటం లేదు. ఆర్థిక, సామాజిక, రక్షణ, విదేశీ విధానాలంటూ (పేరే పెట్టని పార్టీకి) ఏమీలేవు. ఊరూరా సమావేశాలూ, సమాలోచనలూ, వారథులూ వెలశాయి. న్యాయవాదులూ, డాక్టర్లూ, కార్మికులూ, విద్యార్థులూ, మహిళలూ, ఐటి నిపుణులూ, ఇంజనీర్లూ, మేధావులూ, ఇలా ఒకటేంటి ఏనాడూ ప్రజల గురించి ఆలోచించని వారు, ఎన్నికల్లో ఓటు వేసి ఎరుగని వారు, స్వదేశానికి దూరమై, విదేశాల్లో స్థిరపడి ధనార్జనే ఊపిరిగా బతుకుతున్న జీవులు ఒక్కసారి ఉత్తేజితులై, మెగా ప్రభం'జనం'లా తయారవుతున్నారు. కుల సమీకరణలు ఆ పార్టీకి కళ్లూ రక్తం కూడా. వీరందరినీ నడిపించే శక్తులు 'సోదర, మిత్రాలే'.

రాష్ట్రంలో తమ మాట చెల్లుబడి కావాలని, ప్రభుత్వం, ప్రజలు తమ ఆదేశాల మేరకే నడుచుకోవాలనే నిరంకుశవాదులైన ప్రసార మాధ్యమాలు తమ స్వీయ ప్రయోజనం కోసం, వర్గ శ్రేయస్సుకోసం ఏ ఎండకా గొడుగు పడుతూ, ప్రస్తుతం ఊసరవెల్లిలా 'మెగా' రంగు పులుముకుని అయోమయం సృష్టిస్తున్నాయి. నిజం విజ్ఞులైన ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఇంటి సమస్యలే పరిష్కరించుకోలేని వారు ప్రజా సమస్యలు ఎలా తీరుస్తారంటే సమాధానం ఉండదు. ఇప్పుడన్నీ కప్పదాట్లే. రాజకీయాలు ఎంత దైన్యస్థితికి చేరాయంటే, ప్రపంచ వ్యాప్త కమ్యూనిస్ట్‌లు సైతం సిద్ధాంతాలు వదులుకుని రాద్ధాంతాలకు దిగుతూ, అవకాశవాదులై, మనుగడ కోసం తాపత్రయపడుతూ, ఆవిర్భవించని పార్టీ కోసం కళ్లు కాయలు కాసేట్లు ఎదురుచూస్తూ కలిసి నడిచేందుకు సిద్ధమవుతున్నారు. పోరుబాటలు, ఉద్యమాలు, విప్లవాలు, శ్రామిక, బడుగు, బలహీన, దళిత మార్గాలను మూసేసుకుని, 'మెగా' రైలు కోసం ఎదురుచూసే స్థితికి చేరుకున్నారు. మేధావివర్గాన్ని తట్టిలేపి, ఆలోచనలను గిలకొట్టి, మరో ప్రపంచం సృష్టికి, అవినీతి లేని స్వచ్ఛమైన రాచమార్గం వేస్తామని ఊరూరా ఉపన్యాసాలు

***డబ్బులు పంచడం, కుల-మతాల ఆధారంగా ఓటర్లను చీల్చడం, మద్యం పారించడం, సెక్యులర్ భావనకు తూట్లు పొడవడంగా రాష్ట్ర రాజకీయాలు పతనమయిపోయాయని అంటున్నారు* ఎన్. ఇన్నయ్య**

# మిశ్రమ ప్రభుత్వాల వైపుగా రాష్ట్రం

రాష్ట్రంలో రాజకీయం అంతా ఎన్నికల వాతావరణంతో కమ్ముకుని ఉంది. దేశ, రాష్ట్ర, ప్రాంతీయ పార్టీలన్నీ ఓటర్ల, భక్తి ప్రదర్శన తోనే కదులుతున్నాయి. పెట్టబోయే పార్టీ సంగతి తరువాత పరిశీలిద్దాం.

ఆంధ్రప్రదేశ్ 1978 నుండీ మిగిలిన రాష్ట్రాలకు భిన్నంగా వ్యవహరిస్తోంది. దేశమంతా జనతను కేంద్రంలో అధికారంలోకి తెచ్చినప్పుడు, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించడం విశేషం.

1982 నాటికి నలుగురు ముఖ్యమంత్రులను మార్చేసి, పరువు పోగొట్టుకున్న కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఢిల్లీ నాయకత్వానికి తాకట్టు పెట్టిందనే పేరు తెచ్చుకుంది. అది కాంగ్రెస్ సంస్కృతిలో భాగమైంది. ఆ సమయంలో ఎన్.టి. రామారావు ప్రవేశించి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చారు. ఆనాడు కమ్యూనిస్ట్ పార్టీలు రామారావును సమర్థించాయి. అదొక భిన్న రాజకీయ వాతావరణంగా పరిణమించింది.

ప్రజాబలంతో నెగ్గిన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కాంగ్రెస్ సంస్కృతిలో నుండి వచ్చిన నాదెండ్ల భాస్కరరావు తలపడితే, మళ్లీ కాంగ్రెస్ నీచపాత్ర ధరించి అభాసుపాలైంది.

రాష్ట్ర రాజకీయంలో అధికారంలో ఉన్న వారిని వ్యతిరేకించడం ప్రజలకు ఆనవాయితీ అయింది. అందుకు తగ్గట్లే అధికారంలో ఉన్నవారు నిర్విరామంగా తప్పులుచేస్తూ వస్తున్నారు. ఎన్.టి.రామారావు, చంద్రబాబు నాయుడు, విజయభాస్కరరెడ్డి, జనార్ధనరెడ్డి ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకతకు గురయ్యాయి. నేడు ఆ పరంపరలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది.

అయితే ఎన్నికల వాతావరణానికి తెలంగాణ సమస్య తోడైంది. దీనివలన రూపురంగులు మారాయి. రాజకీయంలో సెంటిమెంట్‌తో బాటు, ముఠాలు, ప్రాంతీయత ఎక్కువైంది. ఆంధ్రప్రదేశ్‌కు ఇదేమీ కొత్తకాదు. 1968లో మొదలై రెండేళ్లు సాగిన తీవ్ర హింసాపూరిత తెలంగాణ ఉద్యమాన్ని చవిచూసారు. సెంటిమెంట్ పేరిట గెలిచి, ఉద్యమాన్ని కుదువబెట్టిన నాయకత్వాన్ని ప్రజలు సహించారు. అంతేకాదు, ఉద్యమ సెంటిమెంట్‌ను ఇరవై ఏళ్లు మరచిపోయారు కూడా. అప్పుడూ తెలంగాణ ఉద్యమంలో చీలికలు, ముఠాలు, పరస్పర దూషణలు చూసారు. నేడు తెలంగాణ పోరాటంలో పాత చరిత్ర పునరావృతమైంది. ఇందులో కొత్త దశ ఏమంటే, సంకీర్ణంవైపుగా రాజకీయాలు పయనించడమే.

రాష్ట్రంలో కమ్యూనిస్ట్ పార్టీలు కీలక పాత్ర వహించే స్థితిలో లేవు. ఏదో ఒక ప్రధాన పార్టీ మద్దతు లేనిదే అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు గెలవలేని దశలో ఉన్నాయి. రాజకీయ పరిణామంపై ఈ దుస్థితి ప్రభావం బాగా ఉంది. తెలంగాణ సమస్య కమ్యూనిస్ట్ పార్టీలో

---

దంచిన లోక్‌సత్తా ఏడాదిన్నరగా, ఒక ప్రత్యేక మీడియా ఎంత ప్రోత్సహిస్తున్నా కాలుకదిపి అడుగు వేయలేకపోతోంది.

ప్రత్యేకవాదం ఊపిరితో ఎనిమిదేళ్ల నాడు ఆవిర్భవించి, సంచలనం సృష్టించిన టి.ఆర్.ఎస్.కు అన్నీ ఎదురుదెబ్బలే. గర్జనలు, ఘీంకారాలతో తెలంగాణను తట్టిలేపిన కె.సి.ఆర్. స్వయంకృతాపరాధం వల్ల ఇరవై ఆరు మంది శాసనసభ్యుల సంఖ్య ఏడుకు దిగజారింది. పదిమంది తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. గెలిచిన ఐదు లోక్‌సభ సీట్లలో రెండు మిగిలాయి. రెండు జారిపోయాయి. ఒకటి ఎదురుతిరిగింది. తెలంగాణలో జరిగిన ఉపఎన్నికల్లో రానురానూ ఓట్ల శాతం క్షీణించింది. తెలంగాణ వెనక్కిపోయింది. కె.సి.ఆర్. కరీంనగర్ ఆధిక్యత రెండు లక్షల నుంచి పదిహేను వేలకు దిగజారడం టి.ఆర్.ఎస్. వైభవాన్ని కళ్లకు చూపుతోంది. మేనలుళ్ల హవా, కుమారుని ప్రమేయం ఎక్కువైంది. సీనియర్లు, సిద్ధాంతకర్తలు అందరూ జారుకున్నారు. చివరికి 'కారు'లో రెండు చక్రాలు మిగిలాయి. స్టీరింగ్ మెల్లగా మాయచేతికో, లేక మళ్లీ బాబు చేతికో పోతోంది. దేవేందర్‌గౌడ్, పెద్దిరెడ్డి రాజీనామా తెలుగుదేశానికి నష్టం కలిగించిందేమో కానీ, గౌడ్ ప్రత్యేక దుకాణంలోకి ఒక్కరైనా తొంగి చూస్తున్న పాపాన పోవడంలేదు. ఏడాది క్రితం కాసాని జ్ఞానేశ్వర్ ప్రారంభించిన 'మనపార్టీ' ఎదుగూబొదుగూ లేదు. టి.ఆర్.ఎస్. నుంచి సస్పెండై టి.ఆర్.ఎస్. (ఎన్) పెట్టుకున్న నరేంద్ర ఇప్పుడు శిబిరాలు వెతుక్కుంటున్నారు. రెండేళ్ల క్రితం నానాయాగి చేసిన అక్క రాములమ్మ 'తల్లి తెలంగాణ' అడ్రస్ ఏనాడో గల్లంతైంది. సి.పి.ఐ. ఎటూ తేల్చుకోలేక 'చిరు' కోసం పడిగాపులు కాస్తూ, అవసరమైతే 'చేయి' అందుకునేందుకైనా సిద్ధపడుతోంది. చారిత్రక తప్పిదాలపై ఆజన్మాంతర పేటెంట్లు పొందిన సి.పి.ఎం. నందిగ్రాం దెబ్బనుంచే కాదు, ముదిగొండ ఘాతం నుంచి కోలుకోక ముందే 'అణు' దెబ్బకు అణగారి శక్తికోల్పోయింది. ఈ విధంగా రాష్ట్రంలో విపక్షాలు కుదేలవుతుండగా, కాంగ్రెస్ సింగపు దర్జా ఒలకబోస్తుందనడం అతిశయోక్తి కాదేమో. ◆

తీవ్ర విభేదాలకు దారితీసిన విషయం కూడా గమనార్హం. విశాలాంధ్ర కోసం పోరాడిన పార్టీపై ప్రాంతీయతత్వ ప్రాబల్యం సోకింది.

బి.జె.పి. బలం రాష్ట్రంలో గమనార్హం కాదు. ఆల్ ఇండియా పార్టీ గనుక రాష్ట్రంలోనూ నాయకత్వ స్థాయిలో దీనికి ప్రాచుర్యం ఉంది. అది అంత వరకే. ఎటొచ్చీ కాంగ్రెస్ – తెలుగుదేశం ముఖాముఖి తారసపడుతున్నాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌ను రాష్ట్రానికి తీసుకు రాగలిగాడు. బిల్‌గేట్స్ కూడా అలాగే వచ్చాడు. అందుకు ధీటుగా అమెరికా అధ్యక్షుడు బుష్ కూడా రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి హయాంలో వచ్చారు. వీరి రాకవలన రాష్ట్రానికి గ్లోబల్ ప్రాధాన్యత పెరగడం మాట అటుంచి, అమెరికా సానుకూలత కూడా ఉంది. ప్రపంచీకరణ, అణు ఒప్పందం, కాలుష్య సమస్యలలో అమెరికా పాత్ర వల్ల నిరసన మన రాష్ట్రంలో తక్కువే.

తెలుగుదేశం హయాంలో తలెత్తిన రైతుల ఆత్మహత్యలు, వర్షాభావం వల్ల కుంగిపోయిన వ్యవసాయదారులు, అశ్రద్ధకు గురైన పల్లెలు ఆ ప్రభుత్వాన్ని దెబ్బతీశాయి. యథాశక్తి ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ పాత్ర నిర్వహించారు. సరిగ్గా అదే స్థితిని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటోంది. రోడ్‌షోలు ఉభయులూ జరిపారు. జనాకర్షణ పథకాలు పోటీబడి ప్రకటించారు. కాని అధికారంలో ఉన్న పార్టీకి సహజంగా పెరిగే వ్యతిరేకతను ఎదుర్కోలేక పోతున్నారు.

కాంగ్రెస్ పార్టీ చరిత్ర రాష్ట్రంలో పునరావృతమైతే ఆశ్చర్యం లేదు. ఆ దిశగా సూచనలు కనిపిస్తున్నాయి. అధికారం నిలుపుకోడానికి కాంగ్రెస్ ఎటువంటి సంకీర్ణానికైనా సిద్ధంగా ఉంది. ఎన్నో సంక్షేమ పథకాలు, రుణమాఫీలు, రుణాలు అందించడం, నిరంతర ప్రచారాల మధ్య జరుగుతూనే ఉన్నాయి. ఇది అధికార పార్టీ ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు ముమ్మరంగా చేస్తోంది. అవన్నీ స్వీకరిస్తున్న ప్రజలు వైఫల్యాలను అనుభవిస్తూ ఆక్రందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం ఫలితంగా జనించే పరిమిత విద్యుత్తు సరఫరా, ధరల విపరీత పెరుగుదల ప్రభుత్వానికి, అధికార పార్టీకి దెబ్బగొట్టే సమస్యలు. ప్రస్తుతం ఆ కాండలో కాంగ్రెస్ కూరుకున్నది.

అధికారం మళ్ళీ చేబదదామనే ఏకైక ప్రత్యామ్నాయ పార్టీ తెలుగుదేశం రోడ్‌షోల యాత్ర వారికి ఒక సూచికగా మారింది. వెనుకబడిన తరగతుల మద్దతు, ప్రభుత్వ వ్యతిరేకత పెట్టుబడులుగా ఆ పార్టీ భావిస్తోంది. ఇటీవల ఉప ఎన్నికల సూచికను బట్టి వస్తున్న మార్పుల్ని అనుసరించి, తెలుగుదేశం కూడా సంకీర్ణ ప్రభుత్వం వైపుకే నడుస్తోంది. దేశ పరిణామాలు కూడా ఆ దిశగానే సాగుతున్నవి. తెలంగాణ సమస్య తలనొప్పిగా మారినా, సంకీర్ణమే మార్గాంతరంగా ఎన్నుకుంటున్నారు.

ఇలాంటి రాజకీయ పరిస్థితులలో కొత్త పార్టీతో ప్రజల్లోకి రావడానికి సినీ నటుడు చిరంజీవి ప్రయత్నాలు ఆరంభించారు. ఏర్పాట్లు, రంగప్రవేశం రీతులు గమనిస్తే, ఎన్.టి.ఆర్‌కు భిన్నంగా ఉన్నాయి. అయితే ఎన్.టి. రామారావు వలె అధికారం చేపట్టడం లక్ష్యంగా ఏర్పాట్లు సాగడంకద్దు. కొత్తపార్టీ యువతపై బాగా ఆశలు పెంచుకున్నది. కాపుకులం కూడా చిరంజీవి పార్టీకి అండగా నిలిచే లక్షణాలు వెల్లడవుతున్నాయి. దీనికి తోడు వామపక్షాలలో వివిధ దశలలో ఉంటూ వచ్చిన వారు కొందరు కొత్త పార్టీలో శిక్షణ కార్యక్రమాలు చేబట్టారు.

కొత్త పార్టీ అధికారికంగా ప్రకటించక పూర్వమే వివిధ పార్టీల రియాక్షన్ గమనార్హం. ప్రజలలో నాడిని బట్టి ఈ విధమైన సంకేతాలు వస్తున్నవి. ప్రస్తుతం ఉన్న రాజకీయ హింస, పార్టీల మార్పిడి, ప్రచారంలో దిగజారిన స్థాయి, ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యాలు కొత్తపార్టీకి ఎలా ఆయుధాలుగా మారతాయో చూడాలి.

వైఫల్యాలను శాస్త్రీయంగా విశ్లేషించి, మార్గాంతరాలను సూచించి, ప్రజల ముందుకు వచ్చిన లోక్‌సత్తాకు మీడియా ఆదరణ లభించింది. మేధావుల మెచ్చుకోలు కనిపించింది. బాగానే ఉంది అనే జనం కూడా ఆ పార్టీని గెలిపించడానికి ముందుకు రావడంలేదు.

రాష్ట్రంలో నక్సలైట్ తీవ్రవాదం ఓటర్లపై ప్రభావం చూపెట్టే అవకాశం లేదు. ఏ పార్టీ వచ్చినా నక్సలైట్ల పట్ల ఒకే ధోరణి అవలంబిస్తున్నాయి. మరోవైపు నక్సలైట్లు ఎన్నికలలో నిలుచునే అవకాశం లేనందున ప్రజలనాడి తెలిసే గీటురాయిలేదు.

తెలంగాణ రాష్ట్ర వాదం రాజకీయ పార్టీల చేతుల్లో రెండోసారి దెబ్బతిన్నది. మొదటి పర్యాయం చెన్నారెడ్డి నాయకత్వం కొట్టిన దెబ్బ నుండి తేరుకుంటున్న సమయంలో, చంద్రశేఖర్ రావు పాత్ర మళ్ళీ తెలంగాణ వాదాన్ని దెబ్బతీసింది. పార్టీల రాజకీయ మధనంలో సమస్య నలిగిపోయింది.

రాజకీయ ఒడిదుడుకులు తట్టుకొని, ప్రవహించే చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉంది. ప్రజలలో కాంగ్రెస్ వంశ పారంపర్యత పట్ల, దేశంలో వారి పాత్ర పట్ల కొంత మోజు ఉంది. కాంగ్రెస్ పార్టీ బ్రహ్మపదార్థం వలె దేనిలోనైనా యిమిడిపోయే తత్వం పెంచుకున్నది. అదేవారి బలం, బలహీనత కూడా. రాష్ట్రంలో సంకీర్ణం ఏర్పరచడానికి సైతం కాంగ్రెస్ వెనుకాడదు. తెలుగుదేశం అంతే. కొత్తపార్టీ ఆ ప్రవాహాన్ని దారి మళ్ళించేటంతగా పెరగగలిగితే గాని, మార్పు వచ్చే అవకాశం లేదు.

రాజకీయ పరిణామంలో అన్ని పార్టీలకు అంటుకున్న జాడ్యాలు గమనించాలి. ఎన్నికలలో డబ్బు ఖర్చు విపరీతంగా చేయడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, కులం, కొన్ని సందర్భాలలో మతం విచ్చలవిడిగా అడ్డం పెడుతున్నారు. సారాయి ప్రవహింపజేయడం ఒక అలవాటుగా మారింది. విలువలు లేని ఓట్ల ప్రహసనంలో, అవినీతిపరులైన అభ్యర్థుల్ని నిలబెట్టి, ఎలాగైనా గెలవడం ప్రధానమనే అంశాన్ని ముందుకు తెచ్చారు. ఇది దారుణ అంశం. దీని ఫలితంగా గాకున్నా చట్టసభలు అడ్డదిడ్డం గావడానికి, క్రమశిక్షణ ఏ మాత్రం పాటించక పోవడానికి దారితీసింది. ఇందుకు ఏ పార్టీ మినహాయింపు కాకపోవడం ఒక విషపరిణామమే.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కొత్త పరిణామం ఏమంటే, మతాన్ని రాజకీయ పార్టీలు వాడుకోవడం, చివరకు తెలంగాణ వంటి సమస్యలలో సైతం బాబాలు జోక్యం చేసుకునే దుస్థితికి దిగజార్చడం (సత్యసాయి బాబా తెలంగాణను వ్యతిరేకిస్తూ బహిరంగసభలో ప్రకటించారు), వర్షాలు రాకుంటే వరుణయాగం చేయించడం ఇత్యాదులు మామూలు అయిపోయాయి. అంటే ప్రజల మూఢనమ్మకాలను పార్టీలు అడ్డం పెట్టుకుంటున్నాయి. సెక్యులర్ రాజకీయం పక్కన బెట్టేశారు. (రామప్ప దేవాలయానికి భద్రాద్రి రాముడి గుడికి వెళ్ళి తెలంగాణ కోసం చివరకు గద్దర్ సైతం ఆరాధన చేయడం పరాకాష్ఠ).

రాజ్యాంగం పేర్కొన్న శాస్త్రీయ పరిశీలన పెంపొందించే విధిని పార్టీలు పక్కనపెట్టేశాయి. ◆

**ప్రజలలో రాజకీయపరమైన విభజన గతంకంటే ఇప్పుడు ఎక్కువగా ఉందనీ, బహుళపార్టీలూ, బహుముఖ పోటీలూ తప్పవని అంటున్నారు డా. కె. నారాయణ**

# రాజకీయాలలో మార్పులు, మలుపులు

ప్రాతఃకాలం చాలా ప్రశాంతంగా ఉంటుంది. అయితే అదే సమయంలో రణగొణ ధ్వనులతో సందడి సందడిగా ఉంటుంది కూరగాయల సంత. వినియోగదారులు మార్కెట్‌లోకి అడుగిడగానే లేత బెండకాయలు రెండు రూపాయలు, గుత్తి వంకాయ మూడు రూపాయలు, తాజా చంద్రగిరి తోటకూర కట్ట రూపాయి – ఇలా పోటీపడి కూరగాయల వ్యాపారులూరిస్తూనే ఉంటారు. మా కూరగాయలు చౌకంటే, మావే చౌకని గొంతులు చించుకుంటారు. అయితే వినియోగదారులు ఇవేమి పట్టనట్టు వారికి కావలసిన కూరగాయలు వారు కొనుగోలు చేసుకొని ఎంచక్కా వెళ్లిపోతుంటారు. నేనెంతోమందిని మురిపించి, మరిపించి బురిడీ కొట్టించాననుకొని వ్యాపారి ఆనంద పడతాడు. వ్యాపారుల బేరసారాల పోటీలో నేనే చౌకగా కూరగాయలు కొన్నాని వినియోగదారులు మురిసిపోతారు.

అది కూరగాయల మార్కెట్ – ఇటు రాజకీయ రంగంలో ప్రజల్ని తబ్బిబ్బుల్ని చేసి మైమరిపించి, ఆకాశానికెత్తి ఓట్లు కొల్లగొట్టడం ద్వారా రాబోయే ఎన్నికల్లో అధికారం మాదేనన్న గుండె ధైర్యంతో ఫోజులు కొట్టుకొంటూ డాంబికాలు పలికే ప్రధాన అధికార ప్రతిపక్షాలు హడలెత్తిస్తుంటే, ప్రజలు అందర్నీ ఆదరించినట్లు ఫోజులు పెడుతూ ఎవరి మనోభావాల ప్రకారం వారు ఓట్లు వేస్తాంలే అన్నట్టున్నారు.

మా మిత్రుడు కొత్తగా వకీలు వృత్తి చేపట్టాడు. వాడికి ఉత్తరం రాశాను. 'నూతనంగా న్యాయవాది వృత్తిలో చేరావు. నిజాయితీగా వృత్తి ధర్మం నిర్వహించు. మంచి పేరు వస్తుంది' అని. వాడు జవాబు రాస్తూ మేజిస్ట్రేట్ నన్ను ఒక కేసులో 'కమిషన్'గా నియమించి పంపారు. అయితే పార్టీలు ఇరువురూ నన్ను ప్రలోభాలలో పెట్టారు. ముడుపులిచ్చారు. రెండు పార్టీల వద్ద లంచం తీసుకున్నాను గనుక నాకు తోచిన పద్ధతుల్లో నివేదికిస్తా అని తెలిపాడు. అలా ఉందీనాడు ప్రజల పద్ధతి. ఒకే పార్టీవారు డబ్బులిచ్చినా, ప్రజాకర్షక పథకాలు ప్రకటించినా ప్రజలు కొంత మేరకు ఒకే పద్ధతిలో ఓట్లు వేసే వారేమో. అన్ని వైపులా కమ్ముకొస్తున్న లక్ష్మీకటాక్షంతో ప్రజలు వారి చిత్తమొచ్చినట్టు ఓట్లేస్తున్నారు.

2009కి రాష్ట్రం ఎటువైపు? యథాతథం కోసం కాంగ్రెస్ పార్టీ యావచ్ఛక్తినీ ఉపయోగిస్తోంది. 'అసలే కోతి – కల్లుతాగింది – ఆపై నిప్పు తొక్కింది'. కోతి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 'అసలే కాంగ్రెస్ పార్టీ – ఎంతయినా తెగించే వై.ఎస్.ఆర్. – అధికారం – అర్థబలం – అంగబలం' ఇక ఎదురేముంది? ప్రజా సంక్షేమ పథకాలు – ప్రజాకర్షక పథకాల ప్రకటనలు – రాష్ట్ర బడ్జెట్‌ను సైతం ఎన్నికల కోణంలో మలుపు తిప్పారు. ఇక గెలుపెక్కడికి పోతుంది? ఇది అధికార పార్టీ ధీమా.

'ప్రజా వ్యతిరేకత' సహజంగా ప్రభుత్వంపై ఉంటుంది. దీనిపైనే ఆధారపడాలనేది టి.డి.పి. వైఖరి గతంలో. ఇప్పుడు అది ఒక్కటే సరిపోదు. 'ముందు మిత్రులను సమీకరిద్దాం', దానికితోడు సంక్షేమ పథకాలు ప్రజాకర్షణగా బరితెగించి ప్రకటించడం. టి.డి.పి. అధికారంలో ఉండగా కిలో బియ్యం రు. 2 నుండి రు. 3.50, చివరకు రు. 5 వరకు తీసుకెళ్లింది. బ్రాంది షాపులను బెల్టు షాపులుగా విస్తరింపజేసింది. కరెంట్ చార్జీలను ప్రజల కందకుండా పెంచింది. వ్యవసాయరంగాన్ని చిన్న చూపు చూసింది టి.డి.పి.నే ఆనాడు. అయితే 'పరిపూర్ణ జ్ఞానోదయం' తో అన్నీ తిరగరాసి ప్రకటిస్తోంది. అది కూడా చాలదు గనుక ప్రజలతో ఉందాం అని 150 రోజుల రాజకీయ పర్యటనలో బిజీగా ఉంది.

తెలంగాణ పేరుతో జపం చేస్తూ కాలం గడుపుకుంటున్న టి.ఆర్.ఎస్. ఉప ఎన్నికలలో చతికిలపడ్డాక తోడును వెతుక్కునే పనిలో నిమగ్నమైంది. రాజకీయాలలో నూతన విప్లవం తేవాలనే (ఆర్థిక విషయంలో కాదు) ప్రచారంతో లోక్‌సత్తా సన్నాహాలు చేస్తుండగా, వామపక్షాలు ప్రజాందోళనలో తీరిక లేకుండా శ్రమిస్తున్నాయి.

నూతనంగా రాజకీయ రంగప్రవేశం చేయాలని గత ఆరు నెలలుగా చిరంజీవి సస్పెన్స్ మెయిన్‌టైన్ చేస్తున్నారు. త్వరలో ప్రచార రంగంలోకి రావడం, మూఢం పోయాక పార్టీ పేరు ప్రకటించడం జరుగుతుందని అభిజ్ఞవర్గాల వెల్లడి.

2009 ఎన్నికలలో సంప్రదాయ పద్ధతిలో యథాతథస్థితిలో లేదా మార్పుల వరకే పరిమితం కావాలా? అంతకన్నా అతీతంగా నూతన రాజకీయ విధాన చొరవ చేయాలా? అనేది సి.పి.ఐ. ప్రయత్నం. కొత్త – కొత్త కోసం కాదు. రెండు పార్టీల గత పాలనలు చూశాక నూతన రాజకీయ విధానం ఎందుకు సాధించకూడదు? దానికి భౌతిక పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయా? అనేది సి.పి.ఐ. పరిశీలిస్తున్నది. ఇదెక్కడ సాధ్యం అని కొట్టిపారేసే రాజకీయవేత్తలు, విశ్లేషకులు లేకపోలేదు. అయితే ప్రజలలో, ఇష్టం లేకపోయినా కలిసి కాపురం చేద్దాం అనే ధోరణి విధిలేని పరిస్థితిలా ఉండగా, 'విధిలేని పరిస్థితి' అన్న పదానికి ఊపిరిపోయడానికి ప్రయత్నిస్తే భౌతిక పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయనేది సి.పి.ఐ. భావన.

ప్రతి ప్రయత్నం అనుమానంతో ఆగిపోవడం కన్నా 'కష్టే –

ఫలి' అన్నట్టు పట్టుదలతో ప్రయత్నిస్తే తప్పులేదు కదా? ప్రజల్ని అనుమానపడడమో – ప్రజల్ని తప్పుపట్టడమో సులభం. తగిన పద్ధతుల్లో ప్రయత్నిస్తే తప్పక ప్రజలాదరిస్తారనేది మా నమ్మకం. ఆ నమ్మకం ఎన్ని దఫాలు విఫలమైనా అంతిమంగా జయప్రదం అవుతుంది. పార్టీల తరఫునగానీ, ప్రభుత్వం తరఫున గానీ ప్రకటించే ప్రజాకర్షక పథకాలకు ఆర్థిక వనరులెక్కడి నుండి వస్తాయి? ఆయా పార్టీల – ఆయా నాయకుల వ్యక్తిగత, కుటుంబ ఖజానాల నుండి రావు. ప్రజలపై వేసే పన్నుల భారం నుండి సమీకరించిన నిధులే 'పానకాలస్వామి' వేషంలో సమారాధన ఉంటుంది తప్ప మాయలఫకీరు మంత్రాలతో రావు. ప్రభుత్వం ప్రకటించే ప్రజాసంక్షేమ పథకాలకన్నా సామాన్య ప్రజలకు మౌలిక సదుపాయాలు, శాశ్వత విధానాలపై చైతన్యం కల్గించగలిగితే పాలకవర్గాల ప్రజాకర్షక నినాదాల బండారం బహిర్గతమవుతుంది. ఆ దిశగా ప్రజల్ని చైతన్యవంతం చేయగలిగిన విధానాలు వామపక్షాల కున్నాయి. అయితే వాటి శక్తి ఇంకా సరిపోవడంలేదు. అందుకు ప్రధానంగా పాదార్థికమేగాక, ప్రచార సాధనాల అందుబాటు కూడా వామపక్షాలకు అండగా లేకపోవడమూ కారణం.

ప్రచార సాధనాలపై పట్టు బూర్జువా వర్గానికే ఉంది. అది సామాజిక మార్పుకు ప్రధాన అడ్డంకి కూడా. వామపక్ష పార్టీలు ప్రచార సాధనాలపై కేంద్రీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందులో భాగమే విశాలాంధ్ర. అభివృద్ధికి చేసే ఈ కృషి కష్టసాధ్యమైనా సాధించాల్సిన లక్ష్యం దిశగా భవిష్యత్ మార్గాలెంపిక చేసుకోవాలి.

2009లో సాధారణ ఎన్నికలొస్తాయా? లేక నవంబర్‌లోనే సాధారణ ఎన్నికలొస్తాయా అన్న మీమాంసపై చర్చలు జరుగుతున్నాయి. ఎన్నికలు – ఎత్తులు – పొత్తులపై ఒక స్పష్టత రాలేదు. కాంగ్రెస్‌ను ఒంటరి చేయాలనే ప్రతిపాదన బాగున్నా – వ్యతిరేక పక్షాలన్నీ ఒక గూటికి వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. దానికి కారణం – రాజకీయ విభజన ప్రజలలో గతం కంటే ఇప్పుడెక్కువగా ఉంది. బహుళపార్టీలు – బహుముఖ పోటీలు తప్పవు. ఎక్కువ సమయం ఇవ్వకుండా త్వరలో ఎన్నికలు పెట్టాలనే ప్రతిపాదన ఒకవైపు ఉండగా – కేంద్ర రాజకీయాల్లో అణు ఒప్పందం తదితర అంశాలపై ఒత్తిడి, ప్రజా సమస్యలు, ప్రజలపాలిట శాపంగా మారిన ధరల పెరుగుదల సమస్య మరోవైపు పీడిస్తున్నాయి. ప్రజలలో స్పష్టత కనబడుతున్నది. నూతన రాజకీయ ఒరవడి వస్తే మంచిది. గత టి.డి.పి. పాలన, ఇప్పటి కాంగ్రెస్ పాలనపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. అలాంటి చర్చలు రావడానికి టి.డి.పి. గత పాలనలో అమలుపరచిన విధానాలకు భిన్నంగా మద్యపానం – చౌక బియ్యం – విద్యుత్ చార్జీలు, వ్యవసాయాభివృద్ధిని గురించి ఏకరవు పెడుతుండగా – నీవు చేసిన పనే కదా మేము కొనసాగిస్తున్నది అని ఎద్దేవా చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ.

మద్యంపై గత ప్రభుత్వ విధానాన్నే మేము కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి చెబుతుంటే, నా పాలనలోని ఆర్థిక విధానాల ఫలితమే ఈనాడు రాష్ట్రానికి ఆదాయం వస్తున్నదని టి.డి.పి. అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వాపోతున్నారు. ఆ విధానాలకు వ్యతిరేకంగానే ఆనాడు వామపక్ష పార్టీలు సుదీర్ఘ పోరాటం సాగించాయి. బషీర్‌బాగ్‌లో ముగ్గుర్ని పోగొట్టుకున్నాం.

కోనేరురంగారావు కమిటీ 38 లక్షల వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఒక ఎకరం చొప్పున భూమి ఇవ్వడానికి అవకాశముందని స్పష్టీకరిస్తే – కనీసం దానిని అమలు పరచమని కోరినందుకు ముదిగొండలో ఏడుగుర్ని పోగొట్టుకున్నాం.

ఆనాటి బషీర్‌బాగ్ ఘటనలపై అప్పటి ప్రతిపక్ష నాయకుడు స్పందించి – ముఖ్యమంత్రి అయ్యాక బషీర్‌బాగ్‌లో మృతవీరుల స్థూపావిష్కరణకు అవకాశమిచ్చాడు.

ముదిగొండ కాల్పుల ఘటనపై మాజీ ముఖ్యమంత్రి – ఈనాటి ప్రతిపక్ష నాయకుడైన చంద్రబాబు నాయుడుగారు గళమెత్తి నినదించారు. ఏ రాయి అయితేనేమి పళ్లూడగొట్టుకోవటానికి, ఏ పాలనలోనయినా వామపక్ష కార్యకర్తలే బలవుతున్నారు కదా! మరి దానికి మౌలిక పరిష్కారం లేదా? మౌలిక పరిష్కారం, తక్షణం – దీర్ఘకాలికంగా పరిగణించాల్సి వస్తున్నది.

తెలంగాణ సాధనే ఏకైక పరిష్కారమని సర్వరోగాల నివారణకు ఒకే మందని టి.ఆర్.ఎస్. జపం చేస్తున్నది. ప్రజల సమస్యలు పట్టడంలేదు. తెలంగాణ అంశం అన్ని రాజకీయ పార్టీలలోను చిచ్చురేపుతున్నది. సందట్లో సడేమియా అన్నట్టు 'చిరంజీవి' పేరుతో రాజకీయ పార్టీగా అవతరించడానికి సినిమా ఫక్కీలో సస్పెన్స్. రాజకీయ పార్టీలలో సైతం మౌలిక మార్పులు జరిగే పరిస్థితి కనిపిస్తున్నది. మొత్తానికి ఎన్నికలు దగ్గరపడే కొద్దీ రాజకీయ పార్టీలలో మార్పులు, ప్రజలలో మార్పు – నూతన రాజకీయ విధానం చోటుచేసుకోవడానికి భౌతిక పరిస్థితులు అనుకూలంగా కనబడుతున్నాయి.

ఇటువంటి రాజకీయ వాతావరణం నేపథ్యంలో 2004లో జరిగిన రాజకీయ పరిణామాల కన్నా భిన్నంగా మార్పులు జరుగుతాయి. భిన్న రాజకీయ పార్టీలు – భిన్న పోటీలతో రాబోయే రోజులలో నూతన రాజకీయ ధృక్పథం ఏర్పడబోతోంది. మారుతున్న రాజకీయ విధానాన్ని కమ్యూనిస్టులు సునిశితంగా పరిశీలించి తగిన ఎత్తుగడ వేయగలిగితే వామపక్షాలకు కూడా మేలు జరుగుతుంది. అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మా భావన.

ఇక్కడే, ప్రచార సాధనాలు, నూతన రాజకీయ వ్యవస్థకు దోహదం చేస్తాయా? పాత విధానాలకే కట్టుబడి ఉంటాయా? అనే అనుమానం వస్తుంది. అయితే ప్రచార సాధనాలలో కూడా విప్లవాత్మక మార్పులొస్తున్నాయి. ఆ మార్పు మౌలికంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఆ మార్పులను కూడా వామపక్షాలు సద్వినియోగం చేసుకునే స్థాయికి ఎదగాలి. ◆

***రాజకీయ మార్పులు ఎలా ఉన్నా అన్ని రాజకీయ పార్టీల అభివృద్ధి నమూనా ఒకటేనని, సంక్షోభంలో ఉన్న కోట్లాది గ్రామీణ ప్రజలే రాజకీయాలను మారుస్తారని అంటున్నారు ప్రొ. జి. హరగోపాల్***

# ఆంధ్రప్రదేశ్‌లో మారుతున్న రాజకీయాలు

సమకాలీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో ఐదు రకాల మార్పులని మనం గమనించవచ్చు. ఒకటి, కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా ఎన్ని కుమ్ములాటలున్నా ఇంకా పార్టీ చీలిపోకుండా నిలబడడం; రెండు, తెలుగుదేశం పార్టీ ఒకరకమైన చీలికలకు గురికావడం; మూడు, తెలంగాణ రాష్ట్ర సమితి బలహీనపడడం, ఈ లక్ష్యంతో మరొక పార్టీ ఆవిర్భావం; నాలుగు, చిరంజీవి నాయకత్వంలో కొత్తపార్టీ ఎప్పుడైనా ఏర్పడవచ్చున్న బలమైన ఎదురుచూపులు; ఐదు, ప్రజా ఉద్యమాలు, వ్యవస్థలో పార్లమెంటరీ చట్రానికి బయట సంస్కరణలు కావాలనే కోరిక నుండి మొత్తం వ్యవస్థ పునాదులను ప్రశ్నిస్తున్న రాజకీయాలు కొనసాగడం. ఈ ఐదు ధోరణులలో ఏది ఎక్కువ మద్దతును సాధించగలదు, ఎవరు ఎక్కువ సామాజిక శక్తులను సమీకరించగలరన్న అంశాల మీద రాష్ట్ర రాజకీయాలు ఆధారపడి ఉన్నాయి. వీటికి మించి ఆర్థిక రంగంలోని స్వప్రయోజన శక్తులు ఈ భిన్నమైన పార్టీలను తమ మధ్య ఎలా ఎంచుకుంటారో, పంచుకుంటారో కూడ అర్థం చేసుకోవలసి ఉంటుంది.

కాంగ్రెస్‌పార్టీ సాధారణ పరిస్థితిలో ఓడిపోవలసిందే. ఇంతవరకు మొత్తం దేశంలో ఒకటి రెండు ప్రాంతాలకు మినహాయిస్తే, ఎక్కడా కూడ గత రెండు మూడు దశాబ్దాలోను అధికారంలో ఉన్న పార్టీ గెలవలేదు. రాష్ట్ర రాజకీయాల్లో వస్తున్న మార్పుల్లో కాంగ్రెస్ పార్టీ ఎందుకు విభజన జరిగి చీలిపోలేదన్నది చాలా ప్రధానమైన అంశం. దీనికి తెలంగాణలోని కాంగ్రెస్ నాయకులలో పదవుల బలహీనతలకు తోడుగా, ఎప్పుడో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అంగీకరించ వచ్చునే మిణుకు మిణుకు భావన ఉంది. అలా జరిగితే తమలో ఎవరో ఒకరికి, లేకపోతే ప్రతి వారికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందన్న ఆశ ఒకటి వీళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగడానికి కారణమయ్యింది. ఈ రాజకీయ నాయకులెవ్వరికి కూడా స్వతంత్రంగా ప్రజాబలం కాని విస్తృత గౌరవం కాని లేవు. ఇదే కాక చంద్రబాబు ప్రపంచీకరణ విధానాల వలన, ఆయన తీసుకున్న ప్రజావ్యతిరేకమైన నిర్ణయాలవలన ఎంత ప్రయత్నించినా ఆయన పట్ల విశ్వసనీయత ప్రజలకు కలగడం లేదు. దాంతో ఆయన కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తున్న ప్రజాకర్షక కార్యక్రమాలను మరింత ఆకర్షవంతంగా చేయడం తప్ప ప్రత్యామ్నాయం ఏదీ ఆలోచించలేక పోతున్నాడు. దీనికి తోడు కాంగ్రెస్ ప్రవేశపెట్టిన వృద్ధుల పెన్షన్, రెండు రూపాయలకు కిలో బియ్యం, గ్రామీణ ఉపాధి హామీ పథకం, రైతుల రుణాల మాఫీ, ఉచిత విద్యుత్ ఎంత కాదన్నా గ్రామీణ పేద ప్రజలకు కొంత ఊరట కలిగించినట్లు నా పరిశీలన ద్వారా తెలుస్తున్నది. పేదరికంలో మగ్గిపోయిన వారికి తాత్కాలిక ఉపశమనం కూడా చాలా ఊరటనిస్తుంది. ఈ వాస్తవాలు కాంగ్రెస్‌ను కొంతవరకు నిలబెడుతున్నాయి. వీటన్నింటిని మించి ఏ సమస్య మీద కూడా స్పష్టమైన విధానాలు లేకపోవడం వలన దేవుడి భిన్న అవతారాల వలె ప్రతివారికి కాంగ్రెస్‌పార్టీ తాననుకున్నట్లుగా దర్శనమిస్తుంది. ఇది గాంధీజీ కాలంనుండి వచ్చిన వారసత్వం. ఒక బహువర్గ సమాజంలో ఇలాంటి ప్రక్రియ భిన్నవర్గాలను, ఏ విధమైన సైద్ధాంతిక సారూప్యం లేని వ్యక్తులను కూడా కప్పలను ఒక బుట్టలో కలిపి ఉంచినట్లుగా ఉంచగలుగుతున్నది. అవకాశం వస్తే ఈ కప్పలు ఎప్పుడైనా బయటకు దూకవచ్చు.

మొత్తంగా ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు కూడా అధికారంలో ఉన్న పార్టీకి కొంత వెసులుబాటును కల్పించాయి. స్థూల జాతీయ ఆదాయం దాదాపు ఎనిమిది శాతం పెరగడం వలన అటు జాతీయ స్థాయిలో, ఇటు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఆదాయాలు చాలా పెరిగాయి. మన రాష్ట్ర బడ్జెట్ ఈ సంవత్సరం దాదాపు రెట్టింపు అయ్యింది. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడున్న మూడు లక్షల డెబ్బైవేల కోట్ల బడ్జెట్ ఇప్పుడు ఏడు లక్షల యాభై కోట్లకు చేరుకున్నది. చిదంబరం ఉన్నత వర్గాలకు రాయతీలు ఇవ్వకపోతే ఈ బడ్జెట్ పది లక్షల కోట్లకు చేరుకునేది. ప్రభుత్వ ఆదాయాలు పెరగడం వలన అధికార పార్టీలో ఉండే ప్రజా ప్రతినిధులందరు ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలా ప్రయోజనాలు పొందుతున్నారు. ఏ సామాజిక లక్ష్యం కాని, ఆదర్శాలు కాని లేని ప్రతినిధుల మీద పెరుగుతున్న నిధులు 'అమృతం'లాగా పని చేస్తున్నాయి.

రాజశేఖరరెడ్డి రాయలసీమ ఫ్యాక్షనిజం నుండి పొందిన అనుభవం వలన, కాంగ్రెస్ సభ్యులను నయానా భయానా నియంత్రించగలుగుతున్నాడు. ఎక్కువ అల్లరి చేసిన వారిని రాజకీయంగా చాలా ఇబ్బందుల్లో పెట్టగలుగుతున్నాడు. వాళ్ల వాళ్ల బలహీనతలను బట్టి బెత్తం లేదా బెల్లం ఉపయోగించగలుగుతున్నాడు. కాంగ్రెస్ పార్టీలో ఆయనకిక ప్రత్యామ్నాయం లేదన్న అభిప్రాయం పార్టీ అధిష్ఠానం దగ్గర కలిగించగలిగాడు. వ్యక్తిగతంగా మనుషులను గౌరవించగలడు కాని మాట్లాడే పద్ధతి ద్వారా కాని ఆయన ఏ వ్యక్తి మన్ననలను పొందలేదు. కాని అధికారమన్నదానికుండే బలమే మన వ్యవస్థలో చాలా పని చేస్తుంది.

మొత్తం రాజకీయ మార్పుల్లో బాగా దెబ్బతిన్న మనిషి చంద్రబాబు నాయుడు. ఆయన వ్యక్తిగత ప్రవర్తన కూడా రాజశేఖరరెడ్డి కంటే అంత భిన్నంగా ఉండదు. అయితే ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆ నమూనా పని చేయదు. ఆయన నాయకత్వాన్ని మీడియా జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విపరీతంగా పెంచి పోషించింది. కాని మీడియాకే విశ్వసనీయత తక్కువ. ప్రజల నాడి నుండి మీడియా చాలా దూరం ఉంది. చంద్రబాబు ప్రజల్లో తిరిగి విశ్వాసాన్ని పొందడం ఆలస్యమైన కొద్ది ఆయన పార్టీలోని ప్రముఖ నాయకులు తమ దారిని తాము చూసుకుంటున్నారు. పార్టీ నాయకుణ్ని కాదని ఎదురు తిరిగింది చంద్రబాబే. ఎన్.టి.ఆర్. లాంటి నాయకుణ్నే కాదన్నప్పుడు ఆ సంస్కృతి, విలువలు, వారసత్వం పార్టీలో తప్పక కొనసాగుతాయి. నిజానికి పార్టీ నుండి బయటకు వచ్చిన వాళ్లంతా చంద్రబాబు గురించి మాట్లాడుతున్న తీరు చంద్రబాబు పాత రోజుల్ని గుర్తుకు తెస్తున్నాయి. రాజకీయాల్లో బలమైన విలువలకు నిలబడ్డప్పుడే ఆ విలువలు పార్టీలను కాపాడుతాయి. అలాంటి విలువలు ఏ పార్టీలో కూడా లేవు. తెలుగుదేశం పార్టీలో అవి అడుగంటి పోయాయన్నది ఒక రాజకీయ వాస్తవం.

తెలుగుదేశం పార్టీకి చాలా బలాన్నిచ్చింది తెలంగాణ ప్రజలు, అలాగే మొత్తం రాష్ట్రంలోని వెనకబడిన తరగతులు. చాలా కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఒకే బలమైన వర్గానికి ప్రాముఖ్యత నివ్వడం వలన, ఆ నాయకుల భూస్వామ్య ప్రవర్తన వల్ల వెనకబడిన కులాలలో ఏదో ఒక స్థాయిలో దానికి వ్యతిరేకమైన చైతన్యాన్ని పొందుతూ వస్తున్నారు. సంఖ్యా బలంలో అతి ప్రధానమైన ఈ కులాలు, తరగతులు ప్రత్యామ్నాయాన్ని వెతుకుతున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. అందుకే తెలుగుదేశం పార్టీ ప్రధాన సామాజిక మద్దతుదార్లు వెనకబడిన కులాలు. అయితే ఈ రెండున్నర దశాబ్దాలలో ఈ వర్గాల బలంపెరిగింది. ఆర్థిక స్తోమత బలపడింది. నాయకత్వంలో ఎదిగారు. రాజ్య అధికారంలో వాటాయే కాదు, తాము నాయకత్వ స్థానంలో ఎందుకు ఉండకూడదన్న ప్రశ్న ముందుకు వచ్చింది. ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలలో ఈ తరగతుల ఆకాంక్షలు బలమైనశక్తిగా పెరిగి రాజకీయాల తీరు తెన్నులను మార్చే దాకా ఎదిగాయి. దేవేందర్‌గౌడ్ కానీ, చిరంజీవి కానీ ఈ మార్పులో నుండి పుట్టిన, పుదుతున్న ప్రత్యామ్నాయాలే. ఇంకా రాబోయే కాలంలో ఈ నూతనంగా ఎదిగిన రాజకీయ శక్తులే చాలా కీలకమైన పాత్ర నిర్వహించనున్నారు.

ఇక తెలంగాణ రాజకీయాలు చాలా ఎగుడు దిగుడులకు గురౌతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలు ఎదుర్కొంటున్న సవాళ్లే టి.ఆర్.ఎస్. ఎదుర్కుంటున్నది. తెరాస అధినేత కూడా ఇతర ప్రధాన నాయకుల లక్షణాలే కలిగి ఉన్నాడు. ఆ రాజకీయ స్రవంతి నుంచి వచ్చిన వాడే కనక భిన్నంగా ఉండడం కష్టం. అయితే ఉద్యమాలను నడపడానికి ఆ నాయకత్వ తీరులు రీతులు పనికిరావు. ఉద్యమ నాయకత్వం నిరంతరంగా ప్రజల పరీక్షకు గురౌతుంది. వాళ్లను ప్రజలు మరీ దగ్గరా, తీక్షణంగా చూస్తుంటారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ ఆలస్యం అయిన కొద్దీ నాయకత్వం మీద విశ్వాసం సన్నగిల్లుతుంటుంది. అలాంటి ప్రక్రియను ఆపాలంటే ప్రజల నిరంతర సమీకరణ ఉండాలి. ఉద్యమం సజీవంగా ఉండాలి. అలా ఉంటే నాయకత్వం చారిత్రకస్థాయికి చేరుకుంటుంది. తెరాస ఎన్నుకున్న మార్గంలో ఉద్యమస్ఫూర్తి లేదు. ప్రజల సజీవపాత్రలేదు. అందుకే పార్టీ అతితక్కువ సమయంలో బలహీనపడింది.

ఈ రాజకీయ మార్పులు ఎలా ఉన్నా, సమీకరణలు ఏ పద్ధతిలో జరిగినా, అన్ని రాజకీయ పార్టీల అభివృద్ధి నమూనా ఒకటే. ప్రపంచీకరణను, అభివృద్ధి నమూనాను వ్యతిరేకిస్తున్న ఒక్క రాజకీయ పార్టీ కూడా మన రాష్ట్రంలో లేకపోవడం ఒక విషాదం. సి.పి.ఐ., సి.పి.ఎం. పార్టీలు ఒక మేరకు ఈ నమూనాను వ్యతిరేకించినా దానికి విస్తృత ప్రజా బాహుళ్యాన్ని, ఏ స్థాయిలో సమీకరించాలో ఆ స్థాయిలో సమీకరించలేకపోయారు. వామపక్ష పార్టీలు అణు ఒప్పందాన్ని వ్యతిరేకించడం ఒక చారిత్రక ప్రాధాన్యత కలిగిన అంశమే. కాని దీని గురించి తెలుగు ప్రజలను చైతన్యీకరించడంలో విఫలమయ్యారు. ప్రజలను ఆ విషయంలో చాలా ఎడ్యుకేట్ చేయవలసింది. కాని అది జరగలేదు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో ప్రపంచీకరణ విధానాలను ఒక స్థాయిలో అంగీకరిస్తున్నారన్నది ఆంధ్ర వామపక్ష పార్టీల విశ్వసనీయతను దెబ్బతీసింది. ముఖ్యంగా నందిగ్రాం, సింగూర్ ఆ పార్టీలను చాలా ఇబ్బందికి గురిచేశాయి. ఏ కారణం వల్లైతేనేమీ వామపక్ష పార్టీలు ప్రధాన పార్టీల స్థాయికి ఎదగలేక పోయాయి.

ఇప్పుడు పార్లమెంటరీ ప్రజాస్వామ్య చట్రపు సామాజిక పునాది లంపెన్‌వర్గం కావడంతో, ఎవరు అధికారానికి వచ్చినా బలప్రయోగం ద్వారా పాలన, చట్టబద్ధత లేకపోవడం, ప్రజా సంస్థలు ఏవీ గుణాత్మకంగా పని చేయకపోవడం జరుగుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల సంస్కృతి సంపూర్ణంగా మాఫియామయమై రాజకీయాలంటేనే ప్రజలు విసుక్కునే పరిస్థితి వచ్చింది. జాతీయ స్థాయిలో కూడా అణు ఒప్పందం మీద జరిగిన చర్చ, దాంట్లో భాగంగా ముందుకు వచ్చిన అవినీతి ఆరోపణలలో ఈ మాఫియా వర్గవ్యాప్తిని చూడవచ్చు. ఈ సంస్కృతిని కొంతవరకు వ్యతిరేకిస్తూ ముందుకు వచ్చిన పార్టీ లోక్‌సత్తా. అయితే లోక్‌సత్తాకు కూడా నూతన ఆర్థిక విధానం పట్ల కాని, అభివృద్ధిపంథా మీద కాని మౌలికమైన వ్యతిరేకత లేదు. నూతన ఆర్థిక విధానాన్ని, మార్కెట్ ఆధారిత ఆలోచనలను వ్యతిరేకించకుండా లోక్‌సత్తా తాననుకున్న లక్ష్యాలను చేరడం సాధ్యంకాదు.

పార్లమెంటరీ చట్రం బయట జరుగుతున్న ఉద్యమాల పట్ల ఏ రాజకీయ పార్టీకి కూడా అవగాహన లేదు. మావోయిస్ట్ రాజకీయాలను అందరూ శాంతిభద్రతల సమస్యగా చూస్తున్నారు. శాంతి చర్చల సందర్భంలో వామపక్ష పార్టీలు వాళ్లతో మాట్లాడను కూడా మాట్లాడలేదు. చారిత్రకమైన శాంతి చర్చలను నీరుగార్చి రాష్ట్ర పాలకవర్గాలు ఒక చారిత్రక అవకాశాన్ని కోల్పోయాయి. అయితే రాజకీయంగా ఈ ఉద్యమాలు కొన్ని మౌలికమైన ప్రశ్నలను ముందుకు తీసుకువచ్చాయి. అవి ప్రజాస్వామ్య హక్కులు, భూ పంపిణీ, స్వావలంబన, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు. ఈ ప్రశ్నలన్నీ చాలా ప్రధానమైనవి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యావసాయిక సంబంధాలు మారకుండా సజీవమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణం కష్టం. ఈ నిత్యజీవిత సమస్యలు, చదువుకున్నవారి నిరుద్యోగిత, వ్యవసాయ సంక్షోభం రాజకీయాలను చాలావరకు నిర్దేశిస్తున్నాయి. రేపటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతే ఈ కారణాలవల్లే ఓడిపోతుంది. ప్రత్యామ్నాయ పార్టీలు పుడితే ఈ సంక్షోభంలో నుండే పుడుతాయి. కోట్లాది గ్రామీణ ప్రజలే రాజకీయాలను మారుస్తారు. వాళ్ల చైతన్యస్థాయిని సరిగా అంచనా వేయగలిగితేనే రాష్ట్రంలో మారుతున్న రాజకీయాలు అర్థమౌతాయి. ◆

*టివిల్లో వ్యాపార ప్రకటనలను నిర్దిష్ట సమయంలోనే చూపించాలనీ, వ్యాపార ప్రకటనలను నియమాలు అనుసరించాలనీ సూచిస్తున్నారు* **కున్వర్ సిన్హా**

# టి.వి. వ్యాపార ప్రకటనల నియమావళి

*'వార్తలా? అవే అడ్వర్టయిజ్‌మెంట్ల మధ్యన ఉంటాయే, అవేనా?'*
*– లార్డ్ థాంప్సన్*

ఒక చక్కటి కథాంశంతోను లేదా ఒక సీరియస్ డిస్కషన్ జరుగుతూ ఉండగానో లేదా ఉత్కంఠ భరితంగా సాగుతున్న క్రికెట్ మ్యాచ్ మధ్యలోను వ్యాపార ప్రకటనలు వచ్చి ఎంత ఇబ్బంది పెడతాయో తెలియంది కాదు.

కొంతకాలం క్రితం స్టీవ్ వా పి అలీ అనే ఒక ఆస్ట్రేలియా దేశస్తుడు మన టివి ప్రసార మాధ్యమాన్ని గురించి చెబుతూ 'ఇండియా టివి పూర్తిగా చూడదగినది కాదు' అని అన్నారు. ప్రేక్షకుల మనోభావాల్ని, కాలాన్ని, దృష్టిలో పెట్టుకొని టివి దృశ్యాల పవిత్రతను గురించి మాట్లాడాలి.

వ్యాపార ఛానళ్లకు కేవలం డబ్బు చేసుకోవడమే ధ్యేయం కాబట్టి వాళ్ల దురాశను కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. నాకు తెలిసినంతవరకు ఈ ప్రకటనల మీద ఖర్చు సుమారుగా సంవత్సరానికి పది కోట్ల రూపాయల వరకు ఉండవచ్చు.

ఎంత అయిన దూరదర్శన్ కూడ ఇటువంటి పోకడలు పోవడం చాలా దురదృష్టకరం. దూరదర్శన్ కేవలం ప్రజాసేవను ముఖ్యంగా ప్రజలలో విద్యావ్యాప్తి తెలియచేయడం, సంతోషపరచడం, ప్రజలను చైతన్యపరచడం లాంటి కార్యక్రమాలు నిర్వహించే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రారంభమైంది. దీనికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. అలా ఇరవై అయిదు సంవత్సరాలు సవ్యంగానే సాగింది.

ఒక సంతోషకరమైన విషయం ఏమిటంటే చాలాకాలంగా నడుస్తున్న, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బి.బి.సి., యు.కె.లో ఇంతవరకు ఒక వ్యాపార ప్రకటన కూడా ప్రసారం చెయ్యలేదు. అది ఎలా సాధ్యం అయ్యింది. కేవలం ప్రేక్షకులు చెల్లించే లైసెన్స్‌ల ఆదాయం మీద, ప్రపంచ వ్యాప్తంగా వాళ్ల ప్రోగ్రామ్స్ పై వచ్చే రాయిల్టీ మీద సాధ్యం అయ్యింది.

బ్రిటన్‌లోనూ యురోపియన్ దేశాలలోనూ వ్యాపార ఛానళ్లు ఒక నిర్దిష్టమైన 'ప్రకటనల నియామవళి'ని రూపొందించుకున్నాయి. బ్రిటన్‌లో ఈ నియామవళిని క్రమబద్ధీకరించటం కోసం ప్రత్యేకమైన, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈ కింది రెండు బాడీలు ఏర్పడ్డాయి.

1. ద అడ్వర్‌టైజింగ్ స్టాండర్డ్స్ అథారిటీ

ఈ బాడీ యు.కె. ప్రకటన పరిశ్రమ. ఇది ప్రకటనలను ఎలా క్రమబద్ధీకరించాలో చెబుతుంది.

2. ద ఆఫ్‌కామ్ (ఆఫీస్ ఆఫ్ కమ్యూనికేషన్)

ఇది నియామవళిని ఏ విధంగా ఎంత నిర్దిష్టంగా అమలు జరుగుతోంది అని నిరంతరం పరిశీలిస్తోంది.

సాధారణంగా ఈ నియామవళిలో అమలుపరిచేవి –

ఎ) ప్రకటనల నిడివి – రోజు మొత్తంలో ప్రకటనల నిడివి గంటకు తొమ్మిది నిమిషాలకు మించరాదు. అంటే ప్రసార సమయాలలో పదిహేను శాతం కాలం మాత్రం.

బి) గంటలో గరిష్ట నిడివి – ఏదైనా ఒక గంట ప్రసారంలో ప్రకటన నిడివి గరిష్టంగా పన్నెండు నిమిషాలకు మించరాదు. గంట ప్రసారంలో కేవలం మూడు నిమిషాలు గల నాలుగు వ్యాపార ప్రకటనలు ఉండవచ్చును.

ప్రోగ్రాంలు, వ్యాపార ప్రకటనలను నిర్దిష్టంగా విభజించాలి. టి.వి. వ్యాపార ప్రకటన ప్రత్యేకంగా ఉండి, మిగతా ప్రసార సేవలకు అడ్డుకారాదు. మామూలు ప్రోగ్రాం ప్రసారానికి వ్యాపార ప్రకటనకు వినికిడి విషయంలోను, దృష్టి విషయంలోను ప్రత్యేకంగా ఉండి, గుర్తించదగినదిగా ఉండాలి. సాధారణ ప్రోగ్రాం ప్రసార సమయంలో వచ్చే వ్యాపార ప్రకటనలు ఒక నిర్దిష్ట సమయానుసారం, ప్రసారానికి ఎటువంటి అంతరాయం లేకుండా, ప్రసారం అవుతున్న ప్రోగ్రాం విలువలు కాపాడగలిగేలా ఉండాలి.

ఆటల ప్రసార సమయంలో ప్రకటనలు కేవలం ఆయా విశ్రాంతి సమయాలలోనే ప్రసారం చెయ్యాలి. ఆట మధ్యలో వెయ్యరాదు. ప్రేక్షకుడికి తాను చూస్తున్నది వ్యాపార ప్రకటన లేదా ప్రోగ్రామా అన్నది నిర్దిష్టంగా తెలియాలి. చూస్తున్న కథాంశానికి, చూస్తున్న వ్యాపార ప్రకటనకు సంబంధం ఉండకూడదు.

వ్యాపార ప్రకటనలు నిషేధించబడిన ప్రసారాలు

1. అర్ధగంటకు పరిమితం అయ్యే వార్తా ప్రసారాల సమయం.
2. అర్ధగంట నిడివి గల డాక్యుమెంటరీ చిత్రాల నడుమ.
3. ఒక అంశం మీద చర్చ జరుగుతుండగా అందులో పాల్గొనే ప్రసంగ కర్తలు మారినప్పుడు లేదా ప్రసారం చేస్తున్న అంశం మారినప్పుడు మాత్రం బ్రేక్ తీసుకోవచ్చును. చర్చలో పాల్గొన్న ప్రసంగకర్త వ్యాపార ప్రకటనలో పాల్గొన్న వ్యక్తి ఒకరై ఉండరాదు.
4. వ్యాపార ప్రకటన – ప్రసారం అవుతున్న అంశాలకు ప్రేక్షకుడు సంశయంలో పడరాదు.

మన దేశ టి.వి. ఛానళ్లు పైన చెప్పిన నియమావళిని పాటించవు. ఉదాహరణకు – ఒక ఆటలో, ముఖ్యంగా క్రికెట్ ప్రసార

*ఉపాధ్యాయుడికి మంచి ఉపన్యాసకుడిలా తన ప్రసంగ అంశంపై పట్టు, స్పష్టత ఉండాలనీ, విద్యార్థుల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పాఠ్యాంశాన్ని బోధించాలనీ, మౌలిక అంశాలపై చర్చను ప్రోత్సహించాలనీ సూచించారు* **లియో హ్యూబర్‌మన్**

# భావ ప్రచారం ఎలా జరగాలి?

**1930**ల చివరిలో ఒకసారి నేను కార్మికోద్యమంలో పనిచేస్తున్న వారికోసం జరిగిన అధ్యయన తరగతిలో కూర్చున్నాను. ఆ కార్మికులకు కొత్త విషయాలు నేర్చుకోవాలనే కోరిక ఉన్నదనేది సుస్పష్టం. రోజంతా రెక్కలు ముక్కలైయ్యే పనిచేసి వచ్చి కూడా సాయంత్రాలు, రాత్రులు జరిగే ఆ అధ్యయన తరగతులకు వాళ్లు హాజరయ్యారంటేనే వాళ్ళకు ఆ కోరిక ఉందన్నమాట. అక్కడ పాఠం చెప్పిన ఉపాధ్యాయుడికి తాను చెపుతున్న విషయం చాలా బాగా తెలుసు. ఆయన ఉపన్యాసం అద్భుతంగా సాగడమే దానికి నిదర్శనం. కాని, విచిత్రంగా విద్యార్థుల కోరిక, ఉపాధ్యాయుడి అవగాహన కలిసి కూడా కావలసిన ఫలితాన్ని సాధించలేకపోయాయి. ఎందుకంటే ఆ పాఠం ఒక గంట కూడా గడవకముందే విద్యార్థులలో చాలామంది నిద్రపడ్డారు. అంతేకాదు, తరగతులకు వచ్చేవాళ్లు తగ్గిపోవడం మొదలైంది. మరునాటి తరగతికి సగం మంది విద్యార్థులే వచ్చారు. మూడో నాటికి నాలుగోవంతు మంది కూడా రాలేదు.

అమెరికాలో కార్మిక ఉద్యమంలో కార్మికులకు అవగాహన పెంపొందించే తరగతులన్నిటి అనుభవం దాదాపుగా ఇదే. కార్మిక ఉద్యమంలో కార్మికుల అవగాహన పెంచడం కోసం కేటాయించే నిధులను వాడుకోవలసి ఉందని కార్మిక సంఘ విద్యాశాఖ ప్రతినిధులు కోరగా పోరగా ఈ తరగతులు అయిష్టంగానే ఏర్పాటు అవుతాయి. కొన్నాళ్లు నడుస్తాయి. క్రమక్రమంగా వెనుకపట్టు పడతాయి. అప్పుడిక కార్మిక సంఘ నాయకుడు విజయం సాధించినట్టు 'చూడండి, కార్మికులకు నేర్చుకోవాలనే లేదు' అని ఫిర్యాదు చేస్తాడు. తన అనుభవంతో అప్పటికే నిరాశ పడిన ఉపాధ్యాయుడు కూడా ఆ మాట ఒప్పుకోక తప్పదు. కాని, ఈ నిర్ధారణ పూర్తిగా తప్పు. కార్మికులకు నేర్చుకోవాలని లేదనే మాట నిజం కాదు. అది ఎప్పుడూ వాస్తవం కాదు. ఈ వైఫల్యానికి కారణం ఏమంటే ఉపాధ్యాయుడికి ఎట్లా బోధించాలో తెలియదు.

ఈ అనుభవం కార్మిక సంఘ తరగతులకు మాత్రమే పరిమితమైనది కూడా కాదు. దాదాపు అన్ని విప్లవ బృందాలలోనూ ఇలాగే జరుగుతుంటుంది. వెనుకబడిన దేశాలలో ఇది మరీ ఎక్కువగా జరుగుతుంటుంది. అక్కడ చుట్టూ ఉన్న విప్లవ వాతావరణం వల్ల తరగతి గదులలోకి ఎంతో ఉత్సాహపరులైన కార్మికులు, రైతులు అంతకంతకూ ఎక్కువగా ప్రవేశిస్తుంటారు. కాని నిష్ఫలమైన బోధన వల్ల ఆ తరగతి గదులు అంత తొందరగానే ఖాళీ అయిపోతాయి.

అయితే ఇలా జరగడం తప్పనిసరి ఏమీ కాదు. కార్మికులు గానీ, రైతులు గానీ వాళ్లు అంతకుముందు ఎంత మాత్రమూ చదువు లేని వాళ్లైనప్పటికీ ఆ తరగతి గదులలో కొనసాగవచ్చు. కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. వాళ్లకు అందే బోధన మంచి బోధన కావల్సి ఉంటుంది.

మంచి బోధన అంటే ఏమిటి? ఇంతకుముందు మనం మాట్లాడుకున్న కార్మికులు తరగతిలో ఉపాధ్యాయుడు చేసిన పొరపాటు ఏమిటి? ఆయన ఉపన్యాసం మొదలుపెట్టాక పది నిమిషాలకు ఒక విద్యార్థి ప్రశ్న అడుగుతానని చెయ్యి లేపాడు. అది చాలా మంచి ఆలోచనాత్మకమైన ప్రశ్న. ఆ ఉపాధ్యాయుడు పొంగిపోయి తన భుజం తాను తట్టుకోవలసింది. తాను మాట్లాడడం మొదలుపెట్టి పది నిమిషాలు కాకముందే వింటున్నవారిలో ఆలోచనను ప్రేరేపించగలిగానని సంతోషపడవలసింది. వెళ్లి ఆ ప్రశ్న అడిగిన విద్యార్థిని కావాలించుకోవలసింది. కాని ఆ ఉపాధ్యాయుడు తత్తరపడ్డాడు. ఆయన

---

సమయంలో వచ్చే ప్రకటనలో ఆడే వ్యక్తి పాల్గొన్న వ్యాపార ప్రకటన నిషేధించాలి. ఆశ్చర్యం ఏమంటే ఒక ప్రేక్షకుడే కాదు ప్రకటన కర్తలు మారిపోతుంటారు. ప్రకటనలన్నీ కలగాపులగం అయిపోయి ఏది మొదలో, ఏది తుదో తెలియని పరిస్థితి వస్తోంది. ఈ అయోమయం పోవాలంటే ఒక నిర్దిష్టమైన నియమావళిని పాటించాలి. మన దేశఛానళ్లు అన్నీ కూడా ఒక నియమావళిని రూపొందించుకోవాల్సిన అగత్యం ఎంతైనా ఉంది.

ఇప్పటికే 'ద అడ్వర్‌టైజింగ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా' అనే సంస్థ ఉంది. ఇది ఇప్పటికైనా రూపొందించిన నియమావళిని సరిగ్గా పాటించేలా చెయ్యాలి. అంతే కాకుండా పైన చెప్పిన నియమావళిని నిర్దిష్టంగా పాటించేలా ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ ఒకటి ఉండాలి.

దీనికి తరుణోపాయం ఒక్కటే. ఈ వ్యాపార ప్రకటనల ప్రసారానికి విధిగా, ప్రత్యేకమైన సమయాన్ని కేటాయించాలి. ఇవి కేవలం టెలీ షాపింగ్‌కు, వ్యాపార ప్రకటనలు ఇచ్చే వార్తా పత్రికల అనుబంధానికి పరిమితం అయ్యి ఉండాలి.

('ఫ్రీడం ఫస్ట్' మాసపత్రిక నుంచి
అనువాదం - రంగారావు)

◆

ఎంతో జాగ్రత్తగా ప్రణాళిక ప్రకారం తయారు చేసుకున్న పాఠం సాఫీగా సాగిపోతుంటే అడ్డంకి వచ్చిందని బాధ పడ్డాడు. 'ఆ విషయానికి తరువాత వస్తాను' అని ఆ విద్యార్థి ఉత్సాహం మీద నీళ్లు చల్లాడు.

ఆ ఉపాధ్యాయుడు పొరపాటు ఎక్కడ ఉందంటే తాను చెపుతున్న పాఠ్యాంశం మీద మాత్రమే ఆయనకు దృష్టి ఉంది. కాని ఆయన దృష్టి విద్యార్థుల మీద ఉండవలసింది. ఆయన ఓ ఉపన్యాసకుడే కాని బోధకుడు కాదు. ఉపన్యాసకుడు పాఠ్యాంశాన్ని ఉపన్యసిస్తాడు. బోధకుడు ప్రజలకు బోధిస్తాడు. ఈ రెంటి మధ్య తేడా కీలకమైనది.

అయితే ఒక విషయం గుర్తించాలి. తరగతి గదులు చాలా పెద్దగా ఉన్నప్పుడు విద్యార్థులను విడివిడి మనుషులుగా చూడడం ఉపాధ్యాయుడికి సాధ్యం కానప్పుడు నా నిర్వచనం ప్రకారం మంచి బోధన సాధ్యం కాదు. అటువంటి సమయంలో ఆ ఉపాధ్యాయుడు తన పాఠ్యాంశాన్ని ఎంత అద్భుతంగా, ఎంత సజీవంగా వివరించగలిగాడు అనేదే గీటురాయి అవుతుంది. కాని ఇంతకుముందు నేను చెప్పిన కార్మికుల తరగతిలో పదిహేడు మంది మాత్రమే ఉన్నారు. ఇరవై ఐదు మందిదాకా ఉండే ఏ తరగతి లో నైనా ఉపాధ్యాయుడికి తన విద్యార్థుల గురించి విడివిడిగా తెలుసుకోవడం వీలవుతుంది. వారి విభిన్న నేపథ్యాలు ఏమిటి అని తెలుసుకున్నప్పుడు మంచి బోధన సాధ్యమవుతుంది.

అది ఎందుకు సాధ్యమవుతుందంటే ఉపాధ్యాయుడు తన విద్యార్థుల నేపథ్యాన్ని, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని దాని మీద ఆధారపడి తన పాఠాన్ని తయారు చేస్తాడు. తెలివైన, నైపుణ్యభరితమైన ప్రశ్నల ద్వారా ఆ విద్యార్థులందిరినీ నేర్చుకొనే ప్రక్రియలో భాగం చేస్తాడు. పాఠ్యాంశం అనేది కేవలం ఒక లక్ష్యం మాత్రమే కాదు. అది విద్యార్థులను ఆలోచించేలా చేసే సాధనం. ప్రపంచాన్ని అందులో తమ స్థానాన్ని అర్థం చేసుకోవడానికి వారికి కొన్ని పనిముట్లు అందించే సాధనం. అటువంటి ఒక తరగతి అయిపోయిన తరువాత ఆ గది నుంచి విద్యార్థులు ఒక కొత్త సమాచారాన్ని ఆకళించుకొని బైటపడతారు. తరగతి గదిలో ఒక మంచి చర్చ జరిగిందని, అందులో తాము క్రియాశీలంగా పాల్గొన్నామని అనుకుంటారు. పాఠ్యాంశం తమ అనుభవంతో ముడివడి ఉందని గుర్తిస్తారు. సమస్యలను విశ్లేషణాత్మకంగా అర్థం చేసుకునే పద్ధతి తెలుసుకుంటారు. అంతర్గర్భిత శక్తుల గురించి అవగాహన పెంచుకుంటారు.

నేను ఇంతకు ముందు చెప్పిన కార్మికుల తరగతిలో మొదటి పాఠపు అంశం 'పెట్టుబడిదారీ విధానం' గురించి పరిచయం. నేను ఇంతకు ముందే చెప్పినట్టు ఆ ఉపాధ్యాయుడు భూస్వామ్య విధానం గురించీ, పెట్టుబడిదారీ విధానం మార్పు గురించీ, కార్ల్‌మార్క్స్ బోధనల గురించీ, కార్మికవర్గం ఎదుర్కొంటున్న దోపిడీ గురించీ వగైరా వగైరా అద్భుతమైన పాఠం చెప్పాడు. కాని, ఆయన బోధించలేదు. వివరిస్తూ పోయాడు. కార్మికవర్గం తన నిత్య జీవితంలో అనుభవించిన విషయాల గురించి ఆయన మాటల్లో వివరిస్తూ పోయాడు. నిజానికి ఆయన వారి అనుభవం నుంచే గ్రహించి విద్యార్థులు తమంతట తామే ఆ విశ్లేషణ చేసేలా చేయగలిగి ఉండేవాడు.

ఇదే విషయాన్ని కార్మికుల వేసవి పాఠశాలలో కార్మికోద్యమ నాయకులకు చెప్పిన పద్ధతి ఎలా ఉండిందో కింద వివరిస్తాను. ముందుగా చెప్పవలసిందేమంటే ఈ తరగతిలోనూ దాని తరవాత జరిగిన తరగతులలోనూ ఒక్కరు కూడా నిద్రపడలేదు. అక్కడ జరిగిన ఆసక్తికరమైన చర్చ ఇటు ఉపాధ్యాయుడిని, అటు విద్యార్థులను ఉత్సాహపరిచింది. విద్యార్థులు ఆ వేసవి పాఠశాల గురించి చాలా కుతూహలం కనబరిచారు. చివరిలో పెట్టిన పరీక్షలను బట్టి విద్యార్థులు బోధించిన విషయాలను నేర్చుకున్నారని కూడా బయటపడింది.

ఆ తరగతులు ఎట్లా జరిగాయో టేప్‌రికార్డింగ్ జరగలేదు. అందువల్ల నేను ఇక్కడ రాస్తున్నది జరిగిన దానిలో ఒక భాగం మాత్రమే నని గుర్తించాలి. నేను చేయదలచిందల్లా అక్కడ జరిగిన బోధనా పద్ధతి గురించి, చర్చ సరళి గురించి చూపించి ఆ సంవిధానాన్ని వివరించడం మత్రమే.

❖ మీరు ఎక్కడ పనిచేస్తారు?
- విద్యార్థులు తాము ఏయే ఏయే పరిశ్రమలలో, కంపెనీలలో పనిచేస్తారో చెప్పారు. (ఈ ప్రశ్న వల్ల విద్యార్థుల నేపథ్యం తెలియడమే కాక ఉపాధ్యాయుడికి విద్యార్థుల గురించీ, విద్యార్థులకు తోటి విద్యార్థుల గురించీ తెలిసే అవకాశం ఉంది.)

❖ మీరు ఎందుకు పనిచేస్తారు?
- బతకడానికి పని చేయాలి గద.
- పనిచేయకపోతే తిండి ఎవరు పెడతారు.
- ప్రతివారం కిరాయి కట్టాలంటే సంపాయించొద్దా.

❖ మీ కార్ఖానా యజమాని కూడా మీతో కలిసి పని చేస్తాడా?
- నవ్వులు.
- అబ్బా. ఆ రోజు రావాలి.
- నాకు ఆయన ఎవరో తెలిస్తే గా.
- మా కార్ఖానా యజమాని పెద్ద కార్పొరేషన్.

❖ పోనీ ఆ కార్పొరేషన్ వాటాదారులలో ఎవరైనా, ఎప్పుడైనా మీ కార్ఖానాల్లో పనిచేశారా?
- ఉహూం. మా దగ్గర పనిచెయ్యరు.
- ఎందుకు చేస్తారండీ.

❖ మరి, బతకాలంటే పని చేయాలి అని మీరందరు ఒప్పుకున్నారు కదా. కాని, కొంతమంది మాత్రం పని చెయ్యకుండానే బతుకుతున్నారు అని మీరే చెప్పుతున్నారే. అది ఎట్లా జరుగుతుంది.
- కార్ఖానా వాళ్లదే గనుక వాళ్లు పనిచెయ్యనక్కర్లేదు.
- వ్యాపారం నుంచి వాళ్లకు లాభాలు వస్తాయి గదా.

❖ అంటే మన సమాజంలో రెండు రకాల మనుషులు ఉన్నారన్నమాట. ఒక బృందం మీది. మీరేమో బతకాలంటే ...
- పని చెయ్యాలి

❖ ఇక మరొక బృందం మీ యజమానులది. వాళ్లు బతకాలంటే ...
- ఆస్తి ఉండాలి

అప్పుడు ఆ ఉపాధ్యాయుడు నల్లబల్ల మీద రాశాడు.

రెండు బృందాలు

| కార్మికులు | యజమానులు |
|---|---|
| బతకడం కోసం పనిచేస్తారు | ఆస్తి ఉన్నందువల్ల బతుకుతారు |

❖ మీకు ఎప్పుడూ పని ఉంటుందా?
- ఉంటుంది
- ఒకసారి అయిదు నెలలు

- నన్ను పనిలోంచి తీసేసారు
- ఆర్థిక మాంద్యం అని చెప్పి
- ఓ ఏడాదిపాటు మా కార్ఖానా మూసేసారు

❖ తాను పనిచేసే కార్ఖానా ఒక ఏడాది పాటు మూసేసారని మేరీ చెపుతోంది. కాని ఆమె పనిచేసేది బట్టల మిల్లులో. మరి ఆ మిల్లులో తయారయ్యే చొక్కాలు ప్రజలకు అవసరం లేదా? హెన్రీ పనిచేసే రిఫ్రిజిరేటర్‌ల కార్ఖానా అయిదు నెలలు మూసేసారట. మరి జనానికి రిఫ్రిజిరేటర్లు అక్కర్లేదా?

- జనానికి చొక్కాలు అయితే కావాలి. కాని కొనుక్కోవటానికి వాళ్లదగ్గర డబ్బులు లేవుగా. అందుకని మా యజమాని మిల్లు మూసేశాడు.
- హెన్రీ వాళ్ల యజమాని మార్కెట్‌లో రిఫ్రిజిరేటర్ అమ్మబోతే అమ్ముడు పోలేదు. అందుకని కార్ఖానా మూసేశాడు.
- నేనైనా అదే చేసే వాడిని. వ్యాపారం చేసేది లాభం కోసమే గదా. లాభం రాకపోతే వ్యాపారం మూసేయడమే.

❖ అంటే మీరు చెప్పేదాని ప్రకారం జనానికి చొక్కాలు అవసరమైనా, రిఫ్రిజిరేటర్లు అవసరమే అయినా యజమానికి లాభం రాకపోతే అవి తయారు కావన్నమాట.

- అంతే మరి. ఆయన వ్యాపారంలో ఉన్నదే డబ్బులు చేసుకోవడానికి కదా.
- డబ్బులు రాకపోతే, కార్ఖానా మూసేస్తాడు.
- యజమాని మంచివాడా చెడ్డవాడా అనేది సమస్య కాదు. లాభం రాకపోతే మూసుకొని పోవలసిందే.

❖ అంటే మీరు అనేదాని ప్రకారం మన ఉత్పత్తి పద్ధతిలో లాభం వస్తేనే వస్తువులు తయారుఅవుతాయన్నమాట. అంతేనా?

- కచ్చితంగా అంతే.
- లాభం అంటూ లేకపోతే సరుకుల తయారీయే ఉండదు.

❖ ఇది ఎల్లప్పుడూ ఇలాగే ఉందా?

- ఏమో ఉండొచ్చు.
- ఉహూం. ఒకప్పుడు ఎలా ఉండేదంటే. జనం వాళ్లకు కావల సింది ఏదైనా వాళ్లకు కావలసినప్పుడు వాళ్లే చేసుకునేవాళ్లు.

❖ మరి ఇప్పుడు కూడా మనుషులు చొక్కాలో, రిఫ్రిజిరేటర్లో, వాషింగ్ మెషిన్లో, వాహనాలో తమంత తామే ఎందుకు చేసుకోలేరు?

- వాళ్లదగ్గర డబ్బులు లేవు కదా.
- ఈ రోజుల్లో జనం కోరుకునేవన్నీ చేయాలంటే కార్ఖానాలు ఉండాలి, ముడిసరుకులు ఉండాలి, బోలేడు ఖరీదైన యంత్రాలు ఉండాలి.

ఇప్పుడిక మనం ఇప్పటిదాకా చర్చించిన దాన్ని ఒక్కచోటికి తెద్దాం. మన ఉత్పత్తి విధానంలో రెండు రకాల మనుషులు ఉన్నారు అని ముందు చూసాం.

(ఉపాధ్యాయుడు నల్లబల్లవైపు చూపెడుతాడు)

'రెండు బృందాలు'

| కార్మికులు | యజమానులు |
|---|---|
| బతకడం కోసం పనిచేస్తారు | ఆస్తి ఉన్నందువల్ల బతుకుతారు |

దాని కింద యజమానులు ఆస్తిని సొంతం చేసుకోవడం ద్వారా బతుకుతుంటారు అనుకున్నాం గదా. యజమానుల దగ్గర యజమానుల సొంత ఆస్తిగా ఉండేదేమిటి?

కార్ఖానాలు, పనిముట్లు, యంత్రాలు, ముడిసరుకులు
వీటినే ఉత్పత్తి సాధనాలు అంటారు

మన సమాజంలో వస్తువులను ఉత్పత్తి చేయడానికి అవసరమైన వాటన్నిటినీ యజమానులు సొంతం చేసుకున్నారు. ఇటువంటి ఉత్పత్తి విధానాన్ని ఏమంటారంటే

(ఉపాధ్యాయుడు నల్లబల్ల మీద రాస్తాడు)

'పెట్టుబడిదారీ విధానం'

దీని లక్ష్యం ఏమంటే, అవసరమైన వస్తువులు ఉత్పత్తి చేయటం కాదు. మరి లాభం కోసం ఉత్పత్తి చేయటం.

❖ సరే, ఇప్పుడు మళ్లీ కొనసాగిద్దాం. యజమానులను, లేదా ఉత్పత్తి సాధనాల సొంతదారులను పెట్టుబడిదారులు అని అంటారు. ఈ రెండు బృందాలలో అంటే కార్మికులలో, పెట్టుబడిదారులలో ఎవరికి ఎక్కువ శక్తి ఉంది? ఎందుకు?

- యజమానులకే ఎక్కువ శక్తి ఉంది. ఎందుకంటే వాళ్లదగ్గర డబ్బు ఉందిగా.
- పెట్టుబడిదారులకే ఎక్కువ శక్తి ఉంది. ఎందుకంటే వాళ్లు నీకు ఉద్యోగం ఇవ్వకపోతే నీ బతుకే గడవదు.
- పెట్టుబడిదారులకే ఎక్కువ శక్తి ఉంది. ఎందుకంటే నువ్వు పనిచేయడం మానేసావు అనుకో ఆకలికి మాడి చస్తావు. వాళ్లు పనిచేయకపోయినా బతకడానికి సరిపోయే డబ్బు ఉంది.

❖ మరి అంత శక్తి వాళ్లకి ఎక్కడి నుంచి వచ్చింది?

- ఉత్పత్తి సాధనాలు వాళ్ల సొంతం గనుక.

ఏ బృందానికి ప్రభుత్వాన్ని శాసించే శక్తి ఉంది? ఈ ప్రశ్నకు జవాబు నన్నే చెప్పనివ్వండి. చాలా రోజుల కింద రాసిన ఒక పుస్తకం నుంచి నేను ఆ జవాబు చదివి వినిపిస్తాను. 'ఈ పరిస్థితి వాస్తవాలు ఎలా ఉంటాయంటే ఈ దేశపు ముడిసరుకలన్నిటినీ ఒక అత్యల్ప సంఖ్యాక బృందం తన అదుపులో పెట్టుకుంటుంది. ఒక అత్యల్ప సంఖ్యాక బృందానికి మొత్తం నీటి మీద అధికారం ఉంటుంది. వారికే రైలు మార్గాలమీద అధికారం ఉంటుంది. వాళ్ల మధ్య వాళ్లు కుదుర్చుకునే ఒప్పందాలతో వాళ్లే ధరలను అదుపు చేస్తారు. దేశంలో సాగే రుణ లావాదేవీలన్నీ కూడా వాళ్లే నియంత్రిస్తారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వపు యజమానులు అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని పెట్టుబడిదారులకూ, పారిశ్రామికవేత్తలకూ ఉమ్మడి యజమానులే'.

ఈ మాటలు రాసినాయనకు ఈ విషయాలు చాలా బాగా తెలిసి ఉండాలి. ఎందుకంటే ఆయన ఈ మాటలు రాసినప్పుడు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు అధ్యక్షుడిగా ఉన్నాడు. ఆయన పేరు ఉడ్రోవిల్సన్.

మన వచ్చే పాఠంలో పెట్టుబడిదారీవర్గపు శక్తినుంచి కార్మిక వర్గం తనను తాను ఎట్లా పరిరక్షించుకోగలదో చర్చించుకుందాం.

ఇది ఆ పాఠం. ఈ పాఠం నుంచి అర్థమయ్యేదేమంటే చర్చ అనేది ఎప్పుడైనా ఇక్కడా, అక్కడా అన్నిచోట్లా తిరుగుతూ గమ్యం లేకుండా సాగేది కాదు. మంచి ఉపాధ్యాయుడు తాను చెప్పదలచుకున్న విషయాన్ని ఉపన్యాసకుడిలాగా సమర్థంగా తెలుసుకోవాలి. ఉపన్యాసకుడికి తన ప్రసంగ అంశం మీద ఎంత పట్టు ఉంటుందో అంత పట్టు తెచ్చుకోవాలి.

దానితో పాటు తన విద్యార్థుల అనుభవాల ఆధారంగా తన పాఠ్యాంశాన్ని ఎంత బాగా వివరించవచ్చునో ఆలోచించాలి. తన పాఠపు ప్రణాళిక స్పష్టంగా ఉండాలి. అంటే ఒక కచ్చితమైన ప్రణాళిక ఉండి అటూ ఇటూ జరగకూడదని కాదు. విద్యార్థుల ప్రతిస్పందనలో ఒక ఆసక్తికరమైన అంశం వస్తే దాన్ని గ్రహించి ముందుకు తీసుకుపోకూడదని కాదు. ప్రణాళిక ఉండాలి అంటే దాని అర్థం ఏమంటే అగమ్య గోచరంగా పక్కదారి పట్టకూడదని మాత్రమే. ఆ ఉపాధ్యాయుడి పాఠానికి ఒక మొదలు, ఒక మధ్య, ఒక ముగింపు ఉండాలి. చర్చ జరగడానికన్నా ముందే చర్చలో తాను ఏ మౌలిక అంశాలను లేవనెత్తదల్చుకున్నాడో స్పష్టత ఉండాలి. వాటినే లేవనెత్తాలి.

గుర్తుంచుకోవలసిన మరొక కీలక అంశం ఏమంటే చర్చ ఎప్పుడూ ఉపాధ్యాయుడికి ఒక విద్యార్థికి మధ్య సంభాషణగా జరగకూడదు. అది మొదలైందంటే ఇతర విద్యార్థులు ఈ పాఠాన్ని తాము వినక్కర్లేదని అనుకుంటారు. ఉపాధ్యాయుడు తమను నేరుగా ప్రశ్నించే వరకూ తమకు జోక్యం లేదనుకుంటారు. కాని, విద్యార్థులందరూ మరొక విద్యార్థి ప్రతిస్పందనలను, ఉపాధ్యాయుడి ప్రశ్నలను విని అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఇటువంటి సాధారణ భాగస్వామ్యాన్ని సాధించడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయి. 'ఫిలిప్ ఇప్పుడు జాన్ అన్నదానితో నీకు ఏకీభావం ఉందా? లేదా. మరి నా ప్రశ్నకు నీ జవాబు ఏమిటి' అని ప్రశ్నించడం ద్వారా ఒక విద్యార్థికి మరొక విద్యార్థికి సంబంధం కల్పించవచ్చు.

ఇక్కడ మరొక విషయం చెప్పాలి. మంచి ఉపాధ్యాయుడు ఒక పొరపాటు ఎప్పుడూ చెయ్యకూడదు. విద్యార్థులను ప్రశ్నలను అడిగేటప్పుడు ఎప్పుడు వరుస పాటించగూడదు. మొదటి ప్రశ్న మొదటి విద్యార్థికి, రెండో ప్రశ్న అతని పక్క విద్యార్థికి, మూడో ప్రశ్న అతని పక్క విద్యార్థికి వేస్తూ పోతే చివరి వరుసలో కూర్చున్న విద్యార్థి ప్రశ్నలు పట్టించుకోవడం మానేస్తాడు. ఎందుకంటే ఉపాధ్యాయుడు తనను ఎప్పుడు ప్రశ్న అడుగుతాడో, తాను ఎప్పుడు పాల్గొనవలసి ఉంటుందో అతనికి తెలిసిపోతుంది. అప్పటిదాకా జరిగే చర్చ తనకు అనవసరం అనుకుంటాడు.

అంతేకాదు, విద్యార్థులను ఒక వరుసలో పిలిచి ప్రశ్నలు వేయగూడదనడానికి మరొక ముఖ్యమైన కారణం ఉంది. మంచి ఉపాధ్యాయుడికి తన పాఠ్యాంశం మీదకన్నా విద్యార్థుల మీద ఎక్కువ కేంద్రీకరణ ఉండాలి. ఆ విద్యార్థులందరూ ఆలోచించడం నేర్చుకోవాలని ఆ ఉపాధ్యాయుడు అనుకోవాలి. ఉపాధ్యాయుడు కనుక శ్రద్ధగా ఉంటే తన పని సక్రమంగా నిర్వహిస్తే విద్యార్థులందరూ చర్చలో పాల్గొంటారు. వాళ్ల నేపథ్యాలు ఏమిటి, శక్తియుక్తులు ఏమిటి ఉపాధ్యాయుడికి అర్థమైతుంది. ఉపాధ్యాయుడికి తన విద్యార్థుల గురుంచి అవగాహన కలుగుతుంది. అప్పుడు వేరు వేరు విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఉపాధ్యాయుడు వాళ్లను ప్రశ్నిస్తాడు. తక్కువ సామర్థ్యం ఉన్న విద్యార్థులకు సులభమైన ప్రశ్నలు వేస్తాడు. వాళ్లు వాటికి జవాబు చెప్పి తాము సాధించగలిగామని ఆత్మవిశ్వాసం పొందుతారు. కష్టమైన ప్రశ్నలను, చిక్కు ప్రశ్నలను తెలివైన విద్యార్థులకు వేస్తాడు. వాళ్లు తమ ఆలోచనలను విస్తరించుకోవడానికి, ఉన్న చోట ఆగిపోయి ఆసక్తి పోగొట్టుకోకుండా ఉండడానికి అది వీలు కల్పిస్తుంది.

మంచి ఉపాధ్యాయుడు తన పాఠం చెప్పేటప్పుడు ఎప్పుడైనా నల్లబల్ల లేకుండా చెప్పకూడదు. అంతేకాదు, నల్లబల్ల మీద తాను రాసే మౌలిక అంశాలను విద్యార్థులు తమ నోట్ పుస్తకాలలో ఇతర నోట్స్‌తో పాటు రాసుకోవాలని ఉపాధ్యాయుడు నొక్కి చెప్పాలి. నల్లబల్ల, నోట్ పుస్తకం అనేవి నొక్కి చెప్పడానికి ఒక గట్టి కారణం ఉంది. కొందరు మనుషులు వినడం ద్వారా నేర్చుకుంటారు. కొందరు మనుషులు చూడడం ద్వారా నేర్చుకుంటారు. మరికొందరు మనుషులు తమ కండరాలను వినియోగించడం ద్వారా మాత్రమే నేర్చుకుంటారు. దాదాపు మనుషులు ఈ మూడు పద్ధతుల సమ్మేళనం ద్వారా నేర్చుకుంటారు. అందువల్ల కేవలం చర్చ సాగితే వినడం ద్వారా నేర్చుకునే వాళ్లకి అందుతుంది. మౌలిక అంశాలను నల్లబల్ల మీద రాస్తే చూడడం ద్వారా నేర్చుకునేవాళ్లు తెలుసుకుంటారు. ఆ విషయాలను తమ నోట్ పుస్తకాలలో రాసుకొమ్మని చెప్తే తమ కండరాలను వినియోగించడం ద్వారా నేర్చుకునే వాళ్లకు తెలుస్తుంది. అంతేకాదు, ప్రతి పాఠానికి ప్రాథమిక అంశాలను నోట్ చేసుకున్న నోట్ పుస్తకం విద్యార్థికి ఆ తరువాత సమీక్షించుకోవడానికి ఉపయోగపడుతుంది. ఆ విద్యార్థులలో తెలివైన వాళ్ళకు అవసరమైనప్పుడు ఇతరులకు బోధించడానికి ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. నిజానికి ఆ అవసరం ఎంతగానో ఉంది. ముఖ్యంగా వెనుకబడిన దేశాలలో కార్మికులకు, విప్లవోద్యమంలోకి కొత్తగా వస్తున్నవారికి, రైతులకు ఎన్నెన్నో తరగతులు నిర్వహించవలసి ఉంది.

(మంత్లీ రివ్యూ ప్రెస్ ప్రచురించిన స్టడీస్ ఇన్ సోషలిస్ట్ పెడగాగీ పుస్తకం నుంచి) ◆

## అసహజ మరణాలు నమోదు చేద్దాం!

ఆగస్ట్ 2006 నుంచి వీక్షణంలో అసహజ మరణాల సూచి ప్రారంభించాం. మన చుట్టూ అసహజంగా చనిపోతున్న రైతులు, చేనేత కార్మికులు, వరకట్న మరణాలు, రకరకాల ప్రమాదాలలో చనిపోతున్నవారు, వైద్యం అందక, ప్రకృతి వైపరీత్యాలతో మరణిస్తున్నవారు, హత్యలు ఇలా అనేక సామాజిక రంగాలనుంచి మరణిస్తున్నవారి సంఖ్యను నమోదు చేయడమే ఈ శీర్షిక ఉద్దేశ్యం. ఏయే సామాజిక, రాజకీయార్థిక కారణాలతో చనిపోతున్నారో పరిశోధన చేయాల్సి ఉంది. ఇప్పటికే 15 జిల్లాల నుంచి మాకు ఈ సమాచారం అందుతోంది. ఇంకా **నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం** జిల్లాల నుంచి అసహజంగా చనిపోతున్న వారి సమాచారం అందాల్సి ఉంది. మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో మీరూ పాలుపంచుకోవచ్చు. దీనికి పారితోషికంగా వీక్షణం ప్రతిని పంపిస్తాం.

ఆసక్తి గలవారు వివరాలకై సంప్రదించండి : **వై. రామచంద్రం** (సర్క్యులేషన్ మేనేజర్) ఫోన్ నెం. 9949391028

**- సంపాదకులు**


*ఇతర ఆధారాలేవీ లేనప్పుడూ, పురాతన భాష పూర్తిగా అంతరించి పోయినప్పుడూ మనకు దొరికిన వాటిలోని భావం ఊహించాలే తప్ప కచ్చితంగా చెప్పడం వీలుకాదని అంటున్నారు* **కొడవటిగంటి రోహిణీప్రసాద్**

# ప్రాచీన లిపుల సమస్యలు

**చి**న్న పిల్లలు ఏదో కథను ఊహించుకుని, దాన్ని వర్ణించడానికి బొమ్మలు గీస్తారు. చూసినవారికి అర్థంకాక అదేమిటని అడిగితే అమాయకంగా ముద్దు మాటలతో కథను వర్ణిస్తారు. తొలి దశలోని చిత్రలిపులు ఇటువంటివే. అంతేకాదు; ఈ రకం బొమ్మల వరసలో వ్యాకరణబద్ధమైన వాక్యనిర్మాణానికి వీలుండదు. అవన్నీ 'చదువరులు' ఊహించుకోవలసిందే. లిఖిత సమాచారం చాలా తక్కువగా అవసరమూ, లభ్యమూ అయే సామాజిక పరిణామదశలో లిపి ఇలాగే ఉండేది. రానురాను ఇటువంటి సందేశాలకు సరైన అర్థం తెలియవలసిరావడంతో పదాల వెంట విభక్తులవంటివి చేర్చడం మొదలైంది.

అసలు ప్రాచీన లిపిని చదవడంలోని ఇబ్బందులెటువంటివి? ఈ విషయంలో చిక్కులు తెచ్చిపెట్టేది సింధులిపి ఒక్కటే కాదు; క్రీ.పూ. 1800 నాటి గ్రీక్ లిపీ, క్రీ.పూ. 500 ప్రాంతపు మెక్సికో లిపీ, క్రీ.పూ. 300లో సుడాన్‌లో మొదలైన లిపీ వగైరాలెన్నో ఉన్నాయి. మూడు లిపులలో ఒకే సమాచారం కనబడుతున్న రోసెటా శిలవంటిది దొరికాక కూడా ఈజిప్టు లిపిని అర్థం చేసుకోవటానికి పాతికేళ్లకు పైగా పట్టింది. ఇతర ఆధారాలేవీ లేనప్పుడూ, పురాతన భాష పూర్తిగా అంతరించి పోయినప్పుడూ మనకు కనబడుతున్న గీతల్లోని భావం ఊహించాలే తప్ప కచ్చితంగా చెప్పడం వీలవదు. అప్పటి నాగరికతలో మౌఖిక భాషకూ, లిపిబద్ధం చేసిన అక్షరాలకూ ఎంతటి, ఎటువంటి సామ్యం ఉందో, అసలు లిపిని చదవగలిగిన శక్తీ అవసరమూ అప్పటి సమాజంలో ఎవరికి ఉండేవో ఇవన్నీ లెక్కలోకి వస్తాయి.

వివిధ ప్రాచీనలిపుల్లో దాదాపు ఒకేరకమైన బొమ్మలు గీసే పద్ధతి కనబడుతుంది. పటంలో చూపినట్టుగా మొదట్లో కాస్త వివరంగా కనబడుతున్న చిత్రం తరవాత కాస్త సాదాగా తయారవుతుంది. అంటే ఏది దేన్ని సూచిస్తోందో చూడగానే అర్థం అవుతోందన్న మాట.



పటంలో చూపిన లిపుల బొమ్మలు, అర్థాలు

1. ప్రాచీన సుమేరియన్ లిపి (పర్వత ప్రాంతం లేదా విదేశీ ప్రాంతం)
2. ప్రాచీన ఈజిప్ట్ లిపి (ప్రాంతం లేదా విదేశీ ప్రాంతం)
3. ప్రాచీన చైనా లిపి (పర్వతం, కొండ)
4. నేటి టర్కీ ఉత్తర సిరియా ప్రాంతపు ప్రాచీన హిటైట్ చిత్రలిపి (కోటలు)
5. సింధు లిపి (అర్థం తెలియదు)

మొదట్లో ఈ సంకేతానికి అర్థం ఆ బొమ్మలోని వస్తువే. ఆ తరవాత ఆ వస్తువు పేరుకూ, దాన్ని పోలిన మాటలకూ వేరే అర్థాలు ఉన్నప్పుడు వాటికి కూడా ఇదే బొమ్మను వాడడం జరుగుతుంది. సందర్భాన్ని బట్టి ఆ భాష తెలిసినవారు ఏ బొమ్మ దేనికి సంకేతమో అర్థం చేసుకుంటారు గనక పని గడిచిపోతుంది. ఉదాహరణకు ఇదే తెలుగు అయితే పర్వతాలు కొండలను కాకుండా పర్వతాలు అనే పేరుగల వ్యక్తిని సూచిస్తున్నాయనుకోవచ్చు. పర్వతాలుగారి ఇంటికి ఇటువంటి బోర్డ్ వేలాడుతూంటే అది పర్వత ప్రాంతమని ఎవరూ పొరబడరు. ఇదంతా ఉత్తుత్తి కథే అయినప్పటికీ దీనివల్ల సమస్య ఎటువంటిదో తెలుసుకోవచ్చు. చిక్కొక్కడొస్తుందంటే ఏ కారణం చేతయినా ఆ నాగరికతా, ఆ భాషా అంతరించిపోతే తరవాతి వారికి ఈ లిపి ఏమీ అర్థం కాదు.

లిపి అనేది ఒక్కసారిగా పరిపూర్ణమైన పద్ధతిలో ఎక్కడా అవతరించదు. లిపి తయారవని పూర్వదశలో బొమ్మలు గీసే పద్ధతే అమలులోకి వస్తుంది. వాటిలో కొన్ని పూర్తి వాక్యాల్నో, వ్యాఖ్యానాల్నో సూచిస్తాయి. ఆ తరవాతి దశలో వాటిని పదాలుగా విడగొట్టవలసిన పరిస్థితి వస్తుంది. మామూలుగా కనబడేవాటిని చిన్న బొమ్మల్లో గీసి సూచించడం సరిపోతుంది కాని, భావాలకూ, విశేషణాలకూ శ్లేష పద్ధతిలో వాటిని చిత్రించడం జరిగేది. ఉదాహరణకు 'బల్లపరుపు' అనే మాటకు బల్లనూ, పరుపునూ; అట్లాగే 'చుట్టకుండ' అనే మాటను తెలిపేందుకు చుట్ట, కుండ అనే వాటినీ బొమ్మలుగా పక్కపక్కనే గీసుకోవచ్చు. తెలుగువంటి భాషలకు ఇటువంటి పరిస్థితి ఏర్పడలేదుగాని ఈ పద్ధతి ఎటువంటిదో తెలుసుకోవడానికి ఈ ఉదాహరణకు పనికొస్తాయి. ఈ పద్ధతి తెలియాలంటే చదివేవాడికి తెలుగు వచ్చితీరాలి. ఈ బొమ్మలను ఇతర భాషీయులు తమ పదాలుగా గుర్తించి, కలిపి చదివితే ఏమీ బోధపడదు.

శ్లేష కొన్ని పొరబాట్లకు దారితీస్తుంది. ఉదాహరణకు ప్రాచీన సుమేరియన్ భాషలో బాణం అనడానికీ, ప్రాణం, పక్కటెముక అనడానికీ కూడా ఒకేలాంటి మాట ఉండేదట. ప్రాచీన శాసనాల్లో బాణం గుర్తు కనబడటంతో కొన్నాళ్ల తరవాత ఫలానా 'ప్రాణదేవత' మరొక దైవపురుషుడి పక్కటెముకకు చికిత్స చేసిందనే గాథ మొదలైందట. ఏనాడో మొదలైన ఈ అపార్థాలు తరవాత ఇతర భాషల్లోకి కూడా

పోకాయి. పై అర్థాలకు హీబ్రూ భాషలో వేరువేరు పదాలున్నప్పటికీ సృష్టిలో అందరికీ జన్మనిచ్చిన ఆదిమాత ఈవ్ (హీబ్రూలో హవ్వ అంటారు. తెలుగులో పెద్దావిడను అవ్వ అనడం గమనార్హం) ఆడమ్ పక్కటెముకనుంచి పుట్టిందనే గాథ తలెత్తింది. ఇవేవీ తెలియని ఆధునిక మతబోధకులు ప్రతిదానికీ 'సింబాలిక్' అర్థాలుంటాయని నమ్మబలుకుతారు.

మన దేశపు తొలి లిపిగా భావించబడుతున్న సింధు లిపి అక్షరాల నమూనాలన్నీ ఎక్కువగా అంగుళం, రెండంగుళాల సైజులో ఉన్న చిన్న చిన్న ముద్రికల మీద కనిపిస్తున్నవే. ఇంతకుముందు చెప్పినట్టుగా ఈ ముద్రికల్లో నిక్షిప్తమై ఉన్న సమాచారాన్ని తెలుసుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి, జరుగుతున్నాయి కూడా. 1960లలో తొలిసారిగా వీటి విశ్లేషణకై సోవియట్, ఫిన్లండ్ బృందాలు కంప్యూటర్లను వాడారు. అప్పటినుంచీ ఎడతెగకుండా పరిశోధనలు జరుగుతున్నప్పటికీ ఎవరికి తోచిన పద్ధతిలో వారు 'ఫలితాలను' వెల్లడిస్తూ వచ్చారుగాని అందరి మధ్యా ఏకాభిప్రాయం కుదరనేలేదు. అసలే సాక్ష్యాలు తక్కువ; అందులోనూ ఈ అన్వేషణకు సహాయపడగలిగి, అప్పటి భాషను గురించి ఇతరత్రా తెలియజెప్పగలిగిన మరే వివరాలూ ఎక్కడా దొరకలేదు. ఈ కష్టాలకు తోడుగా అన్వేషకుల రాజకీయ ధోరణులు మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. అతి ప్రాచీనమైన ఆ భాష కేవలం సంస్కృతానికి ఒక పూర్వ రూపమని కొందరు నిరూపించడానికి ప్రయత్నిస్తూ ఉంటే, అది ద్రావిడ భాషాకుటుంబానికి చెందినదని మరికొందరి వాదన. వీరిలో కనీసం కొందరికైనా ఆర్యద్రావిడ విభేదాలను గురించిన పక్షపాత వైఖరి ఉందనడంలో సందేహం లేదు.

లిపి సంగతి అలా ఉంచితే సింధు నాగరికతలో ప్రజలు ద్రావిడ భాష ఏదైనా మాట్లాడేవారా? మనకు తెలియదు. ప్రస్తుతం అవన్నీ వినబడే ప్రాంతాలు అక్కడికి ఎనిమిది వందల మైళ్ల దూరాన ఉన్నాయి. కాని, పాకిస్తాన్‌కు పశ్చిమానా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ ప్రాంతాల్లోనూ కొన్ని తెగలు ఈనాటికీ మాట్లాడే బ్రాహుయీ భాష ద్రావిడ కుటుంబానికి చెందినట్టుగా తెలుస్తోంది. అలాగే ఈనాడి ఇరాన్‌లోని నైరుతి ప్రాంతంలో ఒకప్పటి సుసా నగరవాసులు మాట్లాడిన ప్రాచీన ఈలమైట్ భాషలో ద్రావిడ శబ్దాలుండేవట. సింధు ప్రజలు మాట్లాడినది సంస్కృతాన్నీ, దాని మాతృక అవదగిన ఇండో ఇరానియన్ భాషనూ పోలి ఉండేదనే ప్రతిపాదనకు పాశ్చాత్య పరిశోధకులు అంగీకరించరు. ఎందుకంటే క్రీ.పూ. 3200 ప్రాంతంలో మనం దేశం వైపుగా పశ్చిమం నుంచి ఎవరైనా వలస వచ్చిన దాఖలాలు కనబడవు. 150 ఏళ్ల క్రితం ఇలా వాదించిన అన్వేషకుల సాంస్కృతిక దృక్పథంలో వలసవాద వైఖరి ఉందని ఆక్షేపించవచ్చునేమో గాని ఈ రోజుల్లో అత్యాధునిక పద్ధతుల్లో పరిశీలనలు జరుపుతున్నవారికి అటువంటి ధోరణిని ఆపాదించడం కష్టం. అందుచేత ఆ భాష ఏదో ద్రావిడ శైలిదే అయి ఉండాలి. ఈ రెంటికీ చెందినది కాని పక్షంలో దాన్ని మనమీనాడు అర్థం చేసుకోగలగడం అసాధ్యమే.


సింధులిపిలోని రహస్యాలను భేదించేందుకు ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. అశోకుడి నాటికి వ్యాప్తిలోకి వచ్చిన బ్రాహ్మీలిపి ఆధునిక భారతీయ లిపులన్నిటికీ మాతృక. దానికీ ఈ సింధు లిపికీ మధ్య పూడ్చలేని ఎడం కనిపిస్తోంది. ఆనాడే ఎంతో విశాల ప్రాంతాలకు విస్తరించిన సింధు నాగరికతకు చెందిన ఈ లిపీ, భాషా ఎటువంటివో తెలుసుకోవడం గడ్డు సమస్యగా తయారయింది.

దాదాపు ఎనభై ఏళ్ల నుంచీ సింధులిపి పరిశోధకులకు సవాలుగా నిలిచింది. ఒక్క లిపి మాత్రమే కాక సింధునాగరికతకు చెందిన ఇతర శిల్పాలనూ, విగ్రహాలనూ, నగర అవశేషాలనీ అన్నిటినీ పరిశీలించి చరిత్రపరంగా అప్పటి పరిస్థితులను అంచనా వేసే ప్రయత్నాలు కూడ జరుగుతున్నాయి.

ఆర్య, ద్రావిడ సంస్కృతుల గురించి సాగుతున్న అనేక అపోహలూ, వాగ్వివాదాలూ వీటికి సంబంధించినవే అయినప్పటికీ వాటి గురించి మరొక సందర్భంలో చెప్పుకోవాలి. సింధు అవశేషాల్లో కనబడుతున్న నగరవ్యవస్థతో బాటుగా దేవతల, మనుషుల, జంతువుల బొమ్మలూ, వారి ఆభరణాలూ, జీవనశైలీ అన్నీ అప్పటి సంస్కృతిని గురించిన సాక్ష్యాలుగా నిలిచి ఉన్నాయి. అయినా వారు మాట్లాడిన భాషను గురించి గాని, లిపిని గురించి గాని సరైన సమాచారం ఇప్పటికీ లభించకపోవడం దురదృష్టకరమే. సింధులిపిని చదివేశామంటూ అనేకమంది పరిశోధకులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఏ ఒక్క ప్రతిపాదననూ పూర్తిగా నమ్మగలిగే పరిస్థితి ఏర్పడలేదు. సింధులిపికీ, దాని తరవాత వెయ్యేళ్లదాకా కనబడని బ్రాహ్మీలిపికీ సంబంధం ఉందనీ, లేదా అది సంస్కృతభాషకు మూలరూపమనీ వాదించే పరిశోధకుల ప్రతిపాదనలను ఎవరూ ముఖ్యమైనవిగా పరిగణించటంలేదు. వీటిని బలపరిచే చారిత్రక ఆధారాలు లేకపోగా వీటి వెనక రాజకీయ వైఖరి ఉందనే సూచనలున్నాయి. ఆనాటి సింధులిపి ద్రావిడ లక్షణాలు కలిగినదనే కొందరి వాదనను మాత్రం పూర్తిగా కొట్టిపారెయ్యడం కష్టంగా అనిపిస్తోంది. మొత్తం మీద ఏనుగును ఏడుగురు అంధులు తడుముతున్న పద్ధతిలో అందరూ తలొక రకంగానూ ఊహిస్తున్నారు.

ఇటువంటి పరిశోధనల్లో ఇతర లిపులు కూడా లెక్కలోకి వస్తాయి. సింధునాగరికతతో సమకాలికమై, అక్కడివారితో వర్తక వాణిజ్య సంబంధాలు కలిగి మెసపొటేమియా ప్రాంతపు లిపిని పరిశోధకులు చదవగలిగారు. ఆ రాతల్లో ముఖ్యంగా వ్యక్తుల పేర్లుండేవి. వాటన్నిటిలోనూ దేవతల పేర్ల విశేషణాలుండేవి. సింధులిపిలోనూ ఇవే లక్షణాలుండే అవకాశం ఉంది. మన దేశానికిది కొత్తకాదు. ఎందుకంటే తెలుగువారిలోనే ఈనాటికీ వెంకటేశ్వరరావులూ, సత్యనారాయణలూ, లక్ష్మి, కామేశ్వరి తదితరులూ మనకు అన్నిచోట్ల ఎదురౌతూనే ఉంటారు. ఈ కారణాలవల్ల సింధుముద్రికల మీది గుర్తులు దైవసంబంధిత పేర్లను సూచిస్తున్నాయని పార్పోలా అనే ఫిన్లండ్ పరిశోధకుడు భావించాడు.

ఈ ముద్రికల్లో లిపి వంటిది ఉన్న వాటిలో ఎక్కువ భాగం ఎగుమతి చేసిన సరుకుల బంగీలమీద గుర్తులు వెయ్యడానికే ఉపయోగించినట్టుగా తెలుస్తోంది. బహుశా వస్తువులను తయారుచేసిన వారో, పంపినవారో తమ పేర్లనూ, వంశనామాలనూ సంకేతరూపంలో గుర్తులుగా అచ్చువేసేవారేమో.



ముద్రిక వెనక వైపు

వీటికి తాడుకట్టి, రబ్బర్ స్టాంప్‌లాగా బంకమట్టి బిళ్లలమీద అచ్చు గుద్దేవారు. ఆ బిళ్లలన్నీ సురుకులతో బాటు వెళ్లేవి. బొమ్మలో ముద్రిక వెనక వైపు చూస్తే ఇది స్పష్టమౌతుంది.

ఈ అక్షరాల గుర్తుల్లోని గూఢార్థమేమిటో గాని కొన్ని మాత్రం ఎక్కువగా కనిపిస్తాయి. వీటికి పట్టికలను తయారుచేసి, ఏవేవి ఎన్నెన్నిసార్లు, ఏయే క్రమంలో కనిపిస్తున్నాయో లెక్కలు కట్టారు. తలాతోకా లేవనిపించే ఈ గుర్తులను చదవడానికి ఎలా ప్రయత్నిస్తారో తెలుసుకోవాలంటే అందుకు ఉదాహరణగా పార్పోలావంటివారు అవలంబించిన పద్ధతిని అర్థం చేసుకోవాలి.

ముద్రికల మీద తరుచుగా కనిపించే చేప బొమ్మపై పార్పోలా తన దృష్టిని కేంద్రీకరించాడు. ఆ ప్రాంతంలో ద్రావిడ శైలి భాష ఉపయోగంలో ఉండి ఉంటుందని ఊహించి తమిళం మొదలైన భాషల్లో చేపను మీన్ అంటారనీ, దానికి నక్షత్రం అనే మరో అర్థం కూడా ఉందనీ గుర్తించాడు. నిజానికి దీన్ని మొదట ప్రతిపాదించినవాడు బొంబాయికి చెందిన పరిశోధకుడైన ఫాదర్ హేరాస్ (1885 – 1955). ఆ కాలపు ఇతర సాక్ష్యాలను బట్టి చూస్తే వివిధ లిపుల్లో నక్షత్రాల గుర్తులను దైవిక శక్తికి ప్రతీకగా వాడేవారనేది స్పష్టమౌతుంది. అంతేకాక మొహెంజోదడో వంటి నగరాల వీథులన్నీ కచ్చితంగా తూర్పు పడమరలకూ, ఉత్తర దక్షిణాలకూ వేసినవి. అందుచేత అప్పటివారు ఖగోళ పరిశీలనలు చేసేవారనడంలో సందేహం లేదు. ఆ కారణంగా చేప గుర్తులో ఈ అర్థాలన్నీ నిక్షిప్తమై ఉంటాయనే అభిప్రాయం కలిగింది. మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ ఖగోళ ప్రసక్తి తొలి వేదాల్లోనూ ఉంది. దాన్ని అంతకుపూర్వపు స్థానిక సింధునాగరికత నుంచే వేదకాలం వారు స్వీకరించి ఉంటారు. ఎందుకంటే రుగ్వేద కాలపుదే అయిన జెండ్ అవెస్తా అనే జొరాస్ట్రియన్ మతగ్రంథంలో అటువంటిదేదీ కనబడదు. అప్పట్లో ఈ మతస్థులు మన దేశానికి రాలేదు కనక వారికి ఈ వివరాలు తెలియవనుకోవచ్చు.

నక్షత్రాన్ని సూచించడానికి తారని వాడకుండా చేపను వాడడానికి కారణం 'జలభక్తి' అయి ఉండవచ్చు. ఎందుకంటే చేపనే కాక నీటి గేదెలనూ, తాబేలు వంటి జలచరాలనూ, మొసలి బొమ్మలనూ కూడా ఆనాటి పాత్రలమీది చిత్రాల్లోనూ, లిఖిత సమాచారంలోనూ చూడవచ్చు. మాటిమాటికీ చేప గుర్తులు కనిపిస్తున్న వివరాలు చూస్తే 'నీరే ప్రాణాధారం' అన్న పద్ధతిలో అప్పటివారు జీవించి ఉంటారనిపిస్తుంది. చేప గుర్తులు కొద్దిపాటి మార్పుచేర్పులతో దర్శనమిస్తాయి.

|  | చేప | మీన్ | నక్షత్రం |
|---|---|---|---|
|  | పైకప్పు, చేప | మై మీన్ | మై అంటే తమిళంలో కాటుక, ఆకాశం, నల్లని నక్షత్రం లేదా శని |
|  | ఖండించిన చేప | పచ్చ మీన్ | పచ్చని నక్షత్రం, లేదా బుధుడు |
|  | చేప వెంట ఖాళీ స్థలం | వేలి, వెళ్లి మీన్ | మెరిసే తార, లేదా శుక్రుడు |
|  | చేప మర్రిచెట్టు | వట మీన్ | వట, లేదా వడ అంటే తమిళంలో ఉత్తరం అని కూడా, ధ్రువతార |
|  | మర్రిచెట్టు, ఖాళీ స్థలం | వట, వెళ్లి | ధ్రువతార |
|  | ఆరు సంఖ్య, చేప | ఆరు మీన్ | సప్తర్షి నక్షత్రాలు? |



పటంలో చూపిన వివరాలను తమిళాన్నో, లేదా అప్పటి ప్రాథమిక ద్రావిడ భాషనో పోలిన శబ్దాలతో వర్ణించారు. వివిధ గ్రహాలకు ప్రాచీన తమిళ సాహిత్యంలో లభిస్తున్న పేర్ల ఆధారంతో ఊహించారు. కుడి నుంచి ఎడమకు చదవాలి.



వీటన్నిటిలోనూ చేప (మీన్) అనే పదానికి ఉచ్చారణ ద్వారా కొత్త గుర్తులను చేర్చి వేర్వేరు అర్థాలని సూచించే ఇతర పదాలను రాసినట్టుగా కనిపిస్తుంది. ఇవన్నీ పూర్తి వాక్యాలు కావనీ, ఒక్కొక్క సంకేతమూ ఒక్కొక్క పదానికి సూచకంలాగా అనిపిస్తుందనీ ఐరావతం మహాదేవన్ అభిప్రాయం. అతని లెక్కన చేప గుర్తుతో బాటు ఏడు, ఆరు గీతలు కనిపిస్తే సప్తర్షి అనీ, మూడు కనిపిస్తే మృగశిర అనీ అర్థం అయి ఉండవచ్చు.

తరుచుగా చివరి (ఎడమ) స్థానంలో కనబడేది కూజావంటి బొమ్మ. ఇది అప్పటి కులపెద్ద లేదా పూజారి, లేదా నాయకుడి పేరుకు సంకేతం కావచ్చు. ఎందుకంటే మన ప్రాచీనగాథల్లోనూ, పురాణాల్లోనూ తాము కుండల నుంచి పుట్టుకొచ్చామని చెప్పుకునే కుంభసంభవుల్లో రుషులూ, మునులూ ఉండేవారు. ఆ లెక్కన ఈ గుర్తు ఉన్నత జాతి వ్యక్తి పేరును సూచిస్తుందేమో.

పై ముద్రిక బొమ్మలో జడలు ధరించిన ఏడుగురు స్త్రీలు సప్తర్షుల భార్యలు కావచ్చు. అలాగే రెండు కడియాలు కనిపిస్తున్న గుర్తును 'మరుగులు'గా అనుకోవచ్చనీ, అది శ్లేషపద్ధతిలో మురుగన్ (కుమారస్వామి) అనే దైవానికి సంబంధించినది కావచ్చనీ మహాదేవన్ అంటాడు. అతి క్లుప్తంగా కనిపిస్తున్న ఈ సంకేతాలన్నీ వ్యక్తుల, కుటుంబాల పేర్లు అయి ఉంటాయా? రకరకాల గ్రహాలూ, నక్షత్రాలూ వంశనామాలకు ప్రతీకలా? చెప్పలేం. ఇదే పద్ధతిలో ఈ గుర్తుల్లోని ఉడత బొమ్మలకూ, పీత బొమ్మలకూ ద్రావిడ భాషతో సంబంధం కలిగినటువంటి మాటలను అర్థాలుగా వివరించే ప్రయత్నాలు జరిగాయి. అయితే ఇవేవీ కచ్చితంగా రుజువు చెయ్యగలిగిన ప్రతిపాదనలు కావని వీరందరూ ఒప్పుకుంటారు.

ఆధారాలుగా పనికొచ్చేవి చాలా తక్కువ. ఉదాహరణకు సింధు నాగరికతను మెసపొటేమియాలో మెలుహ్హా అనేవారట. దీనికీ మ్లేచ్ఛ అనే పదానికీ సంబంధం ఉందని కొందరంటారు. చిక్కేమిటంటే సింధు లిపి అప్పటి భాషకు సంబంధించినది కావడంతో ఆ భాష మాట్లాడిన వారితోనే అంతరించిపోయింది. ప్రాచీన ఈజిప్ట్ లిపి కూడా అటువంటిదే. సుమేరియన్ కీల లిపి మాత్రం రూపాంతరం చెంది 'అక్కడ్' నాగరికతగా కొనసాగగలిగింది. అందువల్ల దాన్ని చదవడానికి తగినన్ని ఆధారాలు లభించాయి. సింధు నాగరికతకు చెందిన విశేషాలన్నీ, బొమ్మలతో సహా www.harappa.com అనే వెబ్‌సైట్లో లభిస్తాయి. ప్రస్తుతం జరుగుతున్నవన్నీ వాటి గురించిన ఊహాగానాలే. ◆



ఏడుగురు స్త్రీలు

## ఆసియా మానవహక్కుల సంఘం నివేదిక

భారతదేశంలో 2002-07 మధ్యకాలంలో 7468 మంది పోలీస్ కస్టడీలో, జైలులో మరణించారని ఆసియా మానవహక్కుల సంఘం (ఎ.సి.ఎచ్.ఆర్.) వెల్లడించింది. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సైనిక దళాలు, పారా మిలిటరీ దళాల చేతిలో దాదాపు ఏడువేలమంది మృతిచెందారని ఎ.సి.ఎచ్.ఆర్. జూన్ 24న విడుదల చేసిన తన నివేదికలో పేర్కొంది.

## యు.పి.ఎ.కు బి.ఎస్.పి. మద్దతు ఉపసంహరణ

బి.ఎస్.పి. అధినేత్రి మాయావతి యు.పి.ఎ. సర్కార్‌కు మద్దతు ఉపసంహరిస్తున్నట్లు జూన్ 21న ప్రకటించారు. లోక్‌సభలో ఆ పార్టీకి 17 మంది సభ్యుల బలముంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణాల వల్ల మద్దతును ఉపసంహరిస్తున్నట్లు మాయావతి తెలిపారు.

## జమ్మూ కాశ్మీర్ సంకీర్ణ ప్రభుత్వ పతనం

జమ్మూకాశ్మీర్‌లోని గులాంనబి ఆజాద్ ప్రభుత్వం సంక్షోభంలో పడింది. మే 26న జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం సన్మార్గ్, డొమెయిలలో శ్రీ అమరనాథ్ ఆలయ బోర్డ్ (ఎస్.ఎ.ఎస్.బి.)కు వంద ఎకరాల భూమి కేటాయించింది. ఈ నిర్ణయంపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. భూకేటాయింపును రద్దు చేయాల్సిందిగా వివిధ పార్టీలతోపాటు పి.డి.పి. కూడా గులాంనబి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పి.డి.పి. ప్రభుత్వం నుంచి వైదొలగింది. ప్రభుత్వం భూ కేటాయింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టక ముందే గులాంనబి ఆజాద్ తన మంత్రి వర్గంతోపాటు గవర్నర్‌కు జూలై 7న తమ రాజీనామాలు అందజేసారు.

## మావోయిస్టుల వరుస దాడులు

జూన్ 29న గ్రేహౌండ్ పోలీసులు మావోయిస్టుల కోసం గాలింపులు చేసి సీలేరు రిజర్వాయర్‌పై లాంచిలో తిరిగి వెళుతుండగా మావోయిస్టులు కాల్పులు జరిపారు. ఆ అలజడిలో సీలేరు రిజర్వాయర్‌లో గ్రేహౌండ్స్ వెళుతున్న లాంచి మునిగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న 62 మందిలో 38 మంది చనిపోగా, మిగిలినవారు ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ప్రాంతం ఒరిస్సాలోని చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. జూన్ 30న జార్ఖండ్‌లో మావోయిస్టులు పోలీస్ వాహనంపై దాడిచేయగా డి.ఎస్.పి.తో పాటు ఐదుగురు పోలీసులు మరణించారు. జూలై 16న ఒరిస్సాలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్‌లో పోలీసులు వెళుతున్న మైన్ ప్రూఫ్ వాహనాన్ని మావోయిస్టులు మందుపాతరతో పేల్చివేసిన సంఘటనలో 17 మంది పోలీసులు మరణించారు.

## రచన ఆధారంగా వేధింపులు చెల్లవు

ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ఆశిష్ నంది (71) పై ఆయన రాసిన వ్యాసం ఆధారంగా గుజరాత్‌లోని మోడీ ప్రభుత్వం క్రిమినల్ ప్రొసీడింగ్స్ చేపట్టడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. టైమ్స్ ఆఫ్ ఇండియాలో 'మధ్యతరగతినే నిందించా'లని ఆయన రాసిన వ్యాసం మతపరమైన విద్వేషాన్ని రగిలించేదిగా ఉందన్న వాదనను తోసిపుచ్చింది. ఆయనను అరెస్ట్ చేయరాదని మోడీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. జస్టిస్ అల్తామస్ కబీర్, జస్టిస్ జి.ఎస్. సంఘ్వీలతో కూడిన ధర్మాసనం జూలై 1న ఈ ఉత్తర్వులు జారీచేసింది.

## దేశవ్యాప్తంగా లారీ యజమానుల సమ్మె

లారీ యజమానులు తమ డిమాండ్ల సాధనకోసం జూలై 1 అర్ధరాత్రి నుంచి సమ్మె చేపట్టారు. ప్రధానంగా టోల్‌టాక్స్ తగ్గించాలనీ, సర్వీస్ టాక్స్‌లో కొంత మినహాయింపులు ఇవ్వాలనీ, సాధారణ ధరలకు అన్ బ్రాండెడ్ డీజిల్ అందుబాటులో ఉంచాలనీ, 2004లో ప్రభుత్వానికి - గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ (జి.టి.ఎ.) లకు మధ్య కుదిరిన ఒప్పందం అమలు చేయాలని, టోల్ టాక్స్, సర్వీస్ టాక్స్, ఎక్సైజ్ టాక్స్‌ల విధానాన్ని పునర్వ్యవస్థీకరించాలని, దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ సమ్మెను చేపట్టారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చాక మూడు రోజుల సమ్మెను విరమించారు.

## సంక్షోభంలో యు.పి.ఎ. సర్కార్

అణు ఒప్పందం విషయంలో యు.పి.ఎ. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలకు కట్టుబడకుండా ముందుకు సాగుతున్నందుకు నిరసనగా సి.పి.ఐ. (ఎం), సి.పి.ఐ., ఫార్వర్డ్ బ్లాక్, ఆర్.ఎస్.పి. పార్టీలు యు.పి.ఎ. ప్రభుత్వానికి తమ మద్దుతును ఉపసంహరించుకున్నాయి. ఆ పార్టీల కార్యదర్శులు ప్రకాశ్ కారత్, ఎ.బి. బర్దన్, దేబబ్రత బిశ్వాస్, టి.జె. చంద్రచూడన్‌లు జూలై 9న రాష్ట్రపతిని కలిసారు. యు.పి.ఎ. సర్కార్‌కు 59 మంది లెఫ్ట్ ఎం.పి.ల మద్దతు ఉపసంహరిస్తూ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్‌కు నాలుగు లేఖలు సమర్పించారు. అదే సమయంలో బల నిరూపణ చేసుకోవలసిందిగా ప్రధానిని ఆదేశించాలని రాష్ట్రపతిని కోరుతూ ఉమ్మడిగా మరో లేఖను సమర్పించారు.

## ఆరిపోతున్న జీవితాలపై వెలుగుతున్న రిలయన్స్

రిలయన్స్ సంస్థ గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లాలో లాల్‌పూర్ తాలూకాలో చమురు శుద్ధి కర్మాగారాన్ని 1999లో ప్రారంభించింది. దీనిని సెజ్‌గా మార్చుకోవడానికి గుజరాత్ ప్రభుత్వం ఇటీవలే అనుమతించింది. దీనితో నవాగామ్, కనాలుస్, పదనా, కాన్సీకార నాలుగు గ్రామాల్లోని 148 కుటుంబాలు తమ జీవనోపాధిగా ఉన్న 1042 హెక్టార్ల సాగుభూమిని కోల్పోయాయని పి.యు.సి.ఎల్. తన నిజ నిర్ధారణ నివేదికలో వెల్లడించింది. పి.యు.సి.ఎల్., గుజరాత్ లోకసమితి, గుజరాత్ బిరాదరీ సంస్థలు, ప్రజాస్వామికవాదులతో కలిసి మే 6న ఈ గ్రమాలను సందర్శించి వాస్తవాలను వెలికితీసారు. జామ్‌నగర్ రిఫైనరీ కోసం భూములను అమ్మడానికి ఇష్టపడకపోయినా రైతుల నుంచి బలప్రయోగంతో భూములు స్వాధీనపర్చుకున్నారనీ, ఇరవై గ్రామాలకు మంచినీళ్లు సరఫరా చేసే పైప్‌లైన్‌ను రిలయన్స్ తొలగించిందనీ, భూములు కోల్పోయిన వారికి ఉపాధి చూపించలేదనీ తమ నివేదికలో పేర్కొన్నారు. పశువుల మేతకోసం వినియోగించే 551 హెక్టార్ల 'గోచర్' భూమిని రిలయన్స్‌కు స్వాధీనపరిచారనీ, భూగర్భజలాలను రిలయన్స్ విచ్చలవిడిగా తోడేస్తోందనీ తమ నివేదికలో పేర్కొన్నారు. ◆

## ఇరాన్ అదుపులో భారతీయులు

తమ ప్రాదేశిక జలాల్లో చేపల వేటకు అక్రమంగా ప్రవేశించిన 17 మంది భారతీయులతో పాటు, సౌదీ అరేబియాకు చెందిన నాలుగు మర పడవలను ఇరాన్ అదుపులోకి తీసుకుంది. ఆ దేశంలోని బుషేర్ అణు విద్యుత్ కేంద్రానికి 30 నాటికల్ మైళ్ల దూరంలో వీరిని జూలై 4న స్థానిక నావికాదళం నిర్బంధించింది. అయితే భారత ప్రభుత్వ అభ్యర్థనతో 12 రోజుల అనంతరం ఇరాన్ ప్రభుత్వం బందీలను విడుదల చేసింది.

## చైనా బొగ్గు గనిలో ప్రమాదం

చైనాలోని బొగ్గు గనిలో జూలై 6న సంభవించిన ప్రమాదంలో 21 మంది మరణించారు. ఉత్తర చైనాలోని షాంగ్జీ రాష్ట్రంలోగల ఒక బొగ్గుగనిలో కార్బన్ మోనాక్సైడ్ విడుదలై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు తప్పించుకోగా, నలుగురిని సహాయ సిబ్బంది కాపాడారు.

## పాకిస్థాన్‌లో మానవబాంబు పేలుడు

సరిగ్గా ఏడాది తరువాత పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని లాల్‌మసీద్ ప్రాంతం మళ్లీ రక్తమోడింది. మసీదుపై సైనిక దాడి జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా జూలై 7న అక్కడ బహిరంగసభను ఏర్పాటు చేశారు. మదరసా విద్యార్థులు, జైషే మహ్మద్‌లాంటి ఉగ్రవాద సంస్థలు పాల్గొన్న ఈ సభలో మత పెద్దలు ముషార్రఫ్‌ను విమర్శిస్తూ చాలా ఆవేశంగా ప్రసంగించారు. సభ ముగిశాక, అందరూ వెళ్లిపోతున్న సమయంలో ఓ మానవబాంబు తనకు తాను పేల్చుకున్నాడు. ఈ ఆత్మాహుతి దాడిలో 19 మంది మరణించగా, 27 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## కాబుల్‌లో భారతీయ ఎంబసీపై బాంబుదాడి

అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబుల్‌లోగల భారత రాయబార కార్యాలయంపై జూలై 7న జరిగిన బాంబుదాడిలో నలుగురు భారతీయులతో సహా 41 మంది మృతి చెందారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి వి. వెంకటేశ్వరరావు, కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న భారత రక్షణ దళాల అధికారి ఆర్.డి. మెహతాతో పాటు మరో ఇద్దరు ఐ.టి.బి.పి. జవాన్లు ఉన్నారు. వెంకటేశ్వరరావు స్వస్థలం రాజమండ్రి. మరో నెల రోజుల్లో ఆయన స్వదేశానికి తిరిగి వద్దామనుకున్న తరుణంలోనే ఈ దారుణం జరిగింది. దాడికి పాల్పడింది మేమేనంటూ ఏ సంస్థా ప్రకటించలేదు.

## అమెరికా వెన్నులో ఇరాన్ క్షిపణి

జూలై 9న ఇరాన్ తొమ్మిది అధునాతన క్షిపణులను పరీక్షించింది. ఇందులో 2 వేల కిలోమీటర్ల ఖండాంతర పరిధిగల షహబ్-3 మిసైల్‌ను ప్రయోగించింది. ఎడారిలో ఓ గుర్తు తెలియని ప్రాంతంలో వీటిని ప్రయోగించింది. దీంతో ఇజ్రాయిల్, ఇరాక్‌తో పాటు పొరుగుదేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలన్నీ షహబ్ పరిధిలోకి వచ్చినట్లయ్యింది. అణు కార్యక్రమాల విషయంలో ఇజ్రాయిల్, అమెరికా తమ జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని ఈ పరీక్షలతో ఇరాన్ పరోక్షంగా హెచ్చరించింది. ఇరాన్ క్షిపణి ప్రయోగాలపై అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసింది.

## అరబ్‌లపై ఇజ్రాయిల్ 'మూషికాస్త్రం'

జెరూసలెంలో ఉంటున్న అరబ్‌లను తరిమివేయడానికి ఇజ్రాయిల్ మూషికాలను అస్త్రాలుగా ప్రయోగిస్తోంది. పాతబస్తీని ఆక్రమించిన అరబ్ కుటుంబాలను తరిమికొట్టడానికి ఇజ్రాయిల్‌కు ఎలుకలను ఆయుధాలుగా మారాయని పాలస్తీనా వార్తా సంస్థ 'వాఫా' తెలిపింది. 'గత రెండు నెలల నుంచి అక్కడి స్థానికులు ఇనుప బోనుల నిండా ఎలుకలను తీసుకువచ్చి అక్కడున్న మురికి కాలువల్లోకి వదుల్తున్నారు. అవి ఇళ్లలోకి చొరబడుతున్నాయి' అని ఈ వార్తాసంస్థ పేర్కొంది. ఎన్ని విషపదార్థాలు వాడినా ఈ ఎలుకలు చావడం లేదని అక్కడి స్థానికులు వాపోతున్నారు.

## ఇరాక్‌లో అమెరికా దళాల దాడి

ఇరాక్‌లోని తిక్రిత్‌లో జరుపుతున్న దాడుల సందర్భంగా అమెరికా దళాలు గవర్నర్ సలాహిద్దీన్ కుమారున్ని, మేనల్లున్ని చంపివేశారు. ఈ దళాలు గవర్నర్ సోదరి హమద్ అల్-కస్తీ నివాసంలోకి జూలై 20న బలవంతంగా చొచ్చుకుపోయి పిల్లలనూ కాల్చి చంపారని డిప్యూటీ గవర్నర్ అబ్దుల్లా జెబారా అన్నారు. వారివద్ద కనీసం ఆయుధాలు కూడా లేవని ఆయన చెప్పారు. ఇంటి యజమాని పేరూ, అమెరికా దళాలు లక్ష్యంగా పెట్టుకున్న మరో వ్యక్తి పేరూ ఒకటే అయినందున ఈ పొరపాటు జరిగిందని అమెరికా దళాలు తెలియజేశాయి.

## ఎల్.టి.టి.ఇ. కాల్పుల విరమణ

కొలంబోలో జరుగుతున్న దక్షిణాసియా దేశాల సమాఖ్య (సార్క్) సదస్సుకు సంఘీభావంగా జూలై 26 నుంచి పదిరోజుల పాటు కాల్పుల విరమణ పాటిస్తామని ఎల్.టి.టి.ఇ. ప్రకటించింది. 15వ సార్క్ సమావేశాలు జరిగే సమయంలో టైగర్లు ఎలాంటి దాడులకు పాల్పడబోరని ఎల్.టి.టి.ఇ. రాజకీయ విభాగం అధినేత బి. నటేశన్ తెలిపారు. సదస్సు విజయవంతం అయ్యేందుకు పూర్తి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఒకవేళ ప్రభుత్వ దళాలు కవ్వింపు చర్యలకు పాల్పడితే మాత్రం తమ దళాలు ఊరుకోబోవని స్పష్టం చేశారు. అయితే, టైగర్ల ప్రకటనపై స్పందించకపోగా, శ్రీలంక ప్రభుత్వం పోరు కొనసాగుతుందనడం గమనార్హం.

## వినియోగ సంస్కృతిపై పోప్ విమర్శ

అంతులేని వినియోగదాహాన్ని తీర్చడానికి ప్రపంచంలోని ఇంధనాలు, వనరులూ అన్నీ ఖర్చవుతున్నాయని, భవిష్యత్‌తరాలకు వట్టిపోయిన భూగోళం మిగిలిస్తున్నామని పోప్ బెనెడిక్ట్ సిడ్నీలో జూలై 17న అన్నారు. యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ భూగోళం ముఖం మీద భూమికోత, అడవుల నిర్మూలన, ఖనిజ వనరుల, సముద్ర వనరుల దోపిడీ వంటి మచ్చలను మిగులుస్తున్నాం అని ఆయన అన్నారు. ◆

# అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**


మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనె మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైనపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

**(21 జూన్ 2008 నుండి 20 జూలై 2008 వరకు)**

| జిల్లా | ఆత్మహత్యలు | | | హత్యలు | | | | గుర్తు తెలియని | ఆకలి | ప్రమాదాలు | | | చికిత్స అందక, అనారోగ్యం | పోలీసు కాల్పుల్లో | | పోలీసులు, సైన్యం | మిస్సింగ్/ లాకప్ మరణాలు | ప్రకృతి వైపరీత్యాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | వ్యవసాయ రంగం | చేనేత రంగం | ఇతరాలు | ఫ్యాక్షన్ | కులం | మతం | తగాదాలు | | | పనిచేసే స్థలంలో | రహదారి | ఇతరాలు | | ఉద్యమ కారులు | ఇతరులు | | | |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) | (12) | (13) | (14) | (15) | (16) | (17) | (18) | (19) |
| హైదరాబాద్ | – | – | 28 | – | – | – | 23 | 13 | – | – | 39 | 24 | – | – | – | – | 15 | – |
| రంగారెడ్డి | 3 | – | 42 | – | – | – | 11 | 13 | – | 1 | 37 | 24 | 23 | – | – | – | 1 | – |
| మహబూబ్‌నగర్ | 5 | – | 25 | 4 | – | – | 7 | 12 | – | 6 | 49 | 24 | 8 | – | – | – | – | – |
| ఆదిలాబాద్ | 2 | – | 30 | – | – | – | 3 | 5 | – | 5 | 23 | 30 | 20 | – | – | – | 1 | 1 |
| వరంగల్ | 7 | – | 37 | – | – | – | 11 | 6 | – | 7 | 35 | 22 | 17 | – | – | – | 1 | 6 |
| కరీంనగర్ | 9 | 1 | 49 | – | – | – | 6 | – | – | 18 | 36 | 14 | 6 | – | – | – | – | 5 |
| నల్గొండ | 12 | – | 34 | – | – | – | 9 | 12 | – | 5 | 68 | 36 | 14 | – | – | – | – | 2 |
| శ్రీకాకుళం | 1 | – | 8 | – | – | – | 9 | – | – | – | 29 | 14 | 13 | – | – | – | – | – |
| విజయనగరం | 2 | – | 4 | – | – | – | – | – | – | – | 19 | 13 | – | – | – | – | – | 2 |
| విశాఖపట్నం | – | – | 12 | – | – | – | 3 | 13 | – | 5 | 16 | 5 | 1 | – | – | 6 | 1 | – |
| తూర్పు గోదావరి | | – | 34 | – | 1 | – | 7 | 7 | – | 5 | 31 | 28 | 8 | – | – | – | 1 | – |
| కృష్ణా | 1 | – | 20 | – | 1 | – | 9 | 2 | – | 4 | 26 | 18 | 3 | – | – | – | 2 | 4 |
| గుంటూరు | 1 | – | 5 | – | – | – | 26 | – | – | 1 | 28 | 10 | 1 | – | 1 | – | – | – |
| ప్రకాశం | 1 | 1 | 16 | – | 1 | – | 11 | 14 | – | 6 | 46 | 7 | – | – | – | – | – | – |
| చిత్తూరు | 1 | – | 30 | – | – | – | 7 | 6 | – | 10 | 66 | – | 4 | – | – | – | 1 | 3 |
| కర్నూలు | 13 | – | 67 | 2 | – | – | 11 | 7 | – | 13 | 38 | 36 | 17 | – | – | 1 | 8 | – |
| *ఇతర జిల్లాలు | – | – | – | – | – | – | 3 | – | – | – | 8 | 3 | – | – | – | – | – | – |
| మొత్తం | **59** | **2** | **441** | **6** | **3** | **-** | **156** | **110** | **-** | **86** | **594** | **308** | **133** | **-** | **1** | **7** | **32** | **23** |

ఈ శీర్షికకు సహకారం అందిస్తున్న వారు :
హైదరాబాద్ – డి. విజయభాస్కర్; రంగారెడ్డి – వి. శంకరయ్య; మహబూబ్‌నగర్ – ఏసురత్నం; ఆదిలాబాద్ – శ్రీమన్నారాయణ మూర్తి; వరంగల్ – కె. శ్యాంరావు; కరీంనగర్ – ఎల్. సంతోష్;
మెదక్ – పి. రాజు; నల్గొండ – డి. మహేష్; శ్రీకాకుళం – జి. సుధీర్; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – కె.వి. రమణ; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్;
కృష్ణా – బి. రమేష్‌బాబు; గుంటూరు – బి. అంజమ్మ ; ప్రకాశం – ఎన్. రవికుమార్; చిత్తూరు – పలమనేరు బాలాజి; * ఇతర జిల్లాల సమాచారం

RNI Regn.No.APTEL/2003/11482 Published 29/07/2008 **PRINTED BOOK**




జారీచేసినవారు : సమాచార మరియు పౌర సంబంధాలశాఖ

R.O.No. 233/Sou/Advt.I/2008-09